(6)


# మీ ప్రియమైన పుత్రుడు

మీ పూర్వజన్మ తపఃఫలరూపుడగు మీ చిన్నిబిడ్డని, మీరెంతయో జాగ్రత్తతో పోషించుచున్నారు. వాని చిన్నతనమునుండియు మీ మీ శక్తుల ననుసరించి అతని కేకొరంతయు లేకుండునట్లు చూచుచున్నారు. సర్వవిధ సౌఖ్యములయందును నోలలాడించుచున్నారు. అతని సౌఖ్యముల కెంతయో ధనము వెచ్చించుచున్నారు. చాల ధనము పెట్టుబడిపెట్టి విద్యాబుద్ధుల గఱపుచున్నారు. కాని యుక్తవయస్కుడై, విద్యావంతుడై, పట్టభద్రుడై జీవితరంగమున, కాలు బెట్టినవెంటనే అనేకవిధములగు సమస్యలు ఆతని నెదుర్కొనుచున్నవి. ఉద్యోగములా, లేక వ్యాపారమునకా, పుష్కలమగు ధనము పెట్టుబడి యవసరము. కనుక అందులకు మీరేమి సదుపాయము చేసితిరి? మీరు చేయు సదుపాయములు భద్రమైనట్టివియు నిశ్చయమైనట్టివియు యుండవలయును. కాని ఒడుదుడుకులు ఉండునట్టివిగా నుండకూడదు. అట్టి సదుపాయమెద్ది? ఇందులగురించి వివరములు కావలసినచో యీక్రింది అడ్రస్సుకు 10-వ నెంబరు పట్టీ నిమిత్తము వ్రాసినచో బడయవచ్చును.

జయ్ విజయ ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్.

16, లింగిచెట్టివీధి, మదరాసు.



# అమోఘమగు ఔషధము

## శుక్లనష్టమును పోగొట్టుటలో రత్నపురుషలేహ్యం

పలుచబడిన వీర్యమును గట్టిపఱచి అమితముగా వీర్యవృద్ధిని కలిగించు మూలికలకు రాజు అనదగిన 'రత్నపురుష' ప్రధానద్రవ్యముగా చేయబడిన ఈ లేహ్యమును క్రమముగా సేవించువారు కాయపుష్టి: కంఠపుష్టి నొంది బలారోగ్యములను పొందుదురు. వెంటనే వ్రాయుడు. డబ్బీ రూ. 3-0 ).

చరకనిలయము, ఆయుర్వేదౌషధశాల, రాజమండ్రి. (లేక) 2/40 పెద్దినాయునివీధి, మద్రాసు.



# తర్కసంగ్రహము

తర్కశాస్త్ర పారంగతుడగు అన్నంభట్టు సులభార్థబోధకముగ తర్కసంగ్రహమను గ్రంథమును సంస్కృతమున రచియించెను దానికి ఆంధ్రతాత్పర్యమును రచియించి చరకమతదీపికాఖ్యాయుర్వేద మత వివరణములో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి యల్.ఐ.యమ్., హెచ్.పి.ఐ.యమ్ గారు వెలువరించియున్నారు. ఆయుర్వేదమునకు అత్యావశ్యకమైన పదార్థవిజ్ఞానపటముకూడ ఇందుకలదు. ఆయుర్వేదములో వ్రాయబడిన ఈ గ్రంథము ప్రతి ఆంధ్ర ఆయుర్వేదవైద్యునకు ఎంతయు ఉపకరించును విద్యార్థులుకూడ చదువదగినది. వెల రు. 1—0—0.

—ఆంధ్రభూమికార్యాలయం, వేపేరి, మద్రాసుకు వ్రాసిన బడయగలరు.

# విషయసూచిక


౧. సంపాదకీయసమాలోచన ... ౫
౨. రుచీదేవి ... ౯
—శివరామకృష్ణప్రసాదు, బి.ఏ.
౩. జ్వరము ... ౧౭
—స్థానాపతి రుక్మిణమ్మ
౪. విమానం సరదా ... ౧౯
—తాత కృష్ణమూర్తి, బి.ఏ., యల్.టి.
౫. సవర్ణహైందవ ప్రబోధము ... ౨౫
—శ్రీ. నారాయణమూర్తి, బి.ఏ.
౬. దయయెక్కడో దేవుడూ అక్కడే. ౨౬
—తల్లాప్రగడ ప్రకాశరాయడు, యం.ఏ.
౭. పశువు ... ౩౦
—'మూర్తి'
౮. జైనగ్రంథాలయములు ... ౩౭
—మారేమండ రామారావు ఎం.ఏ.బి.ఇడి.
౯. బాధ్యతలు ... ౪౪
—కోడవటిగంటి కుటుంబరావు


ఈ సంచికయందు ప్రచురింపబడిన సినీమా చిత్రములు మద్రాసునందలి చమయాటాకీ డిసిబ్యూటర్సు దయతో నొసంగినవి. ఇందుకు వారికి మా కృతజ్ఞతాభినందనములు.


## వైద్యయోగరత్నావళి

(వెలువడినది) వెల రు 2—0—0.

సంపాదకుడు :—ములుగు రామలింగయ్యగారు.

ఇందు గవర్నమెంటు G.O. 2411 of 1929 నెంబర్లుగల పుస్తకమందు సర్వప్రకరణములను చేయుపద్ధతి విరముగ వ్రాయబడినది. మరియు సాంప్రదాయయోగములును, అవసరమైన పరిభాషయు నిందు చేర్చబడినవి. ఇది ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్లకును, ఔషధములను తయ్యారుచేయు ఫార్మసీలవారికిని, ఇతరవైద్యులకును మిక్కిలి యుపయోగకరము. చాలా పరిశ్రమచేసి మూలగ్రంథములను సంపాదించి ప్రకరణములను వివరించివ్రాసి వానికి ఆంధ్రతాత్పర్యము వివరముగ వ్రాయబడినది.

వలయువారీ క్రింది చిరునామాలకు వ్రాయవలెను :—

ములుగు రామలింగయ్యగారు,

ది ఇండియన్ మెడికల్ స్టోర్సు, [రిజీష్టర్డు] తెనాలి, గుంటూరుజిల్లా.

మదరాసు ఏజన్సీ—ఆంధ్రభూమి కార్యాలయం, వేపేరి, మ॥ా

*Saraswata Niketanam*
VETAPALEM



సినీమానటి నూర్జహాన్



ఈస్టిండియా ఫిలింకంపెనీవారి 'లవకుశ' లోని ఒక దృశ్యము

స్థాపితము ౧౯౩౩. సాలుచందా రు. 1—8—0.

# ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు సచిత్రాంధ్ర మాసపత్రిక

సంపుటము ౩. యువ, ఆషాఢము, జూలై 1935. సంచిక ౧.

## సంపాదకీయ సమాలోచన

### స్వవిషయము —

పరమేశ్వరానుగ్రహమునను, పెద్దల ఆశీర్వచనబలమునను 'ఆంధ్రభూమి'కి రెండు సంవత్సరములు నిండి ఈ సంచికతో మూడవవత్సరము ప్రారంభమగుచున్నది. ఆంధ్రభూమి ప్రారంభించిన గడియ మంచిదియైనది. ఆర్థికమాంద్యము వీరవిహారము సల్పుచుండినను భాషాప్రియులును, ఆంధ్రాభిమానులును అగు మహాశయు లెందరో చందాదారులుగ చేరి ఆంధ్రభూమికి ఈ ప్రారంభదినములలో జనమును, జీవమును ప్రసాదించిరి. అడుగుటయే తడవుగ తమ కంపెనీల ప్రకటనలనిచ్చి ఆంధ్రవణిక్పుంగవులు ఈ పత్రికకు పోషణప్రోత్సాహము లిచ్చిరి. ప్రసాదించిరి, ఇచ్చిరి కావుననే అర్థబలముకాని అంగబలముకాని లేని ఈ పత్రికాసంపాదకుడు దీనినిట్లు జయపథమును పట్టింపగలిగినాడు. ఇంతదనుక ఇంత శీఘ్రకాలములో ఏ ఒక తెలుగుపత్రికయు పొందియుండనంతటి ప్రచారబాహుళ్యమును ఆంధ్రభూమి అందినది. నిజాము రాష్ట్రములోని ఆంధ్రభూమి గ్రాహకుల సంఖ్య శతాధికమైనది. బర్మాలోని చందాదారుల సంఖ్య ఇంతకంటెను హెచ్చు. మిగిలిన రాష్ట్రేతర భాగములలో కలకత్తా, ఖరగ్‌పూర్, జెమ్‌షెడ్‌పూర్, ఢిల్లీ, లక్నో, పూనా, బొంబాయి, మైసూరు, కోయంబత్తూరు, సేలం మున్నగు తావులయందున్న ఆంధ్రగృహములలో ఆంధ్రభూమి ప్రియమగు స్థానమును సంపాదించినది. ఇక ఆంధ్రమండలములలో ఆంధ్రభూమి గ్రాహకుల సంఖ్యాధిక్యమునుబట్టి గుంటూరుమండలము అగ్రస్థానమును వహించుచున్నది. రెండు సంవత్సరములకు పూర్వపు టాంధ్రపత్రికలస్థితినిబట్టి చూచినచో నేటి ఆంధ్రభూమి అభివృద్ధి నిజముగా గర్వింపదగినదే. కాని ఈ రెండు సంవత్సరములలో తెనుగు పత్రికలను విరివిగా కొని చదువువారి

సంఖ్య మూడురెట్లు అయినది, దేశమున 0-2-0 కు అమ్ము పత్రికలు విజృంభించి విద్యావ్యాప్తికి విశేషముగ తోడ్పడుచున్నవి. విడిసంచిక వెల 0-2-0 లుండుట అమ్మువారికిని, కొనువారికిని వర్తకసరళిలోని మామూలైనది. ఈ పరిస్థితులలో ఆంధ్రభూమి వెలకూడ 0-2-0 కు తగ్గించవలసినదిగ పదేపదే వ్రాసిన మిత్రులయు, ఏజంట్లయు ఆదేశము నిపుడు శిరసావహించుచున్నాము. విడిసంచికల వెల తగ్గింపుతోబాటు సాలుచందా 1-8-0 కు తగ్గించితిమి. సాలుచందా స్వల్పము కావున ఇకమీదట అర్ధవత్సరమునకు చందాలు అంగీకరింపజాలము. పాతరేట్లప్రకారము ఇప్పటివఱకు చందాలుకట్టియున్నవారికి ఇకముందు వారికి పంపవలసియున్న సంచికలకుగాను ఈ తగ్గింపురేటు ననుసరించి లెక్కసరిపోవునట్లు హెచ్చు మాసపుసంచికలు పంపగలము. ఇంతదనుక ఆంధ్రభూమికి హృదయపూర్వకముగ సాయమొనర్చిన పూజ్యమహాశయుల కెల్లరకును కృతజ్ఞతా పూర్వకవందనము లర్పించుకొనుచు ఇకముందుకూడ వారట్టి ఆదరాభిమానములనే ఆంధ్రభూమిపయి చూపుచుందురని ఆశించుచున్నాము. తగ్గింపు చందారేట్లతో ఈపత్రిక ఇప్పటికంటె విశేషజనామోదమును బడయగలదనియు, అచిరకాలముననే దీని గ్రాహకుల సంఖ్య రెట్టింపు కాగలదనియు నమ్ముచున్నాము.

## చెన్నపురి ఆంధ్రులదా? అరవలదా?

చెన్నపురి నిర్మాణము ఆంధ్రులదే నని చరిత్ర చెప్పుచున్నది. ఆంధ్ర పద్మనాయక రాజవంశమునకు చెందిన దామెర అయ్యనృపతి తనతండ్రి చెన్నభూవరునిపేర ప్రళయ కావేరి (పులికాట్) మైలాపురములమధ్య చెన్నపట్టణమును కట్టించెనని దామెర అంకభూపాలుని ఉషాపరిణయము ఎలుగెత్తి చాటుచున్నది. ఒక్క నిర్మాణవిషయముననే కాదు నిర్వాహణవిషయమునకూడ చెన్నపురి ఆంధ్రులదే అగుట అడ్డుచెప్పరానిది. 1630-వ సంవత్సరమున ఆంగ్లేయుడగు ఫ్రాన్సిస్ డేదొర ఈ దిబ్బపై నిలుచుటకు హక్కుసంపాదించినది ఆంధ్రప్రభువులగు చంద్రగిరి రాజులనుండి. నాటినుండి మూడుశతాబ్దులలో గోగుకామవలె పెరిగిన చెన్నపురి వర్తకమునందు, ప్రభుత్వమునందు ఆంధ్రులు పైచేయిగానే ఉండుచువచ్చిరి. కాని నేటికిది సత్యమూర్తిగారి డబ్బావాయింపుతో అరవపట్టణము కానున్నది. మాంచెస్టరుగార్డియన్ పత్రికాసంపాదకమహాశయుడుగా నుండి మూడుసంవత్సరములక్రితము కీర్తిశేషుడైన సి.పి. స్కాట్ ఒకసారి వచించినట్లు భారతదేశపు జాతులన్నిటిలో విశేషముగా గవర్నమెంటు గుమాస్తాలను పుట్టించినజాతి అరవజాతి. అగుట మదరాసు ప్రభుత్వకార్యాలయములందు అరవలు ప్రారంభమునుండియు గుమాస్తాగిరులను చేపట్టి వారిభాషను కోర్టుభాషగ నొనర్చుకొనిరి. మదరాసు వర్తకులలో అధికసంఖ్యాకులు సెట్టులేయగుటయు, ఆ సెట్టులందరును తెలుగువారే యగుటయు సుప్రసిద్ధవిషయమే. కాని తెలుగువారగు సెట్టులందరును కోర్టుభాషయగు అరవము నేర్చుకొనవలసినవారైరి. కార్పొరేషనువారుకూడ అరవముపై చూపుమక్కువ ఆంధ్రముపై చూపకుండిరి. కాగా మదరాసునందు తమిళభాషాప్రాబల్యము కల్గినది. దీనిని సాకుగకొని సత్యమూర్తి నేడు చెన్నపురి అరవలదేనను వాదమును లేవనెత్తినాడు. వాచాలత్వమున తాను ఉత్కృష్టుడైయున్నాడు. తన వాదమునకు భళాభళియనుటకు తమిళుల పలుకుబడి అగ్గలముగగల మదరాసు ఆంగ్లదినపత్రిక లున్నవి. ఎసెంబ్లీ ఎన్నికలలో తనకు ఆంధ్రులు కావించిన

సాయము మనసునందుంచుకొనవలసిన అవసరమిప్పుడులేదు. తాను కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డునకు కార్యదర్శి. అచటకూడ తనమాట నెగ్గగలడు. సత్యమూర్తి ఇంత బహిరంగముగ ఈ విషయము చెప్పువఱకు అతడు ఆంధ్రులకు ప్రబలప్రతికూలుడని పలువురు గ్రహింపలేదు. గ్రహించియేయుందురేని ఎసెంబ్లీ ఎన్నికలలో అతనికొఱకు అందరు ఆంధ్రులు నడుములు విఱుచుకొని ఏల పనిచేయుదురు? రాయలసీమఆంధ్రులను వెన్నుతట్టి వారిని ఉత్తరసర్కారు ఆంధ్రులనుండి చీలదీసి ఆంధ్రవిశ్వవిద్యాలయమునకు ఆంధ్రభోజుని రాష్ట్రములేకుండ తీర్మానింపచేయుట - మదరాసు కార్పొరేషనుకార్యాలయమునందు ఒక ఆంధ్రునకు రెవిన్యూ ఆఫీసరు ఉద్యోగము లభింపనున్నపుడు అక్కసువెళ్ళబోయుట - ఉత్కళయువకసమావేశమునకు అధ్యక్షుడై ఉపన్యాసవాక్యములతో ఉత్కళులను ఆంధ్రులపై ఉసికొల్పుట—ఇట్టివెన్ని ఎన్నికలకుముందు ఆంధ్రులకు ప్రతికూలముగా సత్యమూర్తి గావించినవి? వీనినెల్ల విస్మరించి ఆంధ్రులు విశాలహృదయముతో ఎసెంబ్లీ ఎన్నికలలో సత్యమూర్తికి సాయముచేసిరి. చెట్టెక్కుట కుపయోగించిన నిచ్చెన చెట్టెక్కినతరువాత తన్నివేయవచ్చునుగదా? సత్యమూర్తిగారి సత్యస్వరూపము తెలియవచ్చినది కావున ఆంధ్రులిక నాతనిని దాయాదినిచూసినట్లు చూచుచు విశేషమగు ఆందోళనజరిపి మదరాసున తమస్థానము నిలుపుకొందురుగాక! సైమన్ కమీషను బహిష్కరణమునాడు తుపాకిదెబ్బకు గుండెవిఱచి ఆంధ్రకేసరి నిలువవలెనా? ఉప్పు సత్యాగ్రహసమరసమయమున మదరాసుపేరు నిలుపుటకు ఆంధ్రనాయకులు పూనుకొనవలెనా? కౌన్సిలు పదవులు, మంత్రిపదవులు కానున్ననేడు వారిచ్చట నిలువకూడదు, పూనుకొనరాదు. త్యాగము ఆంధ్రులది—భోగము అరవలదినా? కష్టము ఒకరికి—కడెము ఒకరికినా? ఆంధ్రుడా! నీ కష్టమునకు తగినఫలము, నీ త్యాగమునకు తగిన ఖ్యాతి పొంద కోరికగలదా? చెన్నపురిలో నీ స్థానము నీవు నిలుపుకొనుము. నీ త్యాగమునకు ఈ మదరాసుగడ్డ దద్దరిల్లినది. నీ కార్యశౌర్యమునకుకూడ అది దద్దరిల్లుగాక! చివరలు చినిగినతరువాత చేట చింకిదేయగును. ఆంధ్రరాష్ట్రమునకు ఉత్తరపుకొనను ఉత్కళులు తెంపుకు పోయినారు. పశ్చిమపుకొన కోయుటకు కర్ణాటకులు బళ్లారిరాళ్ళపై కత్తులు నూరుచున్నారు. దక్షిణపుకొన - మూడువందల సంవత్సరములుగ నీరాష్ట్రదాయములో విశేషభాగము వెచ్చించి సుందరతమముగ నొనర్చియున్న - దక్షిణపు కొనను కత్తిరించుకొని పోవ సత్యమూర్తి సాధనచేయుచున్నాడు. ఈ సాధనకు ప్రతిసాధనచేసి నీ హక్కును నీవు కాపాడుకొని జాతిగౌరవమును నిలబెట్టవలసియున్నది.

## లండను ఆంధ్ర రాయబారము :—

లండనుపోయియున్న ఆంధ్రరాయబారులు తిరిగి వచ్చిరి. ఆంధ్రరాష్ట్రనిర్మాణము విషయమై వారు చెప్పిన విషయము లివ్వి: "ఆంధ్రరాష్ట్ర నిర్మాణ విషయమై మన కనుకూలములైన విషయము లనేకములు గలవు. సింధు, ఒరిస్సా రాష్ట్రములు ప్రత్యేకింప బడినప్పుడు ఆర్థికముగాగాని జనసంఖ్యయందుగాని పరిపాలనాసౌష్టవమునకుగాని ఏవిధమగు అభ్యంతరములులేని ఆంధ్రరాష్ట్ర మింతవరకు ఏర్పడకుండుటకు గల కారణము సింధు ప్రజలు, ఉత్కళులు నిరంతరమైన ఆందోళన కావించుటయు, మనవారిటీవల యావద్భారత

సమస్యలలో మునిగి తేలుచు ఆంధ్రరాష్ట్రమును గూర్చి ఔదాసీన్యము వహించుటయు నవలసియున్నది. పార్లమెంటువారు ఆంధ్రరాష్ట్రనిర్మాణమును ఆక్షేపించుటకు ప్రత్యేకమగు హేతువెద్దియునులేదు. ఆంధ్రులపక్షమున బలయుతమగు రాయబార మింగ్లండునకు వెడలి పార్లమెంటు సభ్యులకును, అధికారులకును విషయములన్నిటిని సాకల్యముగ నివేదించి కొంచెము వ్యయప్రయాసలకోర్చి పనిచేసియుండిన ఉత్కళుల కంటె ముందెన్నడో మనకు రాష్ట్రము సిద్ధించి యుండెడిదే. ఇదివరలో మనముచేసిన ప్రయత్నములు తగినంత పట్టుదలతో చేయబడకపోవుట విచారకరము. ఆంధ్రులు తమ ఆశయమును బడయ నెంచినచో ఇప్పటికిని అసంభవ మేదీలేదు, ఫెడరేషన్ ఏర్పడువరకు ఆంధ్రరాష్ట్రనిర్మాణమునకై వేచి యుండ పనిలేదు. రాష్ట్రస్వపరిపాలన ఏర్పడిన యనంతరము ఫెడరేషన్ స్థాపింపబడుటకు కొంతకాలవిలంబనము జరుగకతప్పదు. ఈలోపుగా నూతనరాష్ట్రసభయందు ఆంధ్రరాష్ట్ర తీర్మాన మామోదింపబడవలెను. అంతట పార్లమెంటువారివద్దకు ముఖ్యులగు వారు రాయబారము వెడలి పార్లమెంటు సభ్యులను అధికారులను వీక్షించి, వారికి నచ్చచెప్పవలెను. ప్రత్యేకరాష్ట్రమును నిర్మించుటకు పార్లమెంటునకు బ్రిటీషు ప్రభుత్వమునకు హక్కు గలదు. రాబోవు శాసనసభ ఎన్నికలందు ఆంధ్రరాష్ట్రసమస్యపై పోటీజరుగుట ముఖ్యావసరము.'' రాష్ట్రసంపాదనవిషయమున ఆంధ్రులు చేయగల తుది ప్రయత్నములలో రాబోవు ఎన్నికలందు ఈసమస్యపై పోటీజరుగుట ముఖ్యమైనది. అలసత్వము వహించి ఊరుకొనుచో ఫెడరేషన్ ఏర్పడిన తరువాత ప్రత్యేక రాష్ట్ర నిర్మాణము దుస్తరము కాగలదు. అన్నిపార్టీల ఆంధ్రనాయకులును ఒకచో సమావేశమై ఇందు విషయమున ఒక కార్యప్రణాళిక తయారు చేసికొని వెంటనే కార్యరంగమునకు దుముకుట అత్యవసరము.

**రాయలసీమ క్షామము : మదరాసు కార్పొరేషను విరాళము :—**

రాయలసీమలో క్షామదేవత ఘోరవీరవిహారము గావించుచున్నది. ఒక్క అనంతపురమండలమునందే ప్రభుత్వమువారి రిలీఫ్‌వర్క్సునందు లక్షమందికి పైగా పనిచేయుచున్నారు. ఆ ఒక్కమండలమునందే ప్రభుత్వమువారు నెలకు రెండులక్షల రూపాయిలను వెచ్చింపవలసివచ్చుచున్నది. ఈ నడుమ కొద్దిపాటి వర్షముపడినది కాని అది రిలీఫ్‌వర్క్సులో పనిచేయుచున్న కొందఱినేని వ్యవసాయమువైపు ఆకర్షించుటకు చాలియుండలేదు. ఇట్టి పరిస్థితులలో అచ్చటి కాటకబాధితులు విశేషముగ సాహాయ్యమునర్థించుట సహజము. మదరాసు కార్పొరేషనువారు రాయలసీమక్షామనివారణకుగాను మూడువేల రూపాయిల విరాళము నిచ్చుటకు తీర్మానించిరి. కార్పొరేషనుసభలో ఈ తీర్మానమును కొనివచ్చి నెగ్గించిన ఆంధ్రప్రముఖుడు గద్దె రంగయ్యనాయుడుగారి నెంతయు అభినందింతుము. ఈ తీర్మానమును ప్రతిఘటించిన కార్పొరేషను సభ్యులలో కొందఱు ఆంధ్రులుకూడ ఉండియుండుట శోచనీయము. ఆంధ్రదేశమున లోగడనే కొన్ని మునిసిపాలిటీలును, కొన్ని జిల్లాబోర్డులును రాయలసీమక్షామ నివారణనిధికి యథోచితముగ సాయపడియున్నవి. కొదువయున్న మునిసిపాలిటీలును, జిల్లాబోర్డులును సాధ్యమగునంత త్వరలో రాయలసీమకాటకబాధితులకు ధనసాహాయ్యము గావించుట ధర్మము.

# రు చీ దే వి

(వ చ న రూ ప క ము.)

అంకము ౬ : రంగము ౧.

కాలము : సాయం సమయము.

స్థలము : విజయనగర రాజభవనమునం దొక గది.

(కృష్ణరాయలు, ఆలోచనతో కుర్చీపై కూర్చుండి యున్నాడు. బిరబిర లోనికరుదెంచిన అప్పాజి రాయని తిలకించి.)

అప్పాజి :—ప్రభూ ! ఏమిశలవు ?

రాయలు :—ఒక ముఖ్య విషయమును మీ కెఱిగింపదలచి మిమ్ము పిలువనంపితిని.

అ:—దయతో ఆవిషయ మేదో నా కెఱిగింపుడు.

రా :—కూర్చుండుడు, నా పలుకులను విని నా యనుమానమునుదీర్పుడు.

అ:—(ఆలోచనతో) అట్లే యొనరింతును.

రా:—నిన్నటి రోజు వేటతమకమున మన యడవికి సపరివారముగ నేగితిని. తూర్పువైపునున్న కొండకనుమ వెంట కొంతదూరము నడచి, అచట పరివారమును నిలుపనాజ్ఞాపించి, భటుల నిఱువుర వెంటనిడుకొని దట్టముగనున్న యరణ్యమును ప్రవేశించి, మృగములకై వెదకి, తుదిని మిగులయలసిపోయి చేయునదిలేక నీటికై నల్గడల పరికింప మొదలిడితిమి. కొంతదూర మాయరణ్యమున పోవునప్పటికి,ఒకచో నొకపెద్ద చెరువు గన్పించెను. మన యరణ్యమునం దంతపెద్ద జలాశయము కలదని నేనెన్నడును వినియుండలేదు. ఇదివర కెన్నిమోసారు లాదారివెంట పోయియున్నను, అచ్చటా జలాశయమును గాంచలేదు. ఆ ప్రదేశమంతయు పచ్చబడి యున్నది. ఆచెరువు నందలి నీరు నిర్మలముగనున్నది—‘ఈ చెరువెవ్వరు త్రవ్వించిరి ? ఇంతటి కార్యము నెవరు తలపెట్టి ఈనట్టడవియందు నిర్విఘ్నముగ నిర్వహింపగల్గిరి ?’ అని నాలో నేను ఆలోచింప మొదలుపెట్టితిని. ఇంతలో నా చెరువుకట్టపై ఒకమనుజుడు నా కంటబడెను. వానిని నేను చేరబిలచి ‘ఈ చెరువెవ్వరు త్రవ్వించిరి ? ఇచ్చటకు సమీపమునం దేగ్రామమున్నది?’ అని ప్రశ్నింప, ఆ మానవుడు నా మొగముగాంచి మెల్లగానవ్వి‘మీ రీతల్లి పేరు వినలేదా ? ఈ చెరువును మాయమ్మ వరదరాజేశ్వరి త్రవ్వించెను. ఇచ్చటకు కొలది దూరములోనే మాగ్రామమున్నది. ఆగ్రామముపేరు కంబపురి, ఈచెరువును కంబము చెరువందురు. మాయూర నొక పెద్ద ధర్మశాల కలదు. అన్ని కులములవారికి, అన్ని వేళల అచ్చట అన్నదానముచేయబడును. మా గ్రామమునకు నీటికరవు, కూటికరవు వదలిపోయి చాలదినములైనది. ఈ యమ్మ మాయూర ప్రవేశించినది మొదలు పచ్చని తోరణము కట్టని గృహము, పదిమంది చేయి కడుగని రోజు లేదు. మీరు అలసియున్నారు, నా వెంట రండు, ధర్మశాలకడ మీకు పిండి వంటలతో భోజనము పెట్టింతును. మాతల్లి

చల్లగానున్నచో మా కేకొఱంతయు లేదు. అన్నపూర్ణయనియు, వరదరాజేశ్వరి యనియు ఆమెను మేము పిలచుకొనుచున్నాము. రండు మీకు కమ్మని భోజనము పెట్టింతును.' అని యాతడు ముందునకు నడువ నేనును వాని వెంట నడువ దొడగితిని.

అ:—(ఆశ్చర్యముతో) ముందడుగు వైచినారా?

రా:—అప్పాజీ! నాకేమియు తోచలేదు, వానివెంట నడచిపోయితిని.

అ:—(తలయూపుచు) ప్రభూ! ధర్మమే జయించును—తరువాత నేమిజరిగినది?

రా.—గుఱ్ఱమును వెంటనున్న భటుల కప్పగించి, వారి నచ్చటనే నిలచియుండ నియమించి, నే నా క్రొత్తమనుజుని వెంట నడువ దొడగితిని. ఇట్లు కొంతదూర మేగునప్పటికి, అచ్చటొక రమ్యమగు వనమునందు కొన్ని కుటీరములు గన్పట్టెను. మే మా కుటీరములను సమీపించినంతనె అచ్చటివారంద రాదరమున మమ్మాహ్వానించిరి. అచ్చటి వారంద రేలనో నన్నుగాంచి గుసగుస లాడుకొనజొచ్చిరి. వీరిని తిలకించినకొలది నాకాశ్చర్య మెక్కువగుచుండెను. ఇంతలో నొకభటు డచ్చట కరుదెంచి నాకు దారిజూపుచు నన్నొక కుటీరములోనికి గొనిపోయెను. అప్పాజీ! ఆకుటీరమెంత రమణీయముగ నలంకరింపబడి యున్నదో తెల్పుటకు భాషకు శక్తిచాలదు. 'ఆ నట్టడవిలో ఆచక్కని కుటీరమేమి? అన్ని విలువగల వస్తువు లాకుటీరములోని కెట్లు వచ్చెను?' అని నే నాశ్చర్యముతో చూచుచుండ నా కనులొక చిత్రపటముపై బడెను. కొంచెము సమీపమున కేగి చూతునుగదా, అది నా రూపపట మేయని తెలసికొంటిని. ఆ పటము చుట్టును పెక్కు పూలమాల లలంకరింపబడి యుండెను. ఆపటమున కెవరో ప్రతి దినము పూజచేయుచున్నట్లు గన్పట్టెను— ఇంతలో నొకదాసి సువర్ణపళ్ళెరమున కొన్ని ఫలముల నుంచుకొని, వేరొక కలశమున నిర్మలమగు నీటిని గొనివచ్చి, వాని నచ్చట నొక వేదికపై నమర్చిపోయెను. వానిని భుజించి, కొంతకాల మచ్చట విశ్రమించి, అలసట బాపుకొని, ఈ విషయమును మీ కెఱిగింపదలచి, అచ్చట వారు గావించిన గౌరవమునకు సంతసమును వెలువరించి, వెంటనే బయల్వెడలి పరివారమునుగలసికొని ఇచ్చటకు వచ్చి చేరితిని. అప్పాజీ! మీయభిప్రాయమేమి? ఇది స్వప్నముకాదు గద!

అ:—ప్రభూ! అచ్చటనున్నవా రెవరేని మిమ్ము గుర్తించిరా?

రా:—నాకేమియు తెలియదు. జరుగుచున్న దంతయు సత్యమేనా యని నాలో నే నాశ్చర్యపడ జొచ్చితిని. ఆకొలది కాలము నన్ను నేనే మఱచియుంటిని.

అ:—ప్రభూ! ఇది కలియుగమైనను, ఇంకను ధర్మమే జయించుచున్నది నిజము నిలుకడమీద తెలియకపోదు. కపటవర్తనము గలవారి బ్రతుకు తుదిని కడగండ్లపాలు గాక మానదు. సన్మార్గవర్తనులకు సంకటములు కలిగినను అవి సూర్యోదయ కాలమునందలి మంచువలె మటుమాయమగును—ఆనట్టడవి యందు, ధర్మశాల నిర్మించి, తటాకము త్రవ్వించి, బీదలపాలిటి కామధేనువై యలరుచున్న ఆ మహాసాధ్వి, మహారాణి గుచీదేవి. చెంగల్వరాయ డచ్చటనే వారిని వదలివచ్చినట్లు కొలది కాలము క్రింద నాకు తెలియ వచ్చినది. మీయనుగ్రహమును సంపాదింప ఆయమ్మ ఎన్నియోవిధముల ప్రయత్నించుచున్నది. స్వార్థపరుడగు గజపతి ఆమె జీవితము

నీరీతి నిస్సారమొనరించెను. ఆమె మిమ్ము మన సార ప్రేమించుచున్నది, ఈ విషయము మీ కిదివరలోనే, నేను మనవిచేసియుంటిని.

రా:—అప్పాజీ! పడకటింట భర్తను పరిమార్ప నడుముబిగియించిన పడతికి ఈ విధముగ ధర్మశాల నిర్మించి అన్నదానము చేయవలయుననెడి సత్సంకల్పము తనంత దా కలుగునా ?

అ:—(చిరునగవుతో) మీ పలుకులనే త్రిప్పిచూడుడు! ఈరీతి ధర్మశాల నిర్మించి అన్నదానము చేయుచున్న పడతికి, పడకటింట పతిని పరిమార్పవలయుననెడి యూహ తనంతదా కలుగునా ?

రా:—(గంభీరముగా) కలుగదా ?

అ:—ముమ్మాటికిని కలుగదు. అట్టిపనికి పరులచే ప్రేరేపింపబడ వలయును.

రా:—అట్లయినచో ఆమె నిర్దోషియనియే మీరు తలంతురా ?

అ:—ప్రభూ! ఇపుడు నన్నీవిషయమును గూర్చి నిర్భయముగ మాటలాడనిండు. మీ హృదయ ముడికిపోవుచున్నదని తలచి నేనపుడు మిన్నకుంటిని. ఆమె నిజముగ నిర్దోషి. ఆమె తండ్రియే ఈదారుణకృత్య మొనరింప నామెను ప్రోత్సహించెను. ఈప్రయత్నమును వమ్మొనరింప ఆమె మిగుల ప్రయత్నించి యుండును, కాని గజపతి ఆమె పలుకులను పెడచెవిని పెట్టి యుండును. ఆతని విధమంతయు నే నెఱుంగుదును. ఆమె మిమ్ము మనసార ప్రేమించుచున్నది, అట్లేగాకున్న పుట్టినింటి కేగక నట్టడవియం దేల నిలచియుండును ?

రా:—ప్రయత్నము ఫలవంతము కాక పోవుటచే !

అ:—ప్రయత్నము ఫలవంతము కాకున్నను ప్రమాదములేదు. ఆమె తన జనకుని యాజ్ఞ నెరవేర్ప ప్రయత్నించినది, కాని ప్రయత్నము విఫలమైనది. అంతమాత్రమున కామె జనకునిదరిజేరుట కేల వెనుకాడవలసి వచ్చెను ?

రా:—మీప్రశ్నలకిపుడు సరియగు సమాధాన మొసగజాలను.

అ:—ఆమె హృదయమును పరీక్షించిన తరువాతనే ఈ ప్రశ్నలకు మీరు సమాధాన మొసగగలరు.

రా:—ఆమె హృదయమును మన మేరీతి పరీక్షింపగలము ?

అ:—మదిలో కోరికయున్న మార్గము దొరుకకపోదు. నా వెంటరండు, మనమా ధర్మశాలకడ కేగి వింత నాటకమాడింతము.

రా:—ఏమి నాటకము.

అ:—(చిరునగవుతో) ఆనందముతో నంతమగు నాటకము.

రా:—మీపలుకులు నా కర్థ మగుట లేదు. నాకిది యంతయు నొక స్వప్నమువలె గన్పట్టుచున్నది.

అ:—ఆమెను పరీక్షించుట మొదటిపని, పరీక్షించి ఆమె నిర్దోషియని తెలిసికొనుట రెండవపని. మనము ప్రచ్ఛన్న వేషములతో నొకభటుని, వెంటనిడుకొని రేపే కంబపురి కేగవలయును. మనవెంట వచ్చు భటుడు, కటకపురి భటునిరీతి వేషమును ధరింపవలయును.

రా:—(ఆలోచనతో) అట్లే కానిండు.

అ:—ప్రభూ! శలవు గైకొందును. పయనమునకు రేపటిదినము సిద్ధముగ నుండవలయును. [నిష్క్రమించును.]

రా:—(ఆకాశము వెంట చూపులనిగిడ్చి) ఆమె నిర్దోషియా! లోకప్రవృత్తి నెఱిగిన అప్పాజి సహితము నట్లే పలుకుచున్నాడే! ఆమె

హృదయము విషపూరితముకాదా? కాకున్న అట్టిపని కేల తలపడును? జనకునిచే ప్రేరేపింప బడినదని కదా అప్పాజి పలుకుచున్నాడు. ఒకరిచే ప్రేరేపింపబడి ఇట్టి పనులను సహితము, మానవు లొనరింప వెనుదీయరా? మానవుల మానసము లింత బలహీనము లేమి?—తమ హృదయములను తాము పరీక్షించుకొని పరుల పలుకులకు తావు నొసంగక ప్రవర్తించువారు లోకమున లేరా? ఔను అట్టివారున్నారు. పరుల ప్రేరణచే తమ వ్యక్తిత్వమును గోల్పోయి, తోలుబొమ్మల వలె తైతక్కలాడువారు లోకమున లేరా? ఔను అట్టివా రున్నారు. అబ్బా! ఎన్నిరకములు? ఆమె రెండవరకమునకు చెందినదై యుండును. ఛీ! ఛీ! పరుల పలుకుల నాలించి భర్తను పరిమార్చుటయా? పరుల పలుకు లంత మధురములా? పరు లెవరు? కన్నతండ్రియే కదా! ఆమె ఒకవైపు తండ్రిని, వేరొకవైపు భర్తను, సంతృప్తిపరుపవలసివచ్చెను కాబోలును? నిజముగా ఆమె స్థితి శోచనీయము—నా హృదయము జారిపోవుచున్నది—కాలమున కెంతటి ప్రభావమున్నది! హృదయమును మాడ్చివైచు పరిభవానలము సైతము కాలముగడచిన కొలది చల్లబడును సుమా! హృదయమునందలి కోపతాపములు శాశ్వతములు కావు. అవి కాలమున కనుగుణముగ మారిపోవుచుండును. నిన్నటి శత్రువు నేడు మిత్రుడగును, నేటిమిత్రుడు రేపు శత్రువగును. ఇది కాలమహిమ—ఆమె తలంపు లెట్లుండును? ఆమె పుట్టినింటికేల పోలేదు?—ఇంతగా చింతింప పనిలేదు – అప్పాజి రేపటిదిన మొక నాటక మాడించునట చూతము.

(లేచి, ముందునకు నడచును)

(తెర.)

అంకము ౭. రంగము ౧.

సమయము: ఉదయము.

స్థలము: కంబపురిలో రుచీదేవి కుటీరమున.

[పనులన్నియు తీర్చుకొని దేవి కుటీరమున కూర్చుండి యున్నది. ఇంతలో నొకదాసి లోనికరుదెంచి సవినయముగ.]

దాసి:—అమ్మా! కటకపురినుండి యొక భటు డుత్తరమును తెచ్చియున్నాడు. ఆజ్ఞయైనచో జాబును తీసికొనివత్తును.

రుచీదేవి:—(మొగముచిట్లించి) కటకపురినుండి! ఏమిజాబు? ఎవరు పంపిరి?

దా:—మీ యమ్మగారు పంపిరట.

రు:—ఎందులకు పంపిరి? నాతో వారికింకేమిపని గలదు? అయినను జాబును తీసికొని రమ్ము విషయములేమో విచారింతము.

దా:—చిత్తము (నిష్క్రమించును).

రు:—మాయమ్మ కిన్నాళ్ళకు జ్ఞాపకము నకు వచ్చితిని కాబోలు! కనికరము లేక కసాయిపని గావింప బ్రోత్సహించిన జనకు డేమైనాడు?.....

(జాబుతో దాసియు, పద్మయు ప్రవేశింతురు)

పద్మ:—అమ్మగారు జాబువ్రాసిరని విని నేనును వచ్చితిని. ఆజాబు తెచ్చిన భటుడెవరో క్రొత్తవాడు. మన మీప్రాంతములలోనికి వచ్చినతరువాత నొకరిలో చేరెనట. అందరు క్షేమముగా నున్నారని తెల్పినాడు.

రు:—పద్మా! వచ్చితివా! ఏదిజాబు, విప్పి చదువుము.

ప:—తల్లీ! మీారేల చదువకూడదు.

రు:—ఏమో నిరుత్సాహముగా నున్నది. నీవే చదివి వినిపింపుము.

ప:—(జాబుతీసికొని విప్పి కొంచెము బిగ్గరగా)

చిరంజీవి సౌభాగ్యవతి యగు రుచీదేవికి. మీాజనని ఆశీర్వదించి వ్రాయు విషయ మేమన :

కుమారీ!

నీ జనకుని యభీష్టమును దీర్ప నీవు గావించిన ప్రయత్నము విఫలమైనట్లు వినియున్నాము. అయినను వంశగౌరవము నీరీతి నిలువబెట్టుటకు ప్రయత్నించినందుల కందరమును సంతసించితిమి. నీవు మా ఋణము దీర్చుకొంటివి. దాసీపుత్రుడగు కృష్ణరాయని పరిభవించితివి. ఇకచాలును. నీవు వెంటనే కటకమున కరుదెంచక ఇంకను ఆదాసీపుత్రుని రాజ్యమునందుండుట పాడికాదు. సత్వరము సపరివారముగ రమ్ము. ఆనట్టడవి కాపుర మెందులకు? నీవే యరణ్యమునందున్నది తెలియసందున ఈభటుని ముందు పంపియున్నాము. నీజాబు చూచినంతనె, సగౌరవముగ నిన్ను శ్రీ మహారాజుగారు కటకమునకు గొనిరాగలరు. వెంటనే ప్రత్యుత్తరము వ్రాసి పంపవలయును. ఇట్లు,

నీ ప్రియజనని,

గజపతి మహారాణి.

రు:—(కోపముతో) ఆ యుత్తరమును, పద్మా! విసరిపారవేయుము.

ప:—పారవేసిన ప్రయోజనమేమి? ప్రత్యుత్తరము వ్రాయుటయే మంచిది.

రు:—(ఆలోచించి) అట్లే గావించెదను. ఆలసించిన అమృతమే విషమగునట! (కొలది కాల మాలోచించి, జాబువ్రాసి, పద్మను గాంచి) ఇదిగో యుత్తరము. వానికొసంగి వలయువిధమున భోజనమిడి కటకమునకు పంపివేయుము.

ప:—అట్లే గావించెదము.

(దాసితో పద్మ నిష్క్రమించును.)

రు:—(కంటనీరుగ్రమ్మ) మాజనకుని యుపదేశము కాబోలును! మాయమ్మ, ఎంత మారిపోయినది! ఈ క్రోధమున కెంత శక్తి కలదు! ఇంతటి క్రౌర్యము, ఇంతటి మాయోపాయము, ఇంతటి, అసహనముగల మానవులెట్లు, మృగములకన్న మిన్నయగుదురు?— ఛీ! ఈబ్రతుకికి నిరర్థకము. ఈ సముద్రమునకు, అంతులేదు,......(ఉలికిపడి) కళ్యాణమందిరమున కేగుసమయము దాటిపోయినట్లున్నది. ఈ నిరర్థకపు టాలోచనలతోడనే నాబ్రతుకు గడచిపోవుచున్నది. (సత్వరము లేచి వెలుపలకు వెడలిపోవును.) (తెర)

అంకము ౭ : రంగము ౨.

సమయము : మధ్యాహ్నకాలము.

స్థలము : కంబముచెఱువునకు కొంతదూరమునందున్న ఒక చింతచెట్టు నీడయందు.

[ప్రచ్ఛన్న వేషములతో, కృష్ణరాయడు, అప్పాజి, కూర్చుండియుందురు. అప్పాజిని రాయలు తిలకించి, ఆతురతతో]

రా:—మనము పంపినభటుడు వచ్చుచున్నాడు చేతి యందొక జాబు కానవచ్చుచున్నది.

అ:—(మెడనిక్కించి చూచి) ఔను, ఆమె ప్రత్యుత్తరము పంపియుండును. ఆజాబు నిజముగా తల్లియే వ్రాసినదని తలచి ఆమె జవాబు వ్రాసియుండును. ఈ కపటనాటక మామె కెఱుకలేదు; అమాయకురాలు.

రా:—ఆమె కీవిషయము తెలియదు. ఎన్నటికిని తెలియబోదు.

అ:—ప్రస్తుతము తెలియకున్నను; కొలది దినములలో నంతయు తెలిసికొనగలదు.

రా:—(ఆలోచనతో మిన్నకుండును.)
(భటుడు ప్రవేశించి అప్పాజికి జాబు నొసగును)

అ:—నిన్నెవరైన గుర్తించిరా?

భటుడు:—నన్నెవరును గుర్తించలేదు, కాని కటకమునుండి వచ్చిన పద్మయను దాసి మాత్రము కొన్ని ప్రశ్నలువైచినది, వలయు రీతి జవాబొసంగితిని.

అ:—మంచిది నీ వాచెట్టునీడకు వెడలి పొమ్ము. (రాయని తిలకించి) ప్రభూ! జాబు విప్పి చదువమనియెదరా?

(భటుడు నిష్క్రమించును.)

రా:—అట్లే కానిండు.

అ:—(జాబు విప్పి, రాయలవైపునకు తిరిగి కొంచెము బిగ్గరగా.)

ఉమాసమానురాలగు శ్రీశ్రీ తల్లిగారికి, మీపుత్రిక, రుచి, వందనములాచరించి చేయు విజ్ఞాపన.

తల్లీ! మీ యుత్తరము చేరినది. నే నీ నట్టడవియందే యున్నాను; ఇచ్చటనేయుందును. కాలమహిమచే చల్లబడిపోవుచున్న హృదయము మరల రగులజొచ్చినది. కానక కానక కన్నకూతురు నిట్లు కారడవుల కప్పగించి, ఇంకను రమ్మని కబురంపుచున్నారా? ఈనట్టడవియే నాకు పుట్టినిల్లును, మెట్టినిల్లును, కావున నేనీస్థలమువదలి కదలవలసిన పనిలేదు. కోమలమగు నాహృదయమున విషముపోసి, కనరాని వినరాని పనిజేయ నన్ను ప్రోత్సహించి, తుదిని నా జీవితమిట్లు నిస్సారమొనరించిన మీరు నాకు తలిదండ్రులేనా? భర్తచే పరిత్యాజింపబడి, సాటివారిలో పరిభవింపబడి, పరులచే దూషింపబడి, సౌఖ్యముల వదలి, నిలువ నీడ లేక, ఆదరించు దిక్కులేక, నా యనువారు లేక, ఈనట్టడవిలో నామరూపములు లేకుండ నాశనమై పోవలసినదే కాని, ఇంకను పుట్టినింట కాలిడుదునా? ఏనాడు వలదని వారించినను, పాదములంటి మ్రొక్కినను, దీనముగ బ్రతిమాలినను, నాపలుకులను పాటింపక భర్తను వధింపుమని నాతండ్రి నా కరములందు కత్తినిడెనో ఆనాడే నాపుట్టినింటికిని నాకును ఋణముతీరిపోయినది. అమ్మా! నీ కూతు రపుడే చనిపోయినది; ఇపుడు బ్రతికి యున్న దొక పెనుభూతము. ఏమి, ఇంకను ఆ రాజచంద్రుని దాసీపుత్రుడని పలుకుచున్నావా? మాయత్త-తన సవతితో చదరంగమున నోడిపోయి, వారు నిర్ణయించుకొనిన పందెమువెంట, ఆమెకు దాసివలె కొలది నిముసములు మెలగినంత మాత్రమున ఆమె దాసియైనదా? ఇట్లే పందెమున నోడిపోయి, ఇతర దేవేరు లెన్నిసారు లామె కూడిగ మాచరింపలేదు? సరదాకై నిర్ణయించుకొనిన ఆటలలోని విషయములనా పాటింపవలసినది? సాగివంశ పారావార రాకాసుధాకరునకా కళంక మాపాదింపబడునది? ఇక చాలును, నాకు మీరు జాబులను వ్రాయవలదు. నేను కటకమునకు రాజాలను. ఏనాటికైన, ఏవిధనైన, విజయనగర పురాధీశ్వరుని కరుణబడసి, ఆ నరపాలుని పాదాంకములచెంత నాత్మార్పణము గావింప వేచియున్నదానను. పరాత్పరుడు

రాతిగుండెవాడు కాదుగదా!

ఇట్లు
రుచి.

(ఉత్తరము చదువుట ముగించి, అప్పాజి, రాయల మొగముగాంచి సంతసమున.)

అ:—రాజా! అనుమానము తీరినదా? ఆమె హృదయము నెఱింగితిరా? ఆసాధ్విని ఆ సట్టడవియం దుంచుట, ఇంకను యుక్తముగా తోచుచున్నదా?

రా:—(కనుల నీరుగ్రమ్మ, చిరునగవుతో) అప్పాజీ! ఆమె నిర్దోషి. ఆమె నిర్మల హృదయము నెఱిగితిని.

అ:—కపటనాటకమునకు మంగళహారతి ముగిసినది. ఈ వేషములతో నింక మనకు పని లేదు; నాటకమునకు చక్కని ముగింపు వచ్చినది.

రా:—(అప్పాజీకి నమస్కరించి) ఈ ముగింపునకు మీరే కారకులు.

అ:—రాజా! పరాత్పరుడు లోకమునం దిట్టి నాటకముల నెన్నింటిని, ఆడించుచున్నాడో? ఎందరు బుద్ధిమంతులు పరులచే పరిభవింపబడి, దుఃఖానలమున దూలుచున్నారో? ఎందరు కపటవర్తనులు సంతసమున కాలము బుచ్చుచున్నారో? ఏదెట్లున్నను, ధర్మమే జయించును, అధర్మము ప్రథమమున జయించినట్లు కానవచ్చినను, తుదని ఆధారములేక అల్లాడవలసివచ్చును. ఇది ముమ్మాటికి నిజము. ఈ కలియుగమందును, ఈ సూత్రమునకు లోపమురాలేదు. ఇంక మన మూర కుండుట మంచిదికాదు, సత్వరము కంబపురి కేగుదము. (ఇరువురు నిష్క్రమింతురు.)

(తెర.)

అంకము ౭ : రంగము 3.

సమయము : సాయంకాలము.

స్థలము : కంబపురియందలి కుటీరములకు చేరువనున్న తోటయందు.

(కృష్ణరాయలు, మంత్రి తిమ్మరుసు, తోటలో నొక వృక్షమునకు చాపున నిలచి యుందురు. తలవంచియున్న కృష్ణరాయని వైపు తిరిగి, అప్పాజి.)

అ:—ప్రభూ! నేను ప్రథమమున కుటీరములోని కేగెదను. నేను పిలచినంతనే దయతో మీరును లోనికి రావలయును.

రా:—అట్లే కానిండు, మీపిలుపుకై నేనిందే వేచియుందును.

(అప్పాజి కుటీరములోని కేగి గవాక్షము కడ నిలచియుండును. ఇంతలో నొక దాసి, అచ్చట కరుదెంచి అప్పాజిని తిలకించి, కొంచెము వెనుకడుగువైచి.)

దాసి:—అయ్యా! తామెవ్వరు.

అ:—విజయనగర సంస్థానాధిపతి యగు కృష్ణరాయలవారి ప్రధానామాత్యుడను. నాపేరు తిమ్మరుసు. శ్రీమహారాణిగారి దర్శనార్థమై వచ్చియున్నాను. లోనికి రుదెంచుటకు, ఆజ్ఞకై వేచియున్నాను.

దా:—(తత్తరమున) అయ్యా, ఈ వృత్తాంతము దేవిగారికి తెల్పెదను. ఇందే యుండుడు. (దాసి పరుగుపరుగునపోయి దేవికీ వృత్తాంత మెఱుకపరచి తిరిగి వచ్చి మంత్రి సత్తముని గాంచి.)

దా:—లోనికి రావచ్చును. దేవిగారా ద్వారముకడ తెరవెనుక నిలచియున్నారు.

(దాసి దారిజూప, మంత్రివర్యుడు తెర సమీపమున కేగి, సవినయముగ.)

అ:—తల్లీ! నేను మంత్రి తిమ్మరుసును. నీవు మాకు తల్లివి; మేము నీ బిడ్డలము తనయుల సన్నిధిని తల్లి కీ మరుగెందుల కమ్మా?

రు:—(మెల్లగా) మీరునాకు తండ్రికన్న మిన్నయైనవారు. కేవలము అంతఃపుర మర్యాద ననుసరించి ఇట్లు తెరవెనుక నిలచినందులకు క్షమింపవలయును.

అ.—ఇంకను వెనుకాడుటెందులకు? (తెరతొలగించి. కనులవెంట నీరుగార, జడలు కట్టియున్న కురులతోడను, మలినవస్త్రములతోడను, ఆభరణములులేని బోసి మెడతోడను, తలవంచి నిలచియున్న మహారాణిని తిలకించి, గుండె నీరుకాగా, దుఃఖమును దిగ మ్రింగి, వినయము వెల్లివిరయ) తల్లీ! మీరు విజయనగరమునకు విచ్చేయవలయును. మీ హృదయమును మామహారాజుగారు నేటికి తెలిసికొనిరి.

రు:—(దేహమంతయు వణకుచుండ. పొరలివచ్చుచున్న దుఃఖమును దిగమ్రింగుచు హీనస్వరముతో) అప్పాజీ! ఆమహారాజు నన్ను క్షమించెనా? నాకొక్క కోరిక కలదు. ఆ దయామయుని పాదములపై బడి శరణువేడుకొందును; దర్శనము లభించునా? పాతకురాలను; ఆ మహారాజు పాదములంటుకొనుటకు నా కర్హతగలదా? నాకనులు తిరుగుచున్నవి. అప్పాజీ! అప్పాజీ! అనుగ్రహముంచుము. (నేలపై సాష్టాంగముగ పడును. అప్పాజి, వెలుపలనున్న రాయలకు సైగ చేయ మహారాజు లోనికరుదెంచును. అప్పాజి వెలుపలకు వెడలిపోవును—నేలపై బడియున్న దేవిని తిలకించి, రాయలు ప్రతిమవలె నిలచిపోయెను. అట్లే పడియున్న దేవి, మహారాజును తిలకింపకయే మిగుల హీనస్వరమున) నాదేవునకు నాపై దయగల్గెనా! అదియే పదివేలు. అప్పాజీ! తుదికోర్కె తీరునా? నాస్థితి నారాజున కెఱిగింపవా?

రా:—(మెల్లగా) ప్రియా! నేనే ఇచ్చటకు వచ్చియున్నాను. కనులువిప్పిచూడుము.

రు:—(కనులువిప్పిచూచి వెఱ్ఱిదానివలె దిశలు పరికించి, తనలోతాను నవ్వుకొని, మహారాజు పాదములపై తన శిరముంచి గట్టిగాపట్టుకొని) స్వామీ! ఈరాక్షసి క్షమియింపబడినదా?

రా:—నేనే తొందరతో నిన్ను వెడల నడిపించితిని. నీ ప్రవిమలమగు హృదయమును గుర్తింపక ఈరీతి నిన్ను హింసించినందులకు క్షమింపుము (ముందునకువంగి దేవిని మెల్లగా నిలువబెట్టి కనులనీరు తుడచుచు:) ప్రియా! ఈ వేషమేమి? రూపమెంతయో మారిపోయినది!

రు:—స్వామి! నేను నిర్దోషిని, నన్ను క్షమియింపుము.

రా:—ఆపలుకులిక వలదు, నీవు నిర్మించిన ధర్మశాలను, తటాకమును, నాకు చూపింపవా? రేపటి దినమే విజయనగరమున కేగుదము, సామానులను, ఈనాడే భద్రపరుపవలయును.

రు:—(చిరునగవుతో) స్వామీ! నన్ను క్షమింపుడు. ఈనాటికి నాబ్రతుకు ధన్యమైనది. మీపాదసేవ........

రా:—(మాటకడ్డువచ్చి, ఆదరమున:) ఇంకను ఆతలంపులేల? నిన్ను మనసార ప్రేమించుచున్నాను; ఇదిగో నీచెక్కులపై గుర్తు. (ముద్దిడును.) (తెర)

[సంపూర్ణము.]

—చిరుమామిళ్ళ శివరామకృష్ణప్రసాదు, బి. ఏ.

# జ్వరము

౧

పదియుఁ దొమ్మిది వందలుఁ బై ముప్ప
దైదవ యేండ్లు నేప్రెలు నెల నందు పదియు
మూఁడ్వ తేదీని నడిరేయి ముగియుచుండ
లిప్తలో వచ్చెను పెను చలిజ్వరమ్ము.

౨

వచ్చినిల్చిన 'ఫీవరు' వదలకుండ
నిమిష నిమిషమ్ము దేహమ్ము నిప్పుఁ జేసె
మిగుల గిరికొని దుర్గుణాల్ మితియు మీఱ
నీళ్ళ కడవలెయయ్యె మాకళ్లు నాఁడు.

౩

ఏమిరా! తెల్లవారునా! ఏది దిక్కు
ఇరుగు పొరుగును లేదయ్యె మెలుఁగునెత్త
ఇంటఁ రెండవ మగదిక్కు యేమికలదు?
బాలురను యేము నున్నాము యేలచెపుడ?

౪

ప్రాణములుచేత నిడుకొని బ్రతికియుండ
వెదురుఁబొదఁ బుట్టమును విచ్చువిధము తోప
మెల్లగాఁ జీకటులుజారి తెల్లవారె
కాని:—యుష్ణమా సుంతైనఁ గదలలేదు.

౫

అంత వైద్యులరప్పింప నరయ నెవరు
గలరు? ఆయన నేస్తులా కానరారు
మొదట రోజునఁ గోచియు మొరగినారు
కాంచవలె మిత్రులు గుణాలు కష్టవేళ.

౬

ఎట్టులో సద్దయాత్ముల బట్టి వారి
మిత్రమగు వైద్యుఁ బిలిపించి యాత్రముడుగ
ఆయనయుఁ గొంతపనిచేసి అట్టె వదలె
అరయుగావలె దైవోప హతుల గతులు.

౭

మందుమాకులు లేకయు నుంచమందు
రెండు రోజులు బాధతోనుండ వారి
బాల్య మిత్రము, నటుపైని బ్రాణదాత,
అమృత హస్తుఁడు, పూర్వెద్ధి యన్వవాయు
లైన సీతరాములు వచ్చి యరసినారు.

౮

అరసి యమృత హస్తమ్ముతో నారుమార్లు
మందునివ్వంగ రోగమ్ము మాయమయ్యె
సూర్యరశ్మికిఁ దుహినంబు సురిగినట్లు
గళిము దిగునంత గుణమీయ వలదె మందు.

౯

ముమ్మరమ్మైన జ్వరములో ముగుద నౌట
భయముచే నాదు తండ్రికిన్ బంధుతతికి
ఉత్తరాలను వ్రాసితి నులకరైరి
ఎవరిబాధలు వారివే యెరుఁగుడయ్య.

౧౦

వీఁడు కొమరుండు మిత్రుఁడు వీఁడు బంధు
వితఁడు మావాఁడె యెరుగరా! ఇతని – మేన
మామకొడుకు సుమండని మహిమ మీర
వలయుచో కల్పుదురు నేటి బంధమింతె

౧౧

దైవమనుకూల పడనిచో ధరణియందు
కష్టములపైని కష్టాలు గంపెడౌదవు
కష్టకాలాన నేరును గానరారు
అరయ వీనినే ప్రారబ్ధ మండ్రు బుధులు.

౧౨

మంచమును బట్టె మెల్లగా మాసమయ్యె
మాసమును మాకు తోడ్పడ్డ మాన్యులెవరు?
తమ్ముఁడును, మిత్ర మన్నియుఁ దానెయగుచు
నరసెగా గరిమెళ్ళ కామావధాని.

౧౩

పనులు కలిగియు వారిపై ప్రణయమున్న
మిత్రములు కొందరెట్టులో యాత్రమునను
తీరము దొరకిన సమయాన నరుగుదెంచి
పలుకరించిరి లేనిచో బ్రతుక గలమె?

౧౪

ముందు మందిచ్చిన సఖుండు మొనసివచ్చి
నంపులకు, రెండుపొట్లాల మందు వెలకు
నారు రూపాయలకు 'బిల్లు' నంపినాఁడు
గోరుచుట్టుపై రోకటఁ గొట్టినట్లు.

౧౫

కష్టసుఖములు తెలియక కరుణలేక
సహరహమ్మును నౌఖరీ యంటగట్టి
నెలకు పదునైదు రూకలు చిలుక వాని
తోఁ బ్రతుకుమాకు, యీబుణాల్ తొలఁగు
టెట్లు?

—స్థానాపతి రుక్మిణమ్మ.

# విమానంసరదా

చెట్లమీదుగా, గుట్టల మీదుగా, యిండ్ల మీదుగా, కోవెల గోపురంమీదుగా, ఒదుగుతూ, తేలుతూ, ఊగులాడుతూ, బ్రహ్మాండమైన చప్పుడుతో విలాసంగా ఊరుచుట్టూ ఒకసారి వలయాకారంగా గ్రద్దవలె తిరిగి, రెప్పపాటులో నది దాటి ముందుకుసాగింది ప్లేను. గోదావరివంటి మహానదే అప్పుడు నా దృష్టికి గోచీపీలికవలె కనబడినప్పుడు, యిక తక్కినవి ఎట్లా కనబడి ఉండాలి? భగవంతుని సృష్టిలోకల్లా ఎంతో గొప్పవాడనని విర్రవీగుతూ, రొమ్ము విరుచుకొని నడిచే నరుడు ఎంతో చిన్నగా, అల్పంగా, హీనంగా క్రుంగిపోయి, భూమట్టానికి అణచుకొనిపోయిన పురుగువలె, నలుసువలె అస్పష్టంగా కనబడినాడు! ఆ యెత్తునుండి అన్నీ తిలకిస్తున్నప్పుడు నా కంటికి భూలోకమే చిన్నదై పోయింది. ఎత్తుగా, యింకా యెత్తుగా, మేఘమండలమున ఎగురుతున్నప్పుడు నాదృష్టికసలు పుడమిమీది చలనశక్తిగల జీవరాసులేవీ అగపడనేలేదు. జనులు, జంతువులు, బండ్లు, అన్నీ క్రమంగా చిన్నచిన్నవై, ఆకారంలేనివై, రంగులమచ్చలై, నలుసులై, రేణువులై, చూస్తూఉండగానే అంతలో అదృశ్యములైనాయి. భూమిమీది ధ్వనులు, కోలాహలం, ఏవీ వినరాలేదు. పరాభవింపబడి, మూగవోయి, మూర్ఛిల్లిన అనాథవలె కదలక మెదలక నిద్రించుచున్నట్లుండెను భూదేవి! నిశ్శబ్దంగా, కళాహీనంగా, జీవము చలనములేని వ్రాతపటమువలె ఎత్తుపల్లాలేకమై కనబడింది నేల.

నభోంతరాళమున విహరిస్తున్నప్పుడు నిజంగా నాకూ, యీ భూలోకానికీ సంబంధమేమున్నదనిపించింది! దేవలోకసంచారినగు నాకు అబద్ధాలతో, కలహాలతో, అజ్ఞానంతో మట్టినంటి ప్రాకులాడే క్షుద్రజీవులగు నరపురుగు లెంతో హీనంగా, అసహ్యంగా, అల్పులుగా కనబడ్డారు! విమానంలో విహరిస్తున్నంతసేపూ ఏదో స్వేచ్ఛానందం ఆవరించింది నా హృదయాన్ని. భూమిమీది నా దాస్యజీవనం, అసత్యప్రవర్తన, సంఘభీతి, సంసారతాపత్రయం, అన్నీ నా జీవితాన్ని సంకెళ్ళవలె బంధించిన త్రుప్పుత్రాళ్ళవలె పుటుకు పుటుకున తెగిపోయినవి. భూలోకచిత్రాలను 12000 అడుగుల యెత్తునుండి వేడుకతో తిలకిస్తూ, స్వేచ్ఛగా నిర్మలాకాశమున గంధర్వునివలె ఎగురుతున్నప్పుడు నిజంగా నన్ను నే మరచిపోయినాను. తోడిమానవులకన్న నే నధికుడననీ, స్వర్గమునకు వారికంటె నే నెంతో చేరువను ఉన్నాననీ, ఏదో వెర్రి సంతోషంతో, గర్వంతో, అర్థంకాని పరవశత్వంతో గంతులాడింది నా హృదయం.

సముద్రపు టలలను ఛేదించుకుంటూ నిర్లక్ష్యంగా ముందున కెగబడే నౌకవలె, ఎదురుగాలిని సరకుగొనక, దూదిపింజలవలె ఆకసమున అక్కడక్కడ నూగులాడు తెల్లమబ్బులను దొల్చుకొని పోసాగింది ప్లేను. ఎలుగెత్తి పాడుకుంటూ, జువ్వన రెక్కలపై తేలియాడే విహంగంవలె అది యింజన్ మ్రోతతో. రెక్కలకుదుపుతో, గంటకు నూరుమైళ్ళను మించిన త్వరితగమనంతో అంతరిక్షమున కెగసి, దక్షిణముఖంగా ప్రయాణం సాగించింది. మధ్యాహ్నపు టెండ చురుసుతూ అప్పుడప్పుడు పశ్చిమకిటికీనుండి నా మొగంమీద పడుతూఉండేది. కొలదిగమాత్రమే తెరచిఉండిన మైకా కిటికీల ద్వారా రయిమని ఎంతో బలంగా వీచేది గాలి. క్రిందికి దిగజారుతూ, పైకిలేస్తూ, గాలికెరటాలపై ఉయ్యాల ఊగుతున్నట్లు తమాషాగాపోయేది ప్లేను.

కొంతసేపటికి, ఏదోకష్టపడి పనిచేసి అలసిపోయినవానివలె నిస్సారంగా నా ఆసనమున వీపుపై చేరబడి, కాళ్ళుచాచి, 'కాబిన్'పై కప్పువేపుచూస్తూ, వెల్లకిల పడుకున్నాను. అలవాటులేని వానికి త్రాగుడు వికారపెట్టేటట్లుగా, ఎన్నడూ విమాన మెక్కి ఉండని నాకు ఆవింత అనుభవంవలన కొంచెం ఒళ్ళు త్రిప్పింది. యదేచ్ఛగా గాలి వీస్తూఉన్నా, ఉక్కపోసి, ఏదో తాపంగా ఉండెను. కోటు విప్పివేశాను. మెడనున్న కాలరు, నడు

మున బిగించుకున్న పటకా ఊడదీసినాను. జోళ్లు విప్పుకున్నాను. దుస్తుల చిరాకు సాధ్యమైనంతవరకు తగ్గించుకొని, సదుపాయంగా మెత్తని నాస్థానమున ప్రక్కకు ఒత్తిగిలి, విశ్రాంతిగా పడుకున్నాను. కళ్ళు మూసుకున్నాను. కాని వికారం అణగలేదు. తల గిర్రున తిరిగినట్లనిపించింది. కడుపులో కెరటాలు విరుగుతున్నట్లు తోచింది. వాంతి వస్తున్నట్లు అయింది. ఆపుసందుకు విశ్వప్రయత్నం చేశాను. లాభంలేదని త్వరలోనే గ్రహించుకున్నాను

ప్లేను ఎక్కుతున్నప్పుడు బెనర్జీగారు నాకు జ్ఞాపకం చేసిన కాగితంసంచీల మాట తలపుకువచ్చింది. ఇక వాంతి ఆగదని స్థిరపడినప్పుడు చప్పున ఒకసంచీ అందుకొని, తెరచి పట్టుకున్నాను.

నేను భయపడినంతగా పెద్ద వమన మేమీ కాలేదు. కాని ఆ చిన్నవాంతికే ఒళ్ళు ఆయాసపడింది కొంచెం చిరిచెమట పోసింది. దాహం వేసింది. నీటితిత్తి అందుకొని తృప్తితీరా చల్లని నీళ్ళు త్రాగాను. ప్రాణం తెప్పరిల్లినట్లు అయింది. గాలియింకా ధారాళంగా వీచేటట్లు కిటికీలను మరికొంచెం తెరచి, బడలికతో దిండుపై శిరమువాల్చి, అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాను. జోకొట్టినట్లు నిద్రవచ్చింది సుమారు అరగంట వరకు సౌఖ్యంగా మైమరచి నిద్రపోయాను.

కొంతసేపటికి చలివేసి మెలకువవచ్చింది. చేతినున్న వాచీ చూసుకున్నాను. మూడున్నర దాటింది. లేచి కూచున్నాను. చల్లని సీటిగాలి చెంపమీద చరుస్తున్నట్లుగా వీచింది. గంటకు సుమారు 120 మైళ్ళ చొప్పున పోతూఉంది ప్లేను. ఇంజన్ మ్రోతలో రేమీ మార్పు వినరాలేదు. సన్నని కుదుపుతో గాలిలో ఒక్కచోటనే ఆగిపోయినట్లుండెను ప్లేను. ముందుకునడుస్తున్నట్లు తోచలేదు. పుడమిమీది దృశ్యాలేవీ కంటి కానలేదు. ఎటుచూసినా పొగవలె తెల్లని నీటిమబ్బులు ప్లేనుచుట్టూ ఆవరించిఉండెను. చలిగాలికి తాళలేక, పెట్టెతెరచి, బట్ట తీసి కప్పుకున్నాను తలమీదుగా అప్పుడప్పుడు చిన్న నీటితుంపర్లు మొగంమీద పడుతూ ఉండేవి. విమాన మేవూరుమీదుగా పోతూఉందో, ఎంతయెత్తున పోతూ ఉందో, క్రిందను కొండలే ఉన్నవో, ఊళ్ళే ఉన్నవో, అడవులే ఉన్నవో, నదులే ఉన్నవో, ఏమున్నవో మబ్బుతెరలోనుండి యేమీ తెలియరావటంలేదు. పైని మేఘాలు, క్రింద మేఘాలు, చుట్టూ మేఘాలు! పైలట్‌కు దారి ఏట్లా తెలుస్తూఉందా అని ఆశ్చర్యపడ్డాను. ఆ సమయమందు వర్షం కురిసినా, సుడిగాలిలేచినా, తుపానురేగినా, ప్లేనుగతి యేమిటిచెప్మా అని పరిపరివిధాల పోయింది నా ఆలోచన. మబ్బులలో చిక్కుకొని, శ్రమదమాలకు లోనైన వైమానికులకథలెన్నో తలపుకు వచ్చాయి, ఆ ముహూర్తంలో.

లోగడ మధ్యఆఫ్రికాలోని 'సడ్డ్' ఎడారి మీదుగా ఎగురుతున్నప్పుడు విలియమ్ జే మాకిన్ గారు మబ్బుల వలన పడ్డ అవస్థలన్నీ అప్పుడు నేను సులువుగా ఊహించుకోగలిగినాను. క్రింద నగపడిన అడవియేనుగుల గుంపును అట్టేచూస్తూ, ప్లేను ఎటుపోవుచున్నదీ గమనించనేలేదట, అతను అంతలో ఎదురుగా నల్లని కంబళీవలె వ్రేలాడుతున్న దట్టమైన మేఘం ప్రత్యక్షమైంది. పిల్లమేఘాలు కొన్ని తలలెత్తి నాట్యమాడుతూ, విషసర్పాలవలె బుసకొడుతూఉండెను. దూరాన ఒక నీలిమెరుపు ప్రకాశించింది. కాని, యింజన్లచప్పుడులో ఉరుములధ్వని యేదీ వినరాలేదు. ప్లేను 8, 9, 10 వేల అడుగులయెత్తున ఊగులాడుతున్నట్లు సూచించింది 'ఆల్టిమీటరు.' మీదికివచ్చి, ప్లేనుయొక్క రెక్కలతో పెనగులాడ ప్రారంభించాయి మేఘాలు. చలిగాలి చెమ్మగా ముఖంమీద తగిలింది మాకిన్ గారికి.

హఠాత్తుగా ప్లేనుప్రక్కగా ఒరిగి, 500 అడుగుల మేర క్రిందికి దిగిపోయింది. తన స్థానంనుండి దొర్లి, యించుమించు క్రిందపడేటట్లు ముందుకు తూలిపోయాడు మాకిన్. ఇంజన్ల మ్రోత హెచ్చింది. 'జాయ్‌స్టిక్'తో అవస్థపడి, ఎట్లాగో ఒరిగిన ప్లేనును సరిచేశాడు పైలట్.

కిటికీకి చేరువగా పెద్దమెరుపు మెరిసింది. మళ్ళీ ప్లేను యిటూఅటూ ప్రమాదకరంగా ఊగులాడింది. ఇంతలో తుపాకిగుండ్ల వర్షంవలె మైకాకిటికీల మీద ఫెళఫెళ చప్పుడయింది. వడగళ్ళు! కిటికీలతలుపులు నిమిషంలో జల్లెడవలె చీలిపోయాయి. మాకిన్ గారికి చిన్నచిన్న

దెబ్బలు కూడా తగిలినవి.

దారి, తెన్ను, తెలియనివ్వని పొగమబ్బులోనుండి గ్రుడ్డిగా పోతూఉండెను ప్లేను. దిగువను కొండలేవైనా ఉండిఉంటే, యిక బ్రతుకుఆశ లేకనేపోయేది. 8, 9 వేల అడుగులయెత్తున ఎగురుతున్న ప్లేను 3 వేల అడుగుల యెత్తుకు దిగిపోయింది. దిగువను అంతా బురదగా ఉన్న ఊబి ప్రదేశం. ఆ మధ్యను మెలికలుతిరిగి, తళతళలాడుతున్న 'నైల్' నది! ప్లేను నేలపై వ్రాలడానికి ఎంతమాత్రం వీలులేదు. వ్రాలితే యిక బెల్లంపాకంలోపడిన యీగవలె, ఆ ఊబిలో తగుల్కొని మరికదలదు.

ఇంతలో కళ్ళు మిరుమిట్లు గొల్పునట్లుగా మరొక పెద్దమెరుపు మెరిసింది. వర్షం, వడగళ్ళు ఆగకుండా పడుతూనే ఉండెను.

'ప్లేను పైకి లేవకుండా ఉంది' అన్నాడు పైలట్ అధైర్యస్వరంలో.

మరొక పెద్ద మెరుపు! అదృష్టవశాత్తూ దానితో పెను భూతంవంటి మబ్బుతెరఒకటి చీలిపోయింది. భూమికి రెండున్నరవేల అడుగుల యెత్తునమాత్రం వణుకుతూ ఉండెను ప్లేను. వడగళ్ళతో దట్టంగా కప్పబడి, దాని రెక్కలు బరువెక్కి తెల్లగా కనబడ్డాయి ఆ మెరుపులో.

ఆకస్మికంగా మబ్బు విడిపోయింది. వెలుతురు వచ్చింది. దిగువను విశాలమైన పల్లపు నేల కానవచ్చింది, రమ్యమైన సూర్యరశ్మిలో. తుపాను ఆవరణ దాటి బయట పడింది ప్లేను. దూరంగా యినుపరేకువలె తళతళలాడుతున్నదేదో పొడగట్టింది దిగువను.

'విక్టోరియా న్యాంజా సరస్సు' అని ఆనందంతో కెవ్వున అరచాడు పైలట్.

మరికొన్ని నిమిషాలలో క్షేమంగా ఆ సరస్సు ఒడ్డున వ్రాలింది ప్లేను.

మరొకప్పుడు ఆఫ్రికాలో ఒక పైలట్ యువకుడు యిట్లానే మేఘాలలో తగుల్కొని, చావుతప్పి బయటపడ్డాడు. అతని ప్లేను హాయిగా వందమైళ్ళకు పైబడిన వేగంతో పోతూఉండెను. ఎదురుగా నల్లని భయంకరమైన పెద్దమబ్బొకటి కనబడింది.

'ఆ మబ్బులో జొరపడితే ఎట్లా ఉంటుందో!' అనుకున్నాడతడు యౌవన చాపల్యంతో.

కుర్రతరహాగా విమానాన్ని సూటిగా మబ్బువైపు త్రిప్పాడు

ఇంకో నిమిషంలో ఏదో పెద్ద చీకటిగుహలో జొరపడినట్లు అయింది అతనికి. అంతా కారుచీకటి ఎటువైపు ఏమున్నదీ తెలియలేదు. భీతావహంతో గుండె దడదడలాడింది అతనికి. ఎట్లాగో లేనిశక్తి తెచ్చుకొని, 'యిండికేటర్' వద్దనున్న విద్యుద్దీపాన్ని వెలిగించాడు. వెంటనే ప్లేనుస్థితి అర్థమైంది అతనికి. ఆ చీకటిలో ప్రళయవేగంతో పైకి తేలిపోతూఉంది ప్లేను!

'జాయ్‌స్టిక్' అందుకొని, బలంతో ముందుకు తోశాడతడు. న్యాయంపట్టి వెంటనే ప్లేను క్రిందికి దిగజారవలసిఉండెను. కాని, అందుకు బదులుగా యింకా పైకి లేచిపోతూఉండెను. ప్రక్కగా ఒరగడంకూడా ప్రారంభించింది ప్రమాదకరంగా. పైలట్ తన ఆసనంనుండి గెంటబడినట్లు ముందుకు తూలిపోయి ఆదుకున్నాడు పడిపోకుండా. దుర్భేద్యమైన ఆ కటిక చీకటిలో ఏంచెయ్యడానికీ పాలుపోలేదతనికి.

దేవుని ధర్మమా అని మరుక్షణమందు మెరుపువలె ఎండ ఎదురైంది. మబ్బులోనుండి తారాజువ్వవలె చప్పున కొంతమేర క్రిందికి దిగజారింది ప్లేను. బ్రతుకు జీవుడా అనుకున్నాడు పైలట్!......

మబ్బులమధ్య ఎగురుతూ ఉన్నప్పుడు యిట్టి దృష్టాంతాలన్నీ జ్ఞప్తికివచ్చి, నాకు కూడా ఏదైనా విచిత్రానుభవం సంభవిస్తే బాగుండునే అనిపించింది! పెద్ద తుపానురేగి, ప్లేను అందులో చిక్కుకొని అవస్థపడి, మళ్ళీ ఏ ప్రమాదము లేకుండా, జయప్రదంగా ముందుకు సాగిపోతే నిజంగా ఎంత తమాషాగా ఉండేది! కాని ప్రమాదాలుమాత్రం మనం కోరుకున్నప్పుడు, కోరుకున్న విధంగా వస్తాయా? ఒడుదుడుకులేవీ లేకుండా రమ్యంగా పోతూఉంది ప్లేను, మేఘాలను లెక్కచేయకుండా.

ఒకొక్కప్పుడు నీటిమబ్బులు ఆవరించిఉన్న ప్రదేశంలో ఎగురుతూఉన్నప్పుడు చిత్రవిచిత్రములైన తమా

పాటు జరగడం కలదని చెప్తారు విమానానుభవం బాగా ఉన్నవాళ్ళు.

ఎగురుతూఉన్న ప్లేనును కసితో వెంబడిస్తూ, ఏనిమిషంలో మీదపడి ఢీకొంటుందో అన్నట్లు కానవస్తుందట మరొకప్లేను; నిజంగా యీ రెండవ ప్లేనువలె కనబడేది ఎగురుతూఉన్న విమానంయొక్క ప్రతిబింబమే. సూర్య కిరణాలు మబ్బులపై పడి, ప్రతిఫలించి, యీ విధంగా కంటిని భ్రమగొల్పుతాయి. అనుభవజ్ఞుడైన పైలట్ అట్టి సమయాలలో కంగారుపడక, 'జాయ్‌స్టిక్'ను గుంజి, యింకాపైకి ఎగిరిపోతాడు.

మబ్బులమీదుగా పోతూఉన్నప్పుడు మరికొన్ని సమయములందు దిగువను పెద్దసుడిగుండంవంటి రంధ్రమేదో ప్రత్యక్షమవుతుందట! నల్లగా గుహాద్వారంవలె నోరు తెరచుకొని, ప్లేనును ప్లేనులో ఉన్నవాళ్ళను అమాంతంగా మ్రింగివేయడానికి సిద్ధంగాఉన్న రాక్షసివలె కనబడుతుంది ఆమహారంధ్రం. ప్లేను ఎంతవేగంగా పోతూఉంటే, అంతవేగంతోను అదికూడా వెన్నంటి వస్తూనే ఉంటుంది. ప్లేను కదలుతున్నట్లు అవుపడదు. ఆ కన్నంమీదుగా నిల్చి, ఏ ఘడియలో అందులో దుమకడానికి యత్నిస్తున్నట్లు ఉంటుంది. ఆ మబ్బు ప్రదేశం దాటిపోయి, గాలి పలచబడిన చోటుకు చేరుకున్నదాకా, భయంకరంగా ఆ రంధ్రం అట్లానే అగుపడుతూఉంటుంది.

మొత్తానికి నేను మబ్బులలోనుండి ఎగురుతూఉన్నప్పుడు ముచ్చటకైనా యిట్టి వింతదృశ్యాలేవీ అగుపడలేదు. నలువైపులా శోధించి మరీ చూశాను, వెంట తరుముతున్నట్లు మరొకప్లేనే కానవస్తుందో, లేక దిగువను భూమి బ్రద్దలైనట్లు పెద్దచీకటిసొరంగమే కనబడుతుందో, అని. వెనక్కి తిరిగి పైలట్ ఏంచేస్తున్నాడో అని చూశాను, నాకూ ఆయనకూ మధ్యనున్న గాజు తెరలోనుండి. నిశ్చింతగా విమానాన్ని పోనిస్తూ, ఏదో కాగితంచూస్తున్నాడతడు. అతని కుడిచెంపమీద సన్నని ఎండ పడుతూఉంది.

మబ్బులు మాయమైనాయి. సౌఖ్యంగా, వెచ్చగా వీచింది గాలి. కొండలు, నదులు, పట్నాలు, అడవులు పొలాలు, అన్నీదాటి యథేచ్ఛగా పోతూఉంది ప్లేను. తలత్రిప్పు, కడుపులో వికారం, మొదలైన చికాకులేమీలేక, దూర్బినియంత్రం చేతపట్టుకొని, దృష్టినిగిడ్చి అన్నీ ఆనందంతో చూస్తూ, హాయిగా కూచున్నాను.

మానవుడు తన బుద్ధివిశేషంవలన యిప్పటికి కనిపెట్టిన అద్భుతాలలో నిజంగా గాలిప్రయాణమొకటి కదా అనుకున్నాను, నాలో నేను. ౩౮ సంవత్సరాల క్రిందట 'కిట్టీహాక్' అనే మైదానంమీద 'రైట్' సోదరులు గ్లయిడర్లలో ఎగరడానికి పడినపాట్లు తల్చుకుంటే, యిప్పుడెంతో ఆశ్చర్యమవుతుంది.

'ఇంకా నూరేళ్ళవరకూ గాలిలో ఎగరడానికి మానవమాత్రుడికి సాధ్యంకాదు!' అన్నాడప్పుడు నిరాశతో ఆ సోదరులలో చిన్నవాడైన ఓర్విల్‌రైట్.

నేడు ప్రఫెసర్ పికార్డ్‌వంటి ప్రజ్ఞావంతులు 'స్ట్రాటోస్ఫియర్'లో భూమికి 15 మైళ్ళ యెత్తున, గంటకు 300 మైళ్ళ వేగంతో ప్రయాణం చేయగలుగుతున్నారు. జర్మనీలో కొందరు సయింటిస్టులు చంద్రలోకానికి ప్రయాణం సాగించేటందుకు ఉపాయమేమిటా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు!

బహుశః మరికొన్నాళ్ళకు నేటి విమానాలు త్రొక్కుడుబండ్లవలె ప్రయాణానికి సామాన్యసాధనలు కావచ్చు. ఇప్పుడు గాలిప్రయాణాలలో తరుచుగా సంభవిస్తున్న ప్రమాదాలు మున్ముందు ఉండనే ఉండకపోవచ్చు. ప్రయాణమింతకంటె సౌఖ్యప్రదంగాను, క్షేమకరంగాను, వేగంగాను జరగవచ్చు. ఒకవేళ 'రాకెట్ ప్లేన్ల'లో చంద్రలోకాన్ని చేరుకోవడమే నిజంగా సిద్ధిస్తే, యిక మానవుడు దేవతలతో వియ్యమందవచ్చునన్నమాట!

భూమిమీద రెయిళ్ళకు, సముద్రంమీద ఓడలకు బాటలేర్పడినట్లు, గాలిలో కూడా విమానాలకు దారులేర్పడుతున్నాయి. విమానశాస్త్రజ్ఞులు స్వయంగా పైకెగిరి వాయుమండలంలోని పరిస్థితులన్నీ శోధిస్తున్నారు. 'రేడియో' సహాయ్యమున ఎప్పటికప్పుడు వారి పరిశోధనలను టెలిఫోనుద్వారా మిత్రులకు తెలియజేస్తు

స్నారు. మహారణ్యాల గూర్చి, సముద్రాల గూర్చి తెలుసుకున్న విశేషాలకన్న, గాలిని గూర్చి యెక్కువ సంగతులు కనిపెట్టగలిగినారు సయింటిస్టులు. కాని, భూమిమీద, నీటిమీద వారికి అర్థంకాని ప్రకృతిరహస్యాలు ఎన్నో ఉన్నట్లుగానే, వాయుప్రపంచమందుకూడా తెలియరాని అద్భుతరహస్యాలు ఎన్నో బయటపడుతున్నాయి. విమానసంచారుల కొన్నికొన్ని వింత అనుభవాలకు సయన్సు తృప్తిగా సమాధానమియలేకుండా ఉంది!

ఈమధ్య విలియమ్ జే. మాకిన్ గారు 'ఆకాశరహస్యాలు' అనే శీర్షికక్రింద అనేక అద్భుతవిషయాలను సేకరించి 'నాష్' పత్రికలో ప్రకటించారు. అందు కొన్ని చాలా చిత్రంగా ఉన్నాయి—

1...ఈజిప్టురాజుల గోరీలుగల 'ప్రభువుల లోయ' అనబడు మైదానంమీద ఏగిరేటప్పుడు కొన్నికొన్ని చోట్ల ఎంత ప్రశస్తమైన 'రేడియో' యంత్రాలైనా సరే, చచ్చినా పనిచెయ్యవు. ఎందరో సయింటిస్టులు సున్నితమైన 'రేడియోసెట్టు'లను వెంట తీసుకొనిపోయి, పరికించలేక ప్రాణంవిసిగి ఊరుకున్నారు. 'రేడియో'ను చంపగల ఆస్థలమహత్త్వమేమో తెలియరాకున్నది.

2...మొన్నటి ఐరోపాసంగ్రామ దినాలలో ఒకనాడు కొందరు బ్రిటిష్‌వైమానికులు దూరంనుండి తమవైపువస్తున్న ఒక యింగ్లీషుప్లేనును చూశారు. 'త్రాటిల్' మూయబడిన చప్పుడు అయింది. ఇక ప్లేను 'ఎయిరోడ్రోమ్' మీదుగా ఒకచుట్టుతిరిగి, మెల్లగా భూమిమీద వ్రాలుతుందని అనుకున్నారు వాళ్ళు. కాని అట్లా జరగక, ఆగవలసిన స్థలంమీదుగా తిన్నగా ముందుకు పోయింది ప్లేను. అప్పుడు కొంచెం అనుమానంకలిగింది ఆ ఆంగ్లసైనికులకు. అది బ్రిటిష్‌విమానం కాదేమో అనీ, అందులోనుండి జర్మనువారుడెవడో రహస్యంగా క్రిందికి దిగనున్నాడనీ, ఏమేమో అనుకున్నారు వాళ్ళు. వెంటనే తుపాకులు, 'బాంబు'లు పట్టుకొని, ప్లేనువెంట పరుగెత్తారు. అది నెమ్మదిగా 'ఎయిరోడ్రోమ్' దాటి, చేరువనున్న పొలాలలో క్షేమంగా వ్రాలింది. లోన యిద్దరు ఆఫీసర్లు ఎవరో ఉన్నట్లు చూశారు బ్రిటిష్ సైనికులు. తుపాకులుచూపి బెదిరించి, కేకవేసి పిలిచారు వాళ్ళను. కాని ఆ ఆఫీసర్లు ఉలకలేదు, పలకలేదు. ఠీవిగా వారిస్థానాలలో అట్లానే కూచున్నారు. ధైర్యం చేసి బ్రిటిష్‌సైనికుడొకడు చేతనొక బాంబుపట్టుకొని, ప్లేనును సమీపించాడు. అప్పుడు ఆ ఆఫీసర్ల నిజస్థితి బోధపడింది అతనికి. ఇద్దరూ చనిపోయి కొయ్యలై ఉన్నారు కుర్చీలలో.

గాలిలో ఎగురుతూఉండగా కొంతసేపటిక్రిందట వాళ్ళను శత్రువులెవరో తుపాకితో కాల్చి చంపినారు. గుండుదెబ్బలు తగిలీ తగలడంలో వాళ్ళప్రాణాలుపోయి ఉండవలెను. కాని, విమానం ఆగలేదు నడిపేవాడు లేకపోయినా, దానంతట అదే యెగురుకొనివచ్చి మిత్ర శిబిరంవద్ద వ్రాలింది!

3...1918-లో యుద్ధసంధి యింకా కొద్దిరోజులకు పొసగుననగా 'నోమాన్సులాండ్' అనేచోట యిట్టిదే ఒక విమానచిత్రం జరిగింది. కొందరు బ్రిటిష్‌వాయుసైనికులు శత్రుసేనలున్నవైపునుండి ఒకవిమానం మహావేగంగా తమవైపు వస్తూఉండడం చూశారు. దగ్గరకు వచ్చినపిమ్మట దాన్నిచూసి వాళ్ళు ఎంతో ఆశ్చర్యపడవలసివచ్చింది. ఎర్రని రక్తవర్ణంగల 'ఫోక్కర్' ప్లేనది. 'బేరన్ వాన్ రిచ్‌థాఫెన్' అనే జర్మన్‌యువకుడొకడు అప్పటికి కొలదినెలలు క్రితమే అట్టిప్లేనులో ఎగురుతూ ప్లేనుతోకూడా క్రిందపడి చనిపోయినాడు. ఈ కానవచ్చిన విమానం అతనిదివలెతోచింది ఆ బ్రిటిష్ సైనికులకు.

ప్లేను బ్రిటిష్‌సేనలు విడసియున్న తావునకువచ్చి, దిగువగా ఒరిగింది. పైలట్‌స్థానమున కూర్చునిఉన్న పరిచయపురుషుడు చెయ్యిఊపి సలామొనర్చినాడు. వెంటనే ప్లేను మళ్ళీ ఎత్తుగా లేచిపోయి, వచ్చినదారినే మరలిపోతూ, చూస్తూఉండగానే మబ్బులలో మాయమైంది. బ్రిటిష్‌పైలట్లు తమ విమానాలలో దానిని వెంట తరిమినారు. కాని ఆ రక్తవర్ణవిమానం మరి కానరాలేదు.

ఎందరో పైలట్లు యీ అద్భుతచిత్రాన్ని స్వయంగా చూసినట్లు చెప్తారు. చనిపోయిన ఆ జర్మన్‌యువకుని

సూక్ష్మదేహం ఆవిధంగా ప్రత్యక్షమైనదని వాళ్ళ నమ్మకం!

4...కొన్నాళ్ళక్రిందట యింగ్లాండులో 'షెప్పర్టన్-ఆన్-థేమ్స్' అనే ఊళ్ళో పలుసార్లు ఒక తెల్లని ప్లేను మసకమసకగా గాలిలో కనబడేదనిన్నీ, దాని యింజన్ మ్రోత స్పష్టంగా వినవచ్చేదనిన్నీ, ఊరు చెంత నొకపొలంలో అది నేలనుగుద్దుకొని ధ్వంసమైనట్లు పెద్దగా చప్పుడు అయేదనిన్నీ, ఆ ఊరివాళ్ళు అనేకులు చెప్తారు. తీరా వెళ్ళిచూస్తే ఎక్కడా ప్లేను పడిపోయినట్లు జాడలేవీ కనబడేవికావట!

ఈ చిత్రానికి మూలకథయేమిటంటే, కొన్నియేళ్ళ క్రిందట అట్టి తెల్లనిప్లేనులో ఒకపైలట్టు, ఒకయంత్ర మరమ్మత్తుదారుడు ఆ ఊరిమీదుగా ఎగురుతూ, ఏదో ప్రమాదం వచ్చి ప్లేనుతోసహా క్రిందపడిపోయి చనిపోయినారట. పిదప దెయ్యాలై వాళ్ళు అప్పుడప్పుడు తమ జీవితాంతనాటకాన్ని ఆవిధంగా ప్రదర్శిస్తూ ఉండేవారని, ఆ పురజనుల నమ్మకం!

5...ఒకసారి 'రాయల్ ఎయిర్ ఫోర్సు'కు చెందిన పెద్దఉద్యోగస్థుడొకడు కెంట్ ఎయిరోడ్రోమ్ మీదుగా గాలిలో నిప్పంటుకొని తోకవద్ద మండుతూఉన్న ఒక ఆంగ్లవిమానాన్ని తాను స్వయంగా చూసినట్లు రిపోర్టుచేసినాడు. తీరావిచారిస్తే నాడు ఏప్లేనుకూ అట్టి ప్రమాదం జరిగిఉండలేదని తేలింది. అయితే, కళ్ళారా చూడనిదీ ఆ ఉద్యోగస్థుడు బొల్లిరిపోర్టుచేసే మనిషి కాడు. వాస్తవంగా అతనికంటికి ఒకప్లేను దగ్ధమౌతున్నట్లు కనబడిఉండాలి!

6...కొన్నికొన్ని సమయములందు విమాన సంచారులకు గగనమండలమందు జటాయువు వంటి రాక్షసబలంగల వింతవింత జీవరాసులేవైనా ఉంటాయేమో అని అనుమానం కలుగుతూఉంటుంది. సముద్రంలోని తిమింగలాలు, 'షార్కు'లు మనుషులను అమాంతంగా మ్రింగివేయగలిగినట్లు, ఆకాశమందు విమానాలనెదుర్కొని వాటిలోని మనుషులను చంపి భక్షించే పెద్దజాతిపక్షులు కాని, మరియే యితరజీవులుకాని ఉండకూడదా అని కొందరి తలంపు!

వాయుప్రపంచమందు మానవుడు కనిపెట్టజాలని చిత్రాలింకా యేమున్నవో యేమోకాని, ఒక్కొక్కప్పుడు పైకెగిరి ప్రయాణంచేస్తున్నవిమానం అత్యద్భుతంగా అంతర్ధానమైపోతుంది. 1931-వ సంవత్సరంలో 'సదరన్ క్లౌడ్' అనే పేరుగల ఆస్ట్రేలియా విమానమొకటి ఆవిధంగా మాయమైపోయింది. ఇద్దరు సారథులు ఆరుగురు ప్రయాణీకులు ఉండిరి ఆ ప్లేనులో 'సిడ్నీ' నుండి 'మెల్బోర్న్' వెళుతూ, మధ్యలో ఆ ప్లేను ఏమయిపోయిందో యిప్పటికికూడా తెలియరావడంలేదు!

* * *

గాలికెరటాలపై విమానం తేలియాడుతున్నట్లే, నా మనసు పిచ్చిపిచ్చి ఊహాలమధ్య ఊగులాడింది. 'హఠాత్తుగా ఏ నిమిషమందయినా యింజను ఫెయిలయితే? 'టాంక్' చిల్లిపడితే? రెక్కలు నిప్పంటుకుంటే? 'సదరన్ క్లౌడ్' వలె యీ ప్లేనుకూడా గాలిలో అంతర్ధానమయిపోతే? అప్పుడు దేవకన్యకలు నన్ను ఆహ్వానించి యింద్రలోకానికి తోడ్కొని పోతారేమో!... అక్కడ ఎట్లాఉంటుందో?...మరణానంతరమే కాని సజీవంగా స్వర్గానికి ఎందువలన పోలేమో?...'

ఎండ వేడిమి తగ్గి, గాలి హాయిగా వీస్తూఉంది. భూమిమీది ధ్వనులు, ధూళి, పొగ, యేవీలేక మనోజ్ఞంగా ఉంది ప్రయాణం. ఎప్పటికీ ప్రయాణం ముగియక, యిట్లానే హాయిగా ఎల్లప్పుడూ ఎగురుతూఉంటే ఎంతో బాగుండును!

ప్రియురాలితో ఏకాంతంగా తోటలో ఉయ్యాల ఊగేటప్పుడు కలిగే రమ్యమయిన ఒళ్ళుత్రిప్పు; మిత్రులతో వినోదంగా విందారగించునప్పుడు మోతాదు తొలగిపోసగే మనోజ్ఞమయిన మయికం; అందకత్తెయైన ఆంగ్లజవ్వనిని వెచ్చగా కౌగిటనదుముకొని ఆమెతో నాట్యమాడేటప్పుడు నరాలలో జనించే యింపైన దూకుడు; ప్రకృతిశోభ నేకాగ్రచిత్తంతో వీక్షించునప్పుడుకాని, మధురమయిన పాటలో లీనమైనప్పుడు కాని, కమ్మనివాసనల ననుభవించునప్పుడుకాని, కలిగే అర్థంకాని ఆనందపరవశత్వం;—అన్నీ నాలో మిళి

తమయి ఉండెను ఆ సమయమందు. ఊళ్ళు, చెట్లు, రోడ్లు, అన్నీ యేకమయి పిల్లలుకట్టే బొమ్మరిండ్లవలె బహుచిన్నవిగా, చిత్రంగా, అందంగా కనబడేవి. నా యెడమచేతివైపున తాపిన 'స్లేటు' పలకవలె నున్నగా, నీలిగా అగపడింది సముద్రం. పెద్దపెద్దయిండ్లు, మేడలు దూరాన పొలాలలో పేర్చినట్లు పడిఉన్న చిన్నచిన్న రంగురాళ్ళకుప్పలవలె కనపడేవి. పైని ఎగురుతూ చూసేటప్పుడు ఎంత గంభీరంగా కానవస్తుందో అనుకున్న మహాబస్తీ చెన్నపట్నమది! ప్లేనులో కూచుని యింకా నిండా 3 గంటలనే పైనా కలేదు. సరదా తీరకముందే వచ్చేసింది గమ్యస్థానం. భద్రాద్రినుండి చెన్నపట్నానికి నిజంగా 328 మయిళ్ళదూరం ఉన్నదా అనిపించింది. ఎగురుతున్నంతసేపూ దివ్యమయిన స్వప్నావస్థలో ఉన్నట్లు ఎంతో హాయిగా ఉండెను. విసుగు, భయం, బడలిక, యేవీ తోచలేదు.

జయప్రదంగా తనపని తాను నెరవేర్చగలిగినందుకు గర్విస్తున్నట్లు 'ఫ్లయింగ్ క్లబ్' వద్ద ఠీవిగా వాలింది ప్లేను.

'ప్రయాణం మీకు తృప్తికరంగా, ఖులాసాగా ఉండెనని తలుస్తాను.' అన్నారు ఎవరెట్ గారు, నాతో షేక్ హాండ్ చేస్తూ.

—తాత కృష్ణమూర్తి, బి.ఏ., యల్.టి.

---

# సవర్ణహైందవప్రబోధము

ఎన్నితరంబు లిప్పటికి నేగెనో వీరల పూర్వులెల్ల ద
రోన్నతి హీనకృత్యములు పూనియొనర్చి అనేకరీతులన్
బన్నము పాలుసేసితివి భ్రాతృసమానుల నింతకాలమున్
సన్నుతబుద్ధి నింకనయినన్ కనుగొమ్ము సవర్ణహైందవా!

ఘనపాపౌఘ వినాశనప్రవణ గంగా గౌతమీ ముఖ్య పు
ణ్యనదీ పూతతరంగడోలికల విన్నాణంబుతో నూగి వ
చ్చిన యీ వాయువులన్ పవిత్రమయి సుశ్రీయుక్తమా భారతా
వని నస్పృశ్యత దెచ్చిపెట్టిన భవద్భానంబు హేయంబె యౌ.

భగవద్భక్తి విహారమైన అరిషడ్వర్గంబుఁ బెంపొంద జే
యగ నృత్యం బొనరించి పాడు నల పణ్యస్త్రీల రావించి, స్వ
చ్ఛగతిన్ భక్తితరంగితాత్ముడయి పూజల్ సేయ నేతేరగా
తగునే సోదరు పొమ్మనంగ దయలేదా నీదుచిత్తంబునన్

సకల మతంబులందును ప్రశస్తము మానవలోకధర్మ బో
ధకమును నైతనర్చెడి మతంబున కక్కట యింతకాలమున్
ప్రకట కళంకమీగతిని వాటిలె; ధర్మమునెంచి జాగు సే
యక యిపుడంటరాని తనమన్నది పూర్తిగ రూపుమాపుమా.

—శ్రీపాద లక్ష్మీనారాయణమూర్తి, బి. ఏ.

# దయయెక్కడో దేవుడూ అక్కడే

[గత సంచిక తరువాయి]

'కూర్చోవమ్మా, కూర్చో! బిడ్డ నీపక్కమీద పడుకోబెట్టి నీ వాబల్లవద్ద కూర్చుని కొంచెం రొట్టి తిను. బిడ్డను నేను చూస్తూవుంటానులే—బిడ్డలను పెంచటం నాకూ తెలుసును—నాకూవుండేవారు బిడ్డలు.' అన్నాడు మార్టిన్.

స్త్రీ కృతజ్ఞతతో మార్టిన్‌వంక చూచింది. భగవంతుని తలచుకుంటూ బల్లవద్దకూర్చుని రొట్టెతినడం ప్రారంభించింది. శిశువును పక్కమీద పడుకోబెట్టి జోకొడుతూ పక్కనే కూర్చున్నాడు మార్టిన్. ఎన్నో విధాల బిడ్డ నోదార్చడానికి ప్రయత్నించాడు. పెదవులతోనూ, నాలుకతోనూ రకరకాల కిచకిచ ధ్వనులు చేశాడు. తనకు పండ్లూడిపోవటంచేత ధ్వని సరిగా నోటబట్టక బిడ్డదృష్టి నాకర్షించలేకపోయినాడు. బిడ్డ నెట్లాగైనా నవ్వించాలని చూచాడు. పొట్టమీదనూ, బుగ్గలమీదనూ నెమ్మదిగా చక్కలిగింత పెట్టటం ప్రారంభించాడు. వేలు నోటిదగ్గరపెట్టి తిరిగి వెంటనే వెనక్కు లాక్కునేవాడు. జిగురూ మయినమూ అంటుకున్న తన వేళ్ళను బిడ్డనోటికిమాత్రం తగలనిచ్చేవాడుకాడు. మార్టిన్ వేలువంక చూస్తూ చివరకు బిడ్డనవ్వింది. మార్టిన్‌కు మేరలేని ఆనందంకలిగింది.

స్త్రీ బల్లవద్ద కూర్చుని రొట్టెముక్కలు విరుచుకొని తింటూ తన జీవితవృత్తాంత మీవిధంగా మార్టిన్‌తో చెప్పుతున్నది:

'అయ్యా, నాభర్త సిపాయిపని చేసేవాడు. అతన్నెక్కడికో దూరప్రాంతానికి పంపించారు—ఎనిమిది నెలలయిందిప్పటికి. తిరిగి ఆయన సమాచారమే తెలియలేదు నాకు. ఈబిడ్డ పుట్టేవరకూ నేనొకరి యింట వంటపనిచేస్తూ కాలం గడిపేదాన్ని. బిడ్డను కనగానే నన్నిక పనిలోనుండనియ్యమని చెప్పి పంపివేశారు. మూడు నెలలనుంచి యిట్లా తిరుగుతున్నాను పనికోసం. తిరిగి తిరిగి కాళ్లు పడిపోతున్నాయి, బాబూ! ఇంట్లోవున్న వస్తువులన్నీ అమ్ముకొని తినివేశాను. ఎవరింటికైనా చేరి వాళ్ళ చంటిబిడ్డకు పాలిస్తే తిండిపెడతారేమోనని చూచాను. కాని యెవ్వరికీ అక్కరలేకపోయినాను. శరీరం సన్నగిలి బలహీనంగా వుండటం చూచి నేనా పనికి తగనని పంపివేశారు. ఒకవర్తకుని భార్యవద్దకిప్పుడే పోయివస్తున్నాను. మావూరు ఆడమనిషి ఒకతె యిదివరకే ఆమెవద్ద పనిచేస్తున్నది. నాకుకూడ యేదో పనిచెప్పి తనవద్ద నుంచుకుంటానన్నది ఆయింటి యాజమానురాలు. నేటికైనా, దేవుడా! నాకష్టం గట్టెక్కిందని సంతోషించాను. కాని మరొకవారం పోయేవరకూ రావద్దన్నదామె. ఆమె యిల్లుకూడ చాల దూరం. నా శరీరంలో ప్రాణం లేదు. బిడ్డకు పాలులేక కృశించిపోయింది, మాయింటి అమ్మ యెంత పుణ్యాత్మురాలోగాని, ఉచితంగా నన్నింతవరకు తన పంచలో తల దాచుకోనిస్తున్నది. అదీలేకపోతే యీసరికి నాపని యేంగావలసిందో!'

మార్టిన్ యీకథవిని నిట్టూర్పు విడిచాడు 'అమ్మా, చలికాలాని కుపయోగించే ఉన్నిదుస్తు ఒక్కటికూడ లేను కాబోలు, పాపం, నీకు!' అన్నాడు.

'నా కెట్లావస్తుందయ్యా, నాయనా! నావద్దకూడా ఉండే దొక యున్నిగుడ్డప్పటి. చివరకదికూడ నిన్ననే అరణాలకు తాకట్టుపెట్టినాను,' అన్నది స్త్రీ.

ఈమాట చెప్పుతూనే వచ్చి పక్కమీదనున్న బిడ్డను యెత్తుకున్నది. మార్టిన్ కూడ లేచాడు, పోయి గోడకు తగిలించిన బట్టలలో నుంచి పాతకోటు ఒకటి బయటకు తీశాడు.

'అమ్మా, యిదిగోచూడు! ఇది పాతదేకాని బిడ్డకు కప్పడానికీ పక్కకీకూడ పనికివస్తుంది' అంటూ కోటు ఆమెచేతి కియ్యబోయినాడు మార్టిన్.

మార్టిన్ చేతనున్న కోటువంకచూచింది స్త్రీ. తిరిగి మార్టిన్ ముఖంవంక చూచింది. మాటలలో చెప్పలేని కృతజ్ఞత, దుఃఖము, రెండూ పొర్లి పొర్లి వచ్చాయి-ఆపుకోలేనంతగా వచ్చాయి. చేయిచాచి మార్టిన్

చేతిలో కోటు అందుకుంటూనే బోరున యేడ్చింది. మార్టిన్ మరలపోయి పరుపుకిందనుంచి ఒక చిన్న పెట్టెను తీసుకొనివచ్చాడు. పెట్టెలో చేయిపెట్టి వెద కుతూండగా స్త్రీ అతనితో యిట్లన్నది:

'అయ్యా, భగవంతుడు నిన్నెంతైనా మెచ్చుకుంటాడు. నిజంగా ఆ క్రీస్తు మహాత్ముడే నన్నిక్కడికి తీసుకొని వచ్చాడు. లేకుంటే యీబిడ్డగతి యేమయ్యేదో! నేనింటివద్ద బయలుదేరినప్పుడింతగా లేదు మంచు. క్రమంగా యెక్కువై యిట్లా ప్రాణంతీస్తున్నది. అయ్యా, నీవా సమయానికి కిటికీబయటకు చూడటం, యీ దీనురాలి మీద యింతగా జాలిపడి ఆదరించడం —యిదంతా ఆ క్రీస్తు కటాక్షం కాదా?'

మార్టిన్ చిరునవ్వు నవ్వుతూ యిట్లన్నాడు: 'ఔనమ్మా, ఆయన కటాక్షం కాకపోతే మరేమిటి! అయితే నేను కిటికీవద్ద కూర్చుని బయటికి చూడటం తలవని తలంపుగా జరిగినపనిమాత్రం గాదు సుమా!'

తాను గన్న కల, ఆనాడే క్రీస్తువచ్చి తనకు దర్శనమిస్తాడన్నట్లుగా వినవచ్చినధ్వని—యీ సమాచారం స్త్రీకి వినిపించాడు.

'ఎవరికి తెలుస్తుంది నాయనా! ఎటువంటి అద్భుతాలైనా జరగవచ్చు! భగవంతుని సంకల్పం!' అని చెపుతూ స్త్రీ లేచి, మార్టిన్ యిచ్చిన కోటు భుజంమీద వేసుకొని అందులో కొంతభాగం బిడ్డను కప్పి తలవంచి మార్టినుకు నమస్కరించింది.

'ఇదిగో, యిదికూడ తీసుకో అమ్మా! ఇదీ భగవత్ప్రసాదమే.' అని యంటూ ఉన్నిశాలువమీది తాకట్టు విడిపించుకోమని చెప్పి అరణాలు స్త్రీచేతిలో పెట్టినాడు మార్టిన్. స్త్రీ మాట్లాడలేక పోయింది. తన కృతజ్ఞతను తెలపడ మెట్లాగో తెలియలేదామెకు. భక్తితో మార్టినుకు నమస్కరిస్తూ మౌనంగా నిలబడ్డది ఒకక్షణం ఆగి సెలవుతీసుకొని బయటికి వెళ్ళింది

మార్టిన్ స్త్రీని సాగనంపి కొంచెం కొళంబు మాత్రం మిగిలివున్నది తిని, వస్తువులన్నీ యెక్కడివక్కడ జాగ్రత పెట్టి కుట్టుపనివద్ద కూర్చున్నాడు. పనిచేస్తూనే ఒక కంటితో వీధివైపు చూడటంమాత్రం మరచిపోలేదు. రోడ్డుమీద మనిషిజాడ తెలిసినపుడల్లా తలయెత్తి చూస్తూ ప్రతిమనిషినీ గుర్తుపడుతూనే వున్నాడు. కాని మార్టిను దృష్టి నాకర్షించగల విశేషమేమీ వాళ్ళలో కనబడలేదు.

కొంతసేపటికి పండ్లమ్మే మనిషియొకతె కనిపించింది ఆమెకూడ వచ్చి కిటికీకెదురుగా ఆగింది. తలమీది తట్టలో పండ్లుమాత్రం విశేషంగా వున్నట్లు కనబడలేదు—పండ్లు చాలవరకు అమ్ముడైయుంటాయి. ఆమె వీపుమీద చెక్కడు పేళ్ళబస్తా ఒకటున్నది ఎంత దూరంనుంచి వస్తున్నదో కాని పేళ్ళబస్తా మోయలేక భుజం నొప్పిపుట్టింది భుజంమార్చుకుందామనుకొని చితుకుల బస్తా కిందికిదించింది. పండ్లతట్ట మరొకపక్కను పెట్టి పేళ్ళబస్తా యత్తి కుదిస్తూన్నది. ఈలోగా యే మూలనుంచో కుర్రవాడొకడు వచ్చి తట్టలో పండొకటి తీసుకొని పారిపోతున్నాడు. పండ్లముసలమ్మ అది చూచి కుర్రవాణ్ణి తరుముకొనిపోయి చేయి గట్టిగాపట్టుకుంది. కుర్రవాడెట్లాగో గుంజుకొని పారిపోదామని ప్రయత్నించాడు. కాని ముసలిది రెండుచేతులతోనూ కుర్రవాణ్ణి పట్టుకొని వాడి నెత్తినున్న దింకిటోపీ యెగర గొట్టి గట్టిగా నొరకబుచ్చుకున్నది. పిల్లవాడు మొర్రో యని అరవడం, జుట్టుపట్టుకొని ఝాడిస్తూ ముసలమ్మ వాణ్ణి చివాట్లు పెట్టడం—ఈ సందర్భం చూచి మార్టిన్ యిక ఊరుకోలేక, చేతిలోపని ఉన్నదున్నట్లే విడిచి పెట్టి తలుపుతెరుచుకొని బయటికివచ్చాడు. తొందర తొందరగా వీధిమెట్లెక్కటంలో సులోచనాలు జారి కిందపడ్డవి. అయినా లెక్కచేయకుండా క్షణంలో వచ్చి వీధిలో పడ్డాడు మార్టిన్. ముసలిది కుర్రవాణ్ణి జుట్టుపట్టుకొని యీడుస్తూ, తిడుతూ పోలీసుల కప్పగిస్తానని బెదరిస్తున్నది. తన శక్తికొద్దీ పిల్లవాడుకూడా గుంజుకుంటున్నాడు. 'నే నసలు తట్టలో పండ్లు తీయనే లేదు. నన్నెందుకు కొట్టడం?—ఆ, చూదాం! విడిచి పెట్టు!' అంటూ గొంతుచించుకొని శపథాలు చేస్తున్నాడు.

మార్టిన్ వచ్చి కుర్రవాని చెయ్యి గట్టిగాపట్టుకొని ముసలమ్మతో యిట్లన్నాడు: 'పోనివ్వమ్మా పాపం! కుర్రవాడు—వదలిపెట్టండూ! క్రీస్తుమహాత్ముని తలచుకునైనా కాస్త క్షమించకూడదూ?'

'ఆ—అట్లాగే—అట్లాగే! వీడికి తగినశాస్తి చేయించి మరీ విడిచిపెడతాను. సంవత్సరంవరకూ తిరిగి మరపురాకుండా చేస్తాను ఈ శుంఠను పోలీసు కప్పగించాలిప్పుడు.' అంటూ ప్రతిజ్ఞలుచేసింది పండ్లమ్మ. మార్టిన్ తిరిగి ఆమెను బతిమాలుతున్నాడు: 'అమ్మా, దయవుంచి పోనియ్యవమ్మా! ఇక నెన్నడూ అట్లా చేయడులే. కొంచెం న్యాయమాలోచించు మరి.'

మార్టిన్ మాటమీద కుర్రవాణ్ణి విడిచిపెట్టింది ముసలిది జుట్టు వదలడంతోనే కుర్రవాడు కూడా పారిపోవాలని ప్రయత్నించినాడు. కాని వాణ్ణింకాగట్టిగా పట్టుకొని నిలువబెట్టి 'పోయి ఆయమ్మను క్షమాపణ వేడుకో— ఇటువంటి దొంగపని మరెన్నడూ చేయబోకు నీవుతట్టలో పండు తీస్తూంటేగా నేనూ చూచాను సుమా! అబద్ధమాడకు' అన్నాడు.

పిల్లవాడు సిగ్గుపడి యేడుస్తూ క్షమాపణ వేడుకున్నాడు.

'బహుబాగున్నది! అట్లాచేయాలి!—ఇప్పుడు తీసుకో—ఇదిగో పండు.' అని కుర్రవాణ్ణి మెచ్చుకుంటూ తట్టలో చేయిబెట్టి పండొకటి తీసి వానిచేతి కిచ్చాడు మార్టిన్. పండు కుర్రవానిచేత బెడుతూ 'అమ్మా, యీ పండుఖరీదు నేనిస్తా' నని ముసలమ్మతో చెప్పినాడు.

'ఇట్లాగే పిల్లలను పాడుచేయడం! పొగరుబోతుల నింకా పాడుచేయడమే నీవు చేసేదానియొక్క ఘనితం. ఇదేనా పిల్లలకు చెప్పవలసిన పాఠం? ఎప్పటికీ జ్ఞాపకముండేటట్లు కొరడాపుచ్చుకొని వెయ్యడమే దీనికి మందు.' అన్నది పండ్లమనిషి.

'అమ్మమ్మా, అట్లాఅనకు' మనుష్యమాత్రులంగదా! ఇవే మనం తెలియక చేసేపనులు. ఇదికాదు భగవంతుని పద్ధతి. ఒక్కరేగుపండు తినినందుకే కుర్రవాణ్ణి కొరడా దెబ్బలు కొట్టవలసినంటే పెద్దవాళ్ళమైన మన పాపాల కన్నింటికీ మన కేంశిక్ష విధించవలెనో కదా!' అన్నాడు మార్టిన్.

పండ్లమనిషి బదులుచెప్పలేదు.

ఒకానొక సేవకుడు యజమానికి చాలడబ్బు బాకీపడి, తిరిగి యిచ్చుకోలేక యజమానియొక్క క్షమాపణ పొంది యెట్లా ఋణవిముక్తుడైనాడో; తిరిగి ఆసేవకుడే తనకు బాకీపడిన మరొక తోడి సేవకుని నిర్బంధించి, దయా దాక్షిణ్యాలు లేకుండ బాకీసొమ్మంతా యెట్లా వసూలుచేశాడో; యీ కృతఘ్నతకు చివర కతడెట్లా శిక్ష పొందినాడో—యీ బైబిలు కథ ముసలమ్మకు చెప్పి క్షమాగుణంయొక్క గొప్పతనాన్ని గూర్చి కొంత తత్త్వబోధ చేశాడు మార్టిన్. ముసలిది చాల శ్రద్ధతో విన్నదికథ. కుర్రవాడుకూడ పక్కనే నిలబడి వింటున్నాడు.

'అపరాధులయెడల క్షమ చూపవలసిందనేది భగవంతుని యాజ్ఞ. మన మితరులయెడల మంచితనం చూపకపోతే, యితరులనుండి మనకూ క్షమాపణ వుండబోదు ప్రతిమానవుడూ, యెంత పాపాత్ముడైనా, క్షమింపబడటాని కర్హుడేకదా! అందులో ముఖ్యంగా జ్ఞానములుగని పిల్లవాళ్ళను క్షమించవద్దా?' అన్నాడు మార్టిన్.

ముసలమ్మ తలవూపుతూ నిట్టూర్పువిడిచి మార్టిన్ తో యిట్లన్నది: 'సరే, నీవు చెప్పేది నిజమేనయ్యా. కాని యిట్లా వదలిపెట్టి ఊరుకుంటే పిల్లలెందుకైనా అక్కరకు వస్తారా? చెడ్డవాళ్ళను మరింతగా పాడు జేయటం కాకపోతే మరేమిటిది?'

'అట్లా చెడిపోయిన వాళ్ళకు పెద్దవాళ్ళే మంచి మార్గం చూపి బాగుచెయ్యాలి' అని మార్టిను జవాబిచ్చాడు.

'అవును, నేననేదీ అదేనయ్యా నాయనా! నాకేడుగురు బిడ్డలుండేవారు. అందరూ పోయినారు. ఇప్పుడొక్క కుమార్తెమాత్రమున్నది.' అని చెపుతూ, తానూ తన కూతు యెక్కడుండేవారో, తన కెందరు మనుమలూ మనుమరాళ్ళూ వున్నారో, యీవిధంగా తన సంసారపు చరిత్రంతా యేకరువుపెట్టింది ముసలిది. 'ఒంట్లో శక్తితగ్గింది నాయనా, ముసలితనం పైనబడ్డది. పిల్లల కోసమే యింకా యిట్లా తిరగవలసివస్తున్నది. వాళ్ళూ మంచిపిల్లలే, పాపం! మాయమర్మాలెరుగరు. నేనంటే వాళ్ళ కమితమయిన ప్రేమ మా 'యానీ' నన్ను విడిచిపెట్టి ఒక్కక్షణముండదు. మరెవ్వరి వద్దకూ పోదు. 'అమ్మమ్మ!' అంటూ యెల్లప్పుడూ నన్నే తలుస్తూ వుంటుంది.' ఇట్లా మాట్లాడుతూ వుండగానే ముస

లమ్మ హృదయం మెత్తబడి మార్పు జెందింది. 'ఔనులే, నాయనా! వీడూ పిల్లవాడే, పాపం! నీవన్నట్లు అజ్ఞానంచేతనే యేదో చేశాడులే! భగవంతుని దయవుంటే వాడే బాగుపడతాడు క్రమంగా' అని మార్టినుతో చెపుతూ కుర్రవాణ్ణి ఆశీర్వదించి, చితుకులబస్తా బుజంమీది కెత్తుకోబోయింది ముసలిది.

కుర్రవాడది చూచి తనంతట తాను ముందుకువచ్చి 'ఉండుండు! అవ్వా! నీవు కాదు, నా బుజం మీది కెత్తు పేళ్ళయూట మీ యింటి వరకూ నేనూ వస్తాను' అన్నాడు.

ముసలమ్మ తల వూపుతూ 'మంచిది-రా, నాయనా!' అని సంతోషంతో బస్తా కుర్రవాని తలమీది కెత్తింది. ఇద్దరూ కలిసి అన్యోన్యంగా మాట్లాడుకుంటూ నడిచిపోయినారు. వాళ్ళను చూచి ఆనందిస్తూ మార్టిను వెనకనే నిలబడిపోయినాడు.

మార్టిను తిరిగి యింటిలోకి పోతూండగా, జారిపడిపోయిన సులోచనాలు మెట్లమీద కనబడ్డది. దాన్ని తీసుకొని లోపలికిపోయి తిరిగి ప్రారంభించాడు కుట్టుపని. కొద్దిగా జరిగిందిపని. ఇంతలో సాయంకాలమయింది. వీధిలో దీపాలువెలిగించేవాడు వచ్చి లాంతరుస్తంభా లెక్కుతున్నాడు.

'దీపపువేళ అయిందికాబోలు!' ననుకుంటూ మార్టిను దీపంవెలిగించి తిరిగి పని ప్రారంభంచేసి ఒకజోడు పూర్తి చేశాడు. జోడు దీపంవెలుగులో పరీక్షించిచూచి, బాగున్నదనకొంటూ దాన్నొకమూల బెట్టి పనిముట్లు జాగ్రతపెట్టినాడు. గదితుడిచి శుభ్రపరచి దీపం బల్లమీద వుంచాడు. గూట్లోవున్న బైబిల్ తీసి చేతబట్టుకున్నాడు నిన్న నిలుపుచేసిన పుటవద్ద తోలుముక్క గుర్తుపెట్టి వుంచాడు. తిరిగి అక్కడనే ప్రారంభం చేదామని పుస్తకం తెరిచాడు. తాననుకున్నచోటగాక పుస్తకం మరొకపుటవద్ద తెరవబడ్డది. తెరవగానే మార్టినుకు నిన్నటికల జ్ఞప్తికివచ్చింది. తిరిగి మనస్సంతా దానితోనే నిండిపోయింది. అ యోచనలోనే తన వెనుకనే యెవరో నడిచివస్తున్నట్లు అడుగులచప్పుడు వినవచ్చింది. వెనుకతిరిగి చూచాడు మార్టిను. గదిమూల చీకట్లో యెవరోకొందరు వ్యక్తులు నిలబడ్డట్లు మాత్రం కనబడ్డది. ఎవరో గుర్తుతెలియలేదు. కాని అట్లాగే చూస్తున్నాడు మార్టిన్. 'మార్టిన్, మార్టిన్! నన్నెరుగవా నీవు?' అని స్పష్టంగా ధ్వని వినిపించింది.

'ఎవరువారు?' అన్నాడు మార్టిన్.

'నేనే.' అని జవాబువచ్చింది.

ఆ జవాబుతోనే చీకట్లోనుంచి స్టెపానిచ్ చిరునవ్వునవ్వుతూ బయటికివచ్చి, ఆకాశాన్ని మేఘంలాగున నిమిషకాలంలో తిరిగి అంతర్ధానమైనాడు.

'నేనే!' అని మరొకసారి ధ్వనిపుట్టి, బిడ్డనెత్తుకున్న అనాథస్త్రీ మందహాసంతో చీకటిమూలనుంచి వెలుతురులోనికి వచ్చింది బిడ్డకూడా పకపకనవ్వింది. వెంటనే యిద్దరూ మాయమైనారు.

'నేనే!' అని మూడవసారి వినబడి పండ్లముసలిది, కుర్రవాడు కనబడినవ్వుతూ తిరిగి వెంటనే వాళ్ళూ వెళ్ళిపోయినారు.

ఈ వింతదృశ్యాలుచూచి మార్టిన్ ఆనందభరితుడైనాడు. కళ్ళజోడు తగిలించుకొని తెరవబడ్డ పుటవద్దనే చదవటం ప్రారంభించాడు. పుటమొదటనే యిట్లా వ్రాయబడివున్నది.

'నే నాకలిగొన్నపుడు మీరు నా కన్నంపెట్టి ఆకలి తీర్చారు, దాహమైనపుడు పానీయమిచ్చి దాహం తీర్చారు. పరాయివాణ్ణయినా, నేను అతిథిగా మీ వద్దకు వచ్చినపుడు నా కాశ్రయమిచ్చి ఆదరించారు.'

పుటయొక్క అడుగుభాగంలో యిట్లావున్నది: 'ఈ యాదరణఅంతా నీవు నా తోడిమానవులలో, నా సోదరులలో ఒకరికి, అందులో ముఖ్యంగా అతి దీనులకు, చూపినావు కనుక యీ గౌరవమంతా నాకు చూపినట్లే!'

ఈ వాక్యాలు చదివి మార్టిను తన కలయొక్క నిజమయిన అర్థం అవగాహనచేసుకున్నాడు. నిజంగా జీసుసుమహాత్ముడే ఆ రోజున తనకు దర్శనమిచ్చాడనీ, తా నుచితరీతిని సత్కరించిపంపినది ఆయననేయనీ తెలుసుకున్నాడు.

—తల్లాప్రగడ ప్రకాశరాయుడు, యం.ఏ.

# పశువు

'ఇదిగో! ఇది రెండోతడవ మీకు చెప్పటం అంత అజాగ్రత్తేం?'

'అదికాదు వీరారెడ్డిగారూ, అది బుద్ధిలేని జంతువు. మా రైల్వే ఆవరణలో తిరుగుతుందని వదిలేస్తాము, దాటి మీ చేలోకి వచ్చింది కావలయును. అయినా యిప్పుడేం పైరుపచ్చ యేమి లేదుగా చేలో.'

'పైరు పచ్చా లేదు. ఉన్నపిలకేనయిరి. ఎవడబ్బగాడి సొమ్ము? మా చేలన్నీ వ్యవసాయం చేసి పండించేది మీ రైలు మాష్టర్ల నిమిత్తం గావలయును, దానికి బుద్ధిలేకపోతే మనుష్యులై పుట్టిన మీకూ బుద్ధిలేదూ?

'ఆగ్రహపడకండి రెడ్డిగారూ, మా పోర్టరువెధవతో జాగ్రత్తగా చూడమని చెప్పాను, అక్కడికీ మేమూ జాగ్రత్తగానే చూస్తున్నాము, మొన్న మా లైను ఇనస్పెక్టరు వచ్చినప్పుడు ఆమూలకూడా కాంపౌండు తీగెలు బాగుచేయించమని చెప్పాను, పది పదిహేను రోజుల్లో ఆపనీ జరగవచ్చు, ఇక్కడనుంచి జాగ్రత్తగానే చూచుకొంటాంలెండి.'

'ఇకముందునుంచీ చూచుకొంటాననటమేమిటి? వెనక చెప్పినప్పుడూ యిదేమాట, ఇదేం నాలికా తాటిపట్టా? ఏమైనా సరే మీ గేదె గొడ్డును బందికి తోల్తాను, తరువాత వదుల్చుకోండి.'

'ఇంత ఆగ్రహపడకండి. ఏదో మీ దేశం వచ్చాం. మీ అందరి సాయము లేకపోతే మేము యిక్కడ యుండగలేది కష్టము, ఇప్పుడు అనవసరంగా ముప్పావులా తగుల్తుంది. ఈతడవకు వదిలెయ్యండి.'

'మళ్ళీ అదేకూతా? ఇట్లాకుయ్యటం చాలాతడవలు యెరిగివున్నాం, ఈతడవ బందిలో పెట్టక మానేదిలేదు'

'పోనీయండి, అంత వినకపోతే యేం చేస్తాం, సరే పెట్టండి బందిలదొడ్లో, సంబళం నిన్ననేకదా వచ్చింది. నాలుగురోజులు నాలుగుశేర్ల పాలు కాఫీకి కొనుక్కొన్నామనుకుంటాం.'

'అనుకుంటా, జాగ్రత్త, నెత్తిపిలకూడుతుంది, నీ సమిష్టికా లెవరితో చెప్పొస్తావు. ఖబర్దార్.'

'మీరు పెద్దలు. ఎక్కువతక్కువ మాటలతో ప్రయోజనమేమిటి? బుద్ధిలేని పశువు, మీ చేలోకి వచ్చింది, బందెకు తోలండి. ఇంకేమైనా చేతనైతే చెయ్యండి.'

'ఓసిముండా! ఆమాత్రం సంగతి తెలియకనే యింతసేపూ నీతో మాట్లాడింది? జాగ్రత్త, ఈతడవ నా చేలోకి నీగొడ్డు రావాలి, తెగనరకాలి, దానితో నీ నెత్తిపిలకకూడా యెగరాలి.'

'సరేలే, వెళ్ళండి.'

'వెడతాం వెడతాం. వెళ్ళం. స్టేషన్ నీయబ్బగాడి సొమ్మని, నువ్వు కట్టించావని వెడతాం, వెళ్ళకేంజేస్తాం, నా చేలో గూపాయి పిలకమేసింది, రూపాయితే. వెడతాం.'

'అట్లా యివ్వనులెండి. మీరెళ్ళి గేదెను దొడ్డికి తోలండి.'

'ఇవ్వవూ? ఇవ్వకేంజేస్తావు ముండా. ఇవ్వకపోతే తెలుసా' అని వీరారెడ్డి చేతిలో ములుకోలకఱ్ఱపైకెత్తి ఝుళిపించినాడు. దీనితో స్టేషనుమాష్టరునకు వళ్ళు మండిపోయింది.

'కొడతావ్రా కర్రతో. కొట్టు స్టేషనంతా లూటీ చేసుకపోవచ్చు అప్పుడు పోలీసులు వచ్చి నీయిల్లూవాకిలి అంతా కట్టుకుపోతారు. స్టేషనుమాష్టరును కొడితే యేంజరిగేది తెలుస్తుంది.'

'ఓయి పచ్చీ, నీకు పోలీసుదిక్కు కూడానా! మాడబ్బుతినే పోలీసులను నీకోసం సృష్టించాడేం దేవుడు, ఇప్పుడే కొడతా. పోయి నీయబ్బగాడితో చెప్పుకో' అని ఛడావ్ తీసి మీదికి పరుగెత్తినాడు, స్టేషనుమాష్టరు టిక్కెట్ల గదిలో దూరి తలుపుమూసుకున్నాడు. పోర్టరు అబ్దుల్లా రంగంమీదికి వచ్చి 'బాబూ, మీగడ్డంపుచ్చుకు బ్రతిమాల్తా. మామేష్టరుగారు అప్పుడప్పుడిట్లా మాట్లాడుతారు. క్షమించి యీపాటికి వదిలివెయ్యండి మహరాజ్, మేం మీ పాదాల కాడ బిడ్డలం, ఇంటికి వెళ్ళండిసార్. రాత్రి 8 గంటలయిండి. ఊరా దూరానవుంది. ఈ చేతిలాంతరు తీసుకొని ఎళ్ళండి. నెలపొడువు లేనిరోజులు.'

'మీరైల్వేవాళ్ళకు యెన్నితడవలు చెప్పినా బుద్ధిలేదు. మిమ్ములను ఒకకంట కనిపెట్టాలి. మీమేష్టరుతో యికనుంచి జాగ్రత్తగా బ్రతుకమను. ఛడావ్ దెబ్బ తగిలితే చెంపనున్న పళ్లు రెండువరసలు రాలిపోనేవి. ఏదీ? యీ లాంతరేనా తీసుకోని వెళ్లేది?'

'చిత్తం'

వీరారెడ్డి వెళ్ళిపోయాడు.

* * *

ఈ స్టేషనుమాష్టరుగారు యిదివరకు గూడ్సుషెడ్ లో ఉండేవాడు. అట్లాగట్లాగు స్టేషనుమాష్టరుపరీక్ష దాకా చదివి ప్యాసు అయ్యాడు, గూడ్సు షెడ్ లోనున్నన్ని రోజులు యేదోరూపకంగా చెయ్యి పచ్చపడని రోజులులేవు. మామిడికాయల బుట్టలు దిగితే బుట్టకు డజనుపండ్లూ తనకు గిట్టాలిసిందే, నిమ్మకాయలు ఉదయం సాయంత్రం షరబతునకు కావలిసినన్ని, తమలపాకులు బుట్టకు మోద, ఈయన భార్యగారికి నిత్యంచేమంతి పూవులజడే, ఇందుకేమైనా భిన్నంవస్తే సరుకు విడుదలకు గేటుబంద్, మరునాడు విడుదల చేసుకున్న సరుకువాడు లబోయిలూ, దిబాయిలూ.

ఎన్నాళ్లు సాగుతుంది యీ ప్రభ, ఎవరో డిష్ట్రిక్టు ట్రాఫిక్ సూపరిండెంటు గారికి రిపోర్టుచేసారు. ఆయన స్టేషనుమాష్టరుగారికి వ్రాశాడు. ఇదివరకెప్పుడో గూడ్సులో వచ్చే కమీషన్ భాగాలవిషయంలో స్టేషనుమాష్టరుగారికి గూడ్సు గుమాస్తాగారికి భేదాభిప్రాయాలు వచ్చినవి. అది రహస్యవిషయం అందుచేత స్టేషనుమాష్టరుగారు కాగితం వచ్చిందే ఆలస్యంగా గుమాస్తాగారిపై యెంతో వ్యతిరేకంగా వ్రాసిపంపాడు, అంతే, నీళ్ళూనిప్పులూలేని యీఅరణ్యాం స్టేషనులోనికి గూడ్సుగుమాస్తాగారు స్టేషనుగుమాస్తాగా ట్రాన్సుఫరు, ఇతనికితోడు ఒక్క పోర్టరు అబ్దుల్లా, ఇక్కడకు ఉదయం 11 గంటలకు ఒకరైలు పైకిపొయ్యేది రావటం, అదే మరలి దిగువకు పోతూ సాయంత్రం 4 గంటలకు స్టేషన్ వదుల్తుంది. ఇంతకుమినహా రైళ్ళులేవు. మంచినీళ్ళుకూడా రైలు వచ్చినప్పుడే పట్టుకోవాలి, ఇట్టి అరణ్యావాసం.

అదంతా కొండలప్రదేశం, మధ్యమధ్య చిన్నచిన్న ఖాళీస్థలాలలో దూరాన గ్రామాలలోనున్న రెడ్డిరైతుల మెట్టవ్యవసాయం. వీరారెడ్డి చేనొకటి స్టేషనుకు తూర్పుభాగాన ఆనుకొనిఉన్నది. ఆ మూలే తీగలు తెగినవి.

స్టేషనుమాస్టరుగారికి తమ డిపార్టుమెంటు

లో తనమీద యిదివరకే ఒకటి రెండు సల్ల మచ్చలు రికార్డులయి వుండుటచేతను ఆ కొండల స్టేషనులో యేవేళటి కేమోనను భయము చేతను యింతజరిగినా ఆయన గారు పోలీసులకు రిపోర్టుచేసుకొని యుండ లేదు.

* * *

పోర్టరు అబ్దుల్లా వీరారెడ్డి యూరు లాంతరుకొరకు మూడుతడవలు తిరిగాడు. మొదటితడవ 'చూసియిస్తాలే' అన్నాడు. రెండవతడవ 'నీకిదితప్ప పనిలేదా' అన్నాడు. మూడోతడవ 'పోపో, పుల్లాయ, నీలాంతరెవరెరుగున్నారు? ఈ తడవ నా గుమ్మం త్రొక్కితే నీ మర్యాద దక్క'దన్నాడు. దీనితో స్టేషనుమాస్టరు అబ్దుల్లా కూడా మెదలకుండా యూరుకొన్నారు. లాంతరు వీరారెడ్డిపాలు, దానిఖరీదు స్టేషనుమాస్టరు పాలు, దానిలో సగము రహస్యముగా అబ్దుల్లాపాలు.


* * *

ఆరుమాసాలు గడిచినవి. వీరారెడ్డి తమ్ముడుయింట్లో శుభకార్యం, అతడు ఆ రైలుస్టేషనుకు దిగువనున్న యేడవ రైలుస్టేషనుకు సంబంధించిన యొక పల్లెటూరిలో పెంపుడు. అతనిపని ఒకమోస్తరు బాగానే వుంది. మాటమంచీ, మర్యాద కలవాడు. అతని కూతురి వివాహం నిమిత్తం వీరారెడ్డి తన భార్యను కూతురుని వెంటపెట్టుకొని వెళ్లేడు. వివాహం సక్రమంగా మూడుపూటలు గడిచింది. వీరారెడ్డి కూతురుకు అల్లునికి గృహ పరికరాలక్రింద రు 25 చదివించినాడు. పెండ్లివారు వెళ్ళిపొయ్యారు, వీరారెడ్డి తమ్ముడు కోటిరెడ్డి అన్నగారికి 6 గజాల చాపు చూపించాడు. వదినగారికి అన్నకూతురికి రెవికగుడ్డలు పెట్టాడు. బంధుగులందరు వెళ్ళిపొయ్యారు. వీరారెడ్డి తన తమ్ముడిస్థానే బంధుగులందరికి మర్యాదలుచేసి ఆఖరికి వాళ్ళ రెండవ తోబుట్టువు చంద్రమ్మకూడా వెళ్ళినతరువాత పదకొండోరోజున భార్యాకూతుళ్ళను వెంటబెట్టుకొని స్వగ్రామానికి బయలుదేరాడు తమ్ముడు కార్యాంతరాసక్తుడై యింటిదగ్గరనే వెనకకు తగ్గినాడు.

వీరారెడ్డి కుటుంబం స్టేషనుకు చేరింది తొమ్మిదిగంటలబండి వచ్చేవేళ అయింది. ఆ బండిమీదనే వీరారెడ్డి పోవాలి. టిక్కెట్లు కొనరు. ప్లాటుఫారంమీద కూర్చున్నారు. బండి దగ్గరకు వచ్చింది. స్టేషనుమాస్టరుగారు జెండాలుపుచ్చుకొని ముసిలికొటొకటి చేతికి తగిలించుకొని ఐదోక్లాసు చదువుకొన్ననాటి టోపీఒకటి పెట్టుకొని బయటికివచ్చేడు. వీరారెడ్డి లేచి నిలబడి నమస్కారంచేసాడు.

'ఏం కోటారెడ్డి తమ్ముడుగారూ, ఎప్పుడిక్కడకు వస్తిరి? ఓహో, పెండ్లికిదా వస్తిరి. మంచిది మీయూరు పోతున్నారా' అన్నంతలో బండివచ్చింది, స్టేషనుమాస్టరు గార్డు దగ్గరకు పరుగెత్తినాడు. వీరారెడ్డి కుటుంబంతో సహా బండిలోపడ్డాడు. మళ్లా స్టేషను మాస్టరుగారు కోటిరెడ్డి అన్నగారికి టిక్కెట్లు యివ్వలేదని యిబ్బందిపడునేమో అని వెనకకు పరుగెత్తివచ్చినాడు. అక్కడ యెవ్వరూ లేరు. 'పోనీలే, అక్కడి స్టేషనుమాస్టరు చూచుకుంటాడు' అని అనుకొని యెక్కువ ప్రయాసపడి వెతకక బండికి గంటకొట్టినాడు బండి వెళ్ళిపోయింది.

సరిగా పదకొండు గంటలకు వీరారెడ్డి స్వగ్రామపు రైలుస్టేషనులో బండి ఆగింది. వీరారెడ్డి కుటుంబంతోసహా ముసిముసి నవ్వులతో దిగేడు, ఇంకా అయిదారుగురు



ఈస్టిండియా ఫిలింకంపెనీవారి 'సావిత్రి' లోని ఒక దృశ్యము



ఈస్టిండియా ఫిలింకంపెనీవారి 'చంద్రగుప్త' లోని ఒక దృశ్యము

ప్రయాణీకులు కూడా దిగేరు.

రైలు కదిలిపోయిన తరువాత స్టేషను మాష్టరు గార్డునకు సలాంచేసి బండి స్టేషను మలుపుదాటి పొయ్యేవరకు చూస్తూయుండి వెనుకకువచ్చి గేటుతలుపులు తెరచి 'టిక్కెట్లు, టిక్కెట్లు' అన్నాడు. టిక్కెట్లు ఉన్న వారు దొరలలాగా టిక్కెట్ల నిచ్చి గేటు దాటారు. వీరారెడ్డి మూటలో యేమిటో ఉన్నట్లు ప్లాటుఫారంమీద మూటవిప్పిబట్టలు చీరెలు విదిలించి యేమిటో వెదకటం ప్రారంభించేడు.

'ఏమండీ వీరారెడ్డిగారూ, సుఖంగా చేరుకున్నారా, మీటిక్కెట్లెక్కడన్నాడు స్టేషను మాష్టరుగారు.

'వాటికోసరమేనండి వెదకటం, విడిగా ఉంటే పోతాయని మూటలో కట్టాము'

'వెదకండి నెమ్మదిగా ఒక్కొక్కగుడ్డ పారేతీసి.'

'వెదుకుతున్నామండీ, తొందరకుపోతే ఆలస్య మవుతోంది.'

'ఆలస్యమయితే అయింది. అసలు మీరు టిక్కెట్లుకొన్నారా?'

'వెధవ టిక్కెట్టు భాగ్యానికి అబద్ధమాడుతాముటండీ. కొన్నాం'

'మీముగ్గురు టిక్కెట్లు ఒకే తడవ కొన్నారా.'

'ఒకేతడవ కాకపోతే ముగ్గురం మూడు తడవలు కొంటామా'

'అయితే పోయినా ఫరవాలేదు లెండి. ఆ స్టేషనుమాష్టరుగారికి తంతియిచ్చి తెలుసుకుంటా. మూడూ వరుస నెంబర్లు కాబట్టి

దీనితో వీరారెడ్డికి గుండెలు కొంచెంకదలబారినవి. అయినా కనపడనీయక 'ఏమండీ మా స్టేషనులో యిన్నాళ్ళనుంచీ పనిచేస్తున్నారు, నాపేరూ ప్రఖ్యాతి అంతా మీకు తెలుసు. న న్నామాత్రం నమ్మలేరండీ.'

'అట్లా వీలుకాదండీ మాకు మాట వస్తుంది, కనుక తప్పకుండా కనుక్కోవాలి, ఆస్టేషనుమాష్టరు రిపోర్టుచేస్తే నాపనిమోసం కావాలి.'

వీరారెడ్డికి చెమటలుపోసినవి, మాట్లాడలేక పొయ్యేడు, వీరారెడ్డి భార్యా కూతురు మొగమొగాలు చూసుకున్నారు, అంతా నిశ్శబ్దం, స్టేషనుమాష్టరుగారు వీరిని వదిలి లోపలికి పోలేదు, కలిసిపోవచ్చును గదా అని రెడ్డిగారియూరు పొయ్యేవారు ముగ్గు రక్కడ ఉండి పొయ్యేరు, ఈనిశ్శబ్దంలోనుంచి రెడ్డి కూతురు కంఠం బయలుదేరింది.

'ఏదోలెండి, అయ్యగారూ,మాచిన్నయ్య గారింట్లో పెళ్లికివెళ్లాం. అక్కడ రూపాయలన్నీ ఖర్చుపొయ్యాం. అంచేత టిక్కెట్లు కొనకుండా వచ్చాం. ఎట్లాగో అట్లా కనికరించి యీతడవకి వదలిపెట్టండి.'

'అట్లాగా అమ్మా, ఇది నా సొమ్ముగాదు, ఇస్తే పుచ్చుకోటానికి. ఇది కంపెనీవాడి సొమ్ము. మీరిప్పుడు బెజవాడ జంక్షనునుంచి మనిషి 1–కి రూ 2–8–0 ల చార్జీ చొప్పున 3 గురికి రూ 7–8–0 లు దానికి రెట్టింపు పదిహేను రూపాయిలు చెల్లించాలి. అంతవరకు స్టేషనువదలి పోవటానికి వీలులేదు.'

వీరారెడ్డి తమాయించుకున్నాడు.

'స్టేషనుమాష్టరు బాబుగారూ, మీరూ మేమూ యింతవరదాకా అన్నదమ్ముల్లాగా మెలిగాం. ఏవో లేమిడిసంసారాలు. ఇటువంటి సమయంలో నన్నిట్లా యిబ్బంది పెట్టకండి. మాఉత్తరపు పంపులో గుమ్మడిచెట్లు యెన్నికాయలు కాసినా యనుకున్నారు? మీకు కావలిసినన్ని కాయలు. ఇప్పుడే సారచెట్టో

కట్టి వెయ్యిపిందెలు వేసింది. అన్నీ కాయతే అయితే అయిదువందల కాయలు మీవి. ఈ మధ్య మీరు మామీద సీతకన్ను వేసారు. మా మెరపతోట విరియకాచింది. ఎప్పుడైనా అబ్దుల్లాను పంపిస్తే మీకోయిత్తైనా అతనికో వీసెడు కాయలు పంపేవాణ్ణి, ఈమధ్య మీ గేదెగొడ్డు మాచేనుప్రక్క పోయిందని కూడా విన్నాను. వెనకజరిగిన దానికి మాపెద్ద రెడ్డి నన్నెంతో మందలిస్తూ 'స్టేషనుమాష్టరు బాబు, ఎంతపెద్దమనిషి అనుకున్నావు. అట్లా మాట్లాడుతావుటరా, అల్లుడా' అన్నాడు. మీలాంతరుకూడా రేపోయెల్లుండో పంపించాలని చూస్తున్నాను.

'పంపిస్తారు వీరారెడ్డిగారూ, మీ అంత వారిని పోనివ్వటంకూడా మర్యాదే. కాని మాడిపార్టుమెంటు ఊరుకోదు, మీ రీతడవకీ స్వల్పమొత్తం పదిహేనురూపాయిలు యిచ్చి మరీవెళ్లండి. ఇంకోతడవ చూతాం.'

'బాబూ, ఏదో కనికరించండి. పొరపాట్లనేవి 3 తడవలంటారు పెద్దలు. ఇక యెక్కువరావు కదా! వెనకా యిట్లాగే రెండు తడవలు వదిలిపెట్టారు. మీమంచి యెక్కడికి పోతుంది?'

'ఛట్, నాన్‌సెన్సు, అదికూడా బయట పెట్టటమా! ఏమయినాసరే పదిహేనురూపాయ లివ్వనిది వదిలేదిలేదు, కావలిసి ఉంటే రసీదు పట్టుకెళ్లండి.'

'రసీదులు గిశీదులుకూడా యెందుకండి, మీరుతింటే మేము కాదన్నామా, మేము తింటే మీరు కాదన్నారా? జొన్నకుప్ప చేలోనే వున్నదికదా! ఒకతూమెడు జొన్నలు పంపుతాను లెండి.'

'అదేమళ్ళీ వాగుతావు. పదిహేనురూపాయి లక్కడపెట్టు.'

'మేష్టరుబాబూ, ఇవి చేతులుకావు. కాళ్ళనుకోండి. ఇంటిదగ్గెర రూపాయిలు కూడా లేవు. దయయుంచి వదిలిపెట్టండి.'

స్టేషనుమాష్టరు చేతులు వదిలించుకొని పోర్టరుని కుర్చీతెమ్మని వరండాలో వేసుకొని కూర్చున్నాడు. వీరి కొరకు కూర్చున్న కొండారెడ్డి, వెంకటరెడ్డి కూడా వచ్చి బ్రతిమాలి చెప్పారు, స్టేషనుమాష్టరు ససేమిరా విననన్నాడు. వీరారెడ్డికేమి ఆలోచనతోచిందో యేమో కొండారెడ్డిని తీసికొనిపోయి యేదో చెప్పాడు. కొండారెడ్డి, వెంకటరెడ్డి వెళ్ళిపొయ్యారు. వీరారెడ్డి సకుటుంబముగా స్టేషనులో మకాం.

సాయంకాల మారుగంటలయింది. వీరారెడ్డిపాలేరు బండి తోలుకొని స్టేషను మాష్టరుగారికి ఒక ఉత్తరం తీసుకొనివచ్చి యిచ్చినాడు; అది పెద్దరెడ్డి ఘంటారెడ్డి దగ్గెరనుంచి అందు 'బాబూ, ఏదో తెలిసియో తెలియకో మా మేనల్లుడు వీరారెడ్డి మిమ్ములను వెనుక యేదో అన్నట్లు నాకు తెలిసినతరువాత నేనతగాణ్ణి చాలా మందలించాను. అప్పటినుంచి మీ మొగము చూడటమునకు సిగ్గేసి యీ మధ్య మీదగ్గెరకుకూడా రావటం మానుకున్నాను. ఇప్పుడు వీరారెడ్డి యిట్లా రాకూడదనే అనుకోండి. మనమంతా అన్నదమ్ముల్లాగా మెలగుతున్నామని సాహసంచేశాడు. ఇప్పుడతనితో అయిదురూపాయలు పంపుతున్నాను, ఈకొంచెం పుచ్చుకొని వీరారెడ్డిని ఆడంగులతో సహా వదిలెయ్యండి. మీరేమీ రసీదూ గిసీదూ యివ్వక్కరలేదు, వీరారెడ్డిది లేమిడి సంసారం, ఇది తప్పక అంగీకరించి వీరారెడ్డిని వదిలిపెట్టండి. విశ్వాసం వృథా పోదు' అని ఉన్నది. క్రింద దస్కతు మామూలుగా ఉండదు. అందుచేత దీనిలోను

లేదు. స్టేషనుమాష్టరుగారు ఉత్తరం అంతా చదువుకొన్నాడు. దగ్గర వీరారెడ్డి పాలేరు వంక చూచేడు. వాడు వెండిరూపాయలు ఐదు చేతిలో పుచ్చుకొని నిలబడియున్నాడు. మాష్టరుగారికి యీ స్టేషనుకు వచ్చిన తరువాత వరుమానమే తక్కువ. అందులో యింత పెద్ద మొత్తము యెప్పుడూ లేదు, అదీగాక పెద్ద రెడ్డి అభిమానం బాగా సంపాదించుకోవచ్చునని అనుకొన్నాడు. చెయ్యిజాపి రూపాయిలు జేబులో దోర్లించేడు ఇంకేం ఆలోచించావోయ్, వీరారెడ్డిగారూ, 8 మైళ్లు నడవటం మీకు మీ ఆడంగులకు ప్రయాస అయ్యేది. బండి వచ్చింది. సుఖంగా యిల్లు చేరండి. దయయుంచండి' అన్నాడు.

వీరారెడ్డి సకుటుంబముగా యింటికి చేరాడు, రాత్రి 8 గంటలయింది. ఆదరా బాదరా అతని చెల్లెలు కోటమ్మ యింట్లో రెండు మెతుకులు నోట్లో వేసుకొని పెద్దరెడ్డి యింటికి వచ్చాడు. అప్పుడే పెద్దరెడ్డి వీధి మూలనుంచి యింటికిపోయి కొబ్బరిపీచు పెట్టి సంచులు వేసి కుట్టిన పరుపుమీద పరచిన గుడ్డబొంతమీద కూర్చొని మంచి లంకపొగాకుతో పాయతీసి జానెడు పొడుగు చుట్టచుట్టటం యితను వచ్చే సమయానికి పూర్తిచేస్తున్నాడు. వాకిట్లో నలభై యాభై పశువులు కట్టివేసి ఉన్నవి. అక్కడికి యేబదిగజాల దూరాన ఉన్న జొన్నలపాతరమీద పెద్దరెడ్డి పాలేరు పుల్లిగాడు జోరీగలు అటూయిటూ ముసరటంతో నిద్రపట్టక మసలుతున్నాడు. పెద్దరెడ్డి 'ఏమేవ్, గుగ్గిళ్ళదాలిలోది కొంచెమిట్లా తెచ్చిపెట్టు' అని కేకేసాడు, నిప్పు వచ్చింది. చుట్టముట్టించుకుంటూ.

'అల్లుడూ, మన కోటిరెడ్డి వివాహం బాగాచేసాడంటోయి.'

'ఆఁ'

'నువ్వేమన్నా చదివించేవా'

'నేనూ ఒక పాతికరూపాయలు చదివించా.'

'పెళ్ళివారూ వాళ్ళూ యేమీ దెబ్బలాడలేదు గదా.'

'ఊహూఁ'

'అయితే నిన్న అట్లావచ్చావుటే.'

'అదికాదు మామా, వచ్చాననే అనుకో సాయిదా ఫాయిదాగా నున్నాముకదా అని, ఆమాత్రం వదిలిపెట్టకుండా నన్నొకడనే కాకుండా ఆడవాళ్ళతో సహా అక్కడ నిలుపుతాడూ?'

'ఏవో, ఆయన డ్యూటీప్రకారం ఆయన నిలిపేడు.'

'అదేమిటి, మామా, నువ్వూ అట్లా మాట్లాడుతావు. అందుకనే మనమంతా యిట్లా చెవులుపట్టి ఆడించటం. వెనుక మన రెడ్డిరాజులు పరిపాలన చేస్తూవుంటే సీమ సీమంతా గడగడలాడేది, ప్రతి కత్తీని తలుచుకున్నప్పుడు పొడిచి పారవేసేవారు. కత్తుల మీదనే భోజనంచేసేవారు, రెడ్డిప్రభువుల పేరుచెపితే పసిబిడ్డ పాలుత్రాగటం మానేవాడట, వాళ్ళకడుపున చెడబుట్టాము. మన పౌరుషమంతా యిల్లా చచ్చిపోబట్టే ఒక రైలునౌకరు మన ఆడంగులను అట్లా నిలిపి ఉంచగలిగాడు.'

'నిజమేనోయి వీరారెడ్డి. అది నాకూ మటంగానే ఉన్నది. ఏదేశంవాడో యిక్కడకు బ్రతకటానికి వచ్చి రెడ్లఊరనన్నా చూడకుండా మమ్ములనన్నా చూడకుండా అట్లా నిలుపుచేస్తాడోయి.'

'ఎంతదారుణమైన పనో చూడుమామా, మనకుటుంబానికి యింత అవమానంచేస్తాడు

వీణ్ణి నాశనంచెయ్యాలి.'

'అవును, ఏదో ఆలోచించు.'

'నీకెందుకు, నే చెప్పినట్లల్లా చెయ్యి నువ్వు చూతుగాని రేపుసాయంత్రానికి యితని తమాషా'

'అట్లాగే, ప్రొద్దుపోయింది. వెళ్ళిపడుకో.'

వీరారెడ్డి ఆరాత్రే కొండారెడ్డి మొదలైనవారి యిండ్లకుపోయి యేమేమో మాట్లాడి రాత్రి 12 గంటలకువచ్చి పడుకొన్నాడు.

• • *

మరునాడు ఉదయం ప్రక్కస్టేషనునుండి యీస్టేషనుమాస్టరుగారికి తంతి వచ్చింది. అందు వీరారెడ్డి యీస్టేషనుమాస్టరుగారిపై యేదో డిస్ట్రిక్టుట్రాఫిక్ సూపరింటెంట్ గారికి రిపోర్టుచేసినట్లు ఆయన 11 గంటల బండికి విచారణకురాగలనని మరల తంతినిచ్చినట్లు గలదు, స్టేషనుమాస్టరు గుండెలు కదలజారినవి. వీరారెడ్డి అబద్ధానికొస్తే పెద్దరెడ్డి కూడా అబద్ధం చెప్పుతాడా అనుకున్నాడు. ఆఫీసరు స్వయముగా వస్తున్నాడు, అకౌంట్లలోగల లోపములు సరిచూచుకోవలసి యున్నది. ఈ అడావిడిలో ఘంటారెడ్డివద్దకు పోయివచ్చుటకు వేళలేదు, భగవంతుడు లేడా అని గుండె రాయిచేసుకొని కాగితములు చూచుకుంటూ కూర్చున్నాడు.

11 గంటలబండి వచ్చింది. డిస్ట్రిక్టుట్రాఫిక్ సూపరింటెంటుగారు ఒకరిలీవింగు స్టేషనుమాస్టరు ఒక క్యాంపుగుమాస్తా ఒక జవాన్‌తో స్పెషల్ పెట్టెలోనుంచి దిగేడు. ఆయన దిగిన 4, 5 నిముషాలకు ఘంటారెడ్డి వీరారెడ్డి మొదలైనవారు రెండుబండ్లు చేయించుకొని స్టేషనువద్ద హాజరు అయారు. స్టేషనుమాస్టరుగారు కాఫీ స్వహస్తాలతో చల్లారబోసి ఆఫీసరుగారికి యివ్వబోయ్యేరు కాని ఆయన పుచ్చుకోలేదు.

కేసు విచారణ ప్రారంభమైనది. వీరారెడ్డి తనభార్యా, యిరువదియేండ్ల కుమార్తె తన తమ్ముడుగారి యూరునుండి రైలుదిగగా స్టేషనుమాస్టరుగారు వారలకు మగవారు తోడులేకుండుట చూచి తనకుమార్తెచేతిలో టిక్కెట్లు పుచ్చుకొనుచూ యేదియో మాట్లాడినాడనియు, దాని కాపె విరసముగా జవాబుచెప్పిన కారణముచేత టిక్కెట్లు లేకుండా రైలు దిగినారనియు బెజవాడనుంచి రెట్టింపుచార్జి రు 10-0-0 లు చెల్లించవలయునని చెప్పి సాయంత్రమువరకు తనకూతురిని భార్యను స్టేషనులో నిలిపియుంచినాడనియు అప్పుడు కొండారెడ్డి మొదలైనవారు తనకు వచ్చి చెప్పగా తానువచ్చి పదిరూపాయిలు చెల్లించి వారల విడిపించుకొని వెళ్ళితిననియు యీ రూపాయలకు రసీదు అడిగితే నాన్‌సెన్సు బ్రూట్ అని తిట్టినాడనియు కేసు దాఖలుచేసినాడు. కొండారెడ్డి వచ్చి యిదంతా నిజమేనని వాఙ్మూలం యిచ్చినాడు. ఊరికైన పెద్దరెడ్డి వచ్చి 'బాబూ, దండాలు, అవ్వేళ మా ఆడవాళ్ళను ఏదో అన్నమాట నిజమేట, నాదగ్గరనుంచే వీరారెడ్డి పది రూపాయలు తీసుకొని వెళ్ళి భార్యా కూతురిని వదిలించుకొచ్చేడు, అధికారులుకదా బాబూ తమరు, ఏదో న్యాయం విచారించకపోతే మోటవాళ్ళం ఎట్లా బ్రతుకుతాము,' అన్నాడు చల్లగా. వీరారెడ్డి భార్యా కూతురు కూడా వాఙ్మూలాలు యిచ్చారు. ఇవి అన్నీ విన్న స్టేషనుమాస్టరుగారికి మతిపోయినది. ఘంటారెడ్డికూడా తనమీద యిట్లా చెప్పుతాడని అనుకోలేదు. సంఘాన్నిమించిన దేవుడు లేడనుకున్నాడు.

స్టేషనుమేష్టరు చెప్పుకోవలసిన వేళ వచ్చింది, ఏంచెప్తాడుపాపం, టిక్కెట్లు లేకుండా వచ్చేరు అంటే తాను యెక్సెసు చార్జీ వసూలుచెయ్యాలి. వాళ్లు నిండాచార్జి యివ్వలేదు అందుచేత తను రసీదుయివ్వ లేదు. ఏమీ పాలుపోలేదు. ఇదంతా తనేమీ యెరుగనన్నాడు, వీరారెడ్డి స్టేషన్‌లో లాంతరు దొంగిలించి కేసుపెడతానంటే యీ పన్నాగం పన్నాడన్నాడు. కాని తనకు సాక్ష్యమెవరు? పోర్టరు అబ్దుల్లా వాఙ్మూలం తీసుకున్నారు, అతడుకూడా రెడ్లతరఫున మాట్లాడకపోతే ఉపద్రవమేమి కలుగుతుందో అని రెడ్లకనుకూలంగానే చెప్పాడు. ఆఫీసరుగారంతా రికార్డుచేసి తీర్పువ్రాయటం ప్రారంభించినాడు. ఇది పూర్తియగు సమయమునకు నాలుగుగంటల బండివచ్చింది.

డిష్ట్రిక్టుట్రాఫిక్ సూపరింటెండెంటుగారు తమ స్పెషల్ పెట్రోలోయెక్కి స్టేషనుమాష్టరుగారికి రెండు సంవత్సరములు నౌకరీనుండి సస్పెండ్ చేసితిమనియు వెంటనే చార్జీ అప్పజెప్పవలయుననియు హుకుం జారీచేసిరి. తమతో తెచ్చిన స్టేషనుమాష్టరు నచట నుంచిరి.

కూఁయని రైలుపోయినది. వీరారెడ్డి పకాల్ పకాల్‌న నవ్వాడు. ఘంటారెడ్డి చిన్నవోయిన మొగముతో తలవొంచుకొని కూర్చున్నాడు. పాత స్టేషనుమాష్టరుగారు తలవంచుకొని కన్నీరు భూమిపై జొటజొట పడగా 'ప...శు...వు' అనుకొనుచు తన క్వార్టర్సులోకి వెళ్ళిపోయినాడు.

—'మూర్తి'

# జైనగ్రంథాలయములు

బౌద్ధమతమువలెనే జైనమతముగూడ బ్రాహ్మణమతమునకు ప్రతిస్పర్ధిగ బయల్వెడలినది. బ్రాహ్మణమత రహస్యములు విద్యాధికులగు నగ్రజాతివారికే స్వామ్యముగనుండ జైనబౌద్ధమతములు జనసామాన్యము యొక్క యభివృద్ధికై బయల్వెడలినవి. క్రీ. పూ. 6-వ శతాబ్దిలో స్థాపింపబడిన యీ నూతనమతము కొంతకాల మభివృద్ధినందియు, బౌద్ధమతము విజృంభించిన నాటినుండియు నుత్తరహిందూదేశమున క్షీణింపదొడగినది. కాలక్రమమున దక్షిణాపథ ద్రవిడదేశములలో నియ్యది స్థిరపడినది. చంద్రగుప్తమౌర్యుని కాలమున కొందరుజైనులు దక్షిణమునకు వచ్చిరని యొక గాథ గలదు. (1) నేటికిని గుజరాతుప్రాంతమునను ద్రవిడదేశముననే జైనులు విశేషముగ గాంపనగుచున్నారు.

బౌద్ధులవలెనే జైనులు మతప్రచారమునకును, విద్యావ్యాపనమునకును వాసికెక్కియుండిరి. అంతియగాక దక్షిణాపథమున కార్యనాగరికత వీరిమూలముననే లభించినది. విద్యావ్యసనులగు వీరికిని గ్రంథాలయోద్యమమునకును సన్నిహితమగు సంబంధముగలదు. ఈ జైనులు నిర్జనములును నిస్సారములునగు లోభాగమునగల ప్రదేశములకు వలసపోయి, యచ్చట యడవులను నిర్మూలించి, భూమిని కృషియోగ్యముగనొనర్చి, పల్లెలను, పట్టణములను నిర్మించి, ప్రజలను జేరదీసి, వారి దేశభాషలలోనే వారికి విద్యనుగఱపి, తమ మతమును బోధించుచుండిరి. జైనాచార్యులందరును మేధాసంపన్నులును, పాండిత్యవిభవమునకును, పూతచరిత్రమునకును బేరెన్నికగాంచి యుండినట్లు వారికిగల బిరుదనామములనుండి స్పష్టమగుచున్నది. ఈ యాచార్యుల యసామాన్య వైదుష్యమునకు గీర్వాణ కర్ణాట

1. M. S. Ramaswamy Iyengar-South Indian Jainism, Ch I.

ద్రవిడ వాఙ్మయములు ప్రబల ప్రమాణములు. ద్రవిడమున మూడు నైతిక కావ్యములును, మహా పురాణములలో మూడును, పండ్రెండు ప్రబంధములును జైనకవులచే లిఖింపబడినవే. (2) అంతియగాక ద్రవిడవాఙ్మయమునం దగ్రస్థానమును వహించు సంగయుగగ్రంథములలో ముఖ్యములగు శిలప్పదికారం, కురల్ అను కావ్యములు జైననిర్మితములు. అటులే మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో నిరువదియైదు సంస్కృతగ్రంథములును, డెబ్బదియెనిమిది కన్నడగ్రంథములును జైనకవులచేతను పండితులచేతను రచింపబడినవి గలవు. ఇవి పురాణ, ఆగమ, వేదాంత, కావ్య, వ్యాకరణ, అలంకార, తర్క, రాజ్యాంగ, భూగోళ, గణిత, గాంధర్వాది వివిధవిజ్ఞానశాఖలకు సంబంధించినవి. (3) క్రీ. శ 12-వ శతాబ్దికి పూర్వముగల కన్నడ వాఙ్మయమంతయు జైనులచే నిర్మింపబడినదేయని చెప్పవచ్చును. కర్ణాట ద్రవిడములకేగాక ప్రాచీనాంధ్ర వాఙ్మయమునకుగూడ జైనులుత్కృష్టమగు సేవను జేసియుండిరనియు, నన్నయకు పూర్వముండిన తెలుగుభాషను వారే యభివృద్ధికి దెచ్చియుండిరనియు సుప్రసిద్ధులగు పండితులయభిప్రాయము (4). ఈ విధముగ జైనులు దక్షిణమున దేశభాషా వాఙ్మయములకును, విజ్ఞానమునకును పునాదులను నిర్మించిరి.

ఇట్టి వైజ్ఞానికప్రచారకులకు గ్రంథములతో విశేషమగు పరిచయముండియుండెననుట నిర్వివాదాంశము. ఈ యూహను జైనుల యాచారములలో ముఖ్యమగు నొకవిషయము బలపరచుచున్నది. బౌద్ధులవలెనే జైనులును వాస్తునిర్మాణమునకై వాసికెక్కియుండిరి. వారు నిర్మించిన ప్రతిపట్టణమునను గూడ నొక జినాలయము స్థాపింపబడుచుండెడిది. దీనిని జేరి సుప్రసిద్ధ జైనక్షేత్రమగు శ్రావణబెళ్గోలా యందువలెనే, యొకమఠము గట్టబడుచుండెడిది. ఈ మఠములకు 'ఉపశ్రయము'లని పేరు. జైనభిక్షువు లీమఠములలో నివసించుచు, నాలయములలో జినపూజలను జేయుచు, పరిసరప్రాంతములందలి జనులకు విద్యామతబోధనలను జేయుచు, నిరంతరమును విద్యావ్యాసంగములతోడను, పాండితీపరామర్శలతోడను గాలముగడపుచు, నిరాడంబరముగను, నిష్కళంకముగను జీవయాత్రను సాగించుచుండిరి. బౌద్ధ భిక్షువులకువలెనే జైనసన్యాసులకుగూడ మతగ్రంథములకు బ్రతులను వ్రాయుట ముఖ్యమగు కర్తవ్యముగ నుండెడిది. అంతియగాక నీ పండితులు సంస్కృతమున నెన్నియో జైనగ్రంథములను వ్రాసియు, ప్రజాసామాన్యమునకు మతరహస్యములు దెలియుటకై దేశభాషలలో గ్రంథరచనమును, భాషాంతరీకరణము నొనర్చియు, నిరంతరమును పుస్తకములతో వ్యవహరించుచుండిరి. క్రీస్తుశకారంభకాలమున దక్షిణదేశమునను, ముఖ్యముగ కర్ణాటాంధ్రదేశములందును రాజులు వీరి నాదరించి, వీరి యుపశ్రయముల కెన్నియో దానములను జేసియు, వీరిచే నెన్నియో గ్రంథములను వ్రాయించియు నాదరించిరి. ఇట్టి విద్యాపిపాసువులును, మతప్రచార పరతంత్రులును, గ్రంథరచయితలునగు జైనభిక్షువులు నివసించెడి యుపశ్రయములలో గ్రంథసముదాయము లుండెడివనుటకెట్టి యభ్యంతరమును లేదు. నేటికిని గుజరాత్ ప్రాంతమున గాంచనగు ప్రాచీన జైన మఠములలో పదిలపరుపబడిన గ్రంథసంచయము లీ యూహను స్థిరీకరించుచున్నవి. గాన, ప్రాచీనజైనుల వైదుష్యమునుండియు, వాఙ్మయసేవనుండియు, నాధునిక మఠములందలి భాండాగారములను బట్టియు, పూర్వకాలమున ప్రతియుపశ్రయము నొక గ్రంథాలయముగ నుండెనని స్పష్టమగుచున్నది.

అటులయినచో నిట్టి జైనగ్రంథాలయములు ప్రాచీనకాలమునం దేయేస్థలముల నుండెడివి? యనుప్రశ్న యీ సందర్భమున బయల్వెడలును. జైననివాసముగ నుండిన ప్రతిస్థలమునను జినాలయములుండెడివనియు, వానిని జేరి యుపశ్రయములు నందు గ్రంథాలయములు నుండెడివని యిదివరలో జెప్పియుంటిమి. మనదేశమునం దెచ్చటెచ్చట జైననివాసములుండినవో యచ్చటచ్చట జైన

2. Ibid Ch II.
3. Dr. B. Seshagiri rao - Andhra-Karnata Jainism p.p. 94-98.
4. Ibid p.p. 100-129.

గ్రంథాగారములుండెడివని చెప్పవలసివచ్చును. శాసనములనుండియు, శిథిలములనుండియు, వాఙ్మయమునుండియు, జైననివాసములనుగూర్చి విశేషాంశములు తెలియుచున్నవి. దక్షిణదేశమున మధుర, రామనాథపుర జిల్లాలలో పదిపండ్రెండు స్థలములందు జైన శిథిలములును, బ్రాహ్మీశాసనములును కన్గొనబడినవి. (5) ఇందు గొన్నియైనను జైనబస్తీలయి యుండవచ్చును. క్రీ. శ. 4, 5 శతాబ్దములలో మధురలో నొక జైనసంఘముండెడిదని ద్రవిడ వాఙ్మయమునుండి దెలియనగుచున్నది. (6) స్థానిక చరిత్రములందును, కైఫీయతులందును జైనుల ప్రశంస పెక్కుచోట్లగలదు. జైన శిథిలములు దత్తమండలముల యందును, తూర్పుతీరము నందలి యాంధ్రమండలములందును గన్గొనబడినవి. నేడు చూచుటకైననులేక, ప్రాయికముగ దుర్వినియోగముల కాలవాలములగు నీ దిబ్బలును, రాళ్ళకుప్పలు నొకప్పుడు సచ్చరిత్రులగు భిక్షువులకును, సుప్రసిద్ధములగు గ్రంథములకును నివాసస్థానములుగ నుండియుండినవి. కర్ణాటాంధ్ర ద్రవిడదేశములందలి శాసనములు పెక్కు జినాలయములను పేర్కొనుచున్నవి. ఈ యాలయములుండిన చోటులనెల్ల నుపశ్రయ గ్రంథాలయములుండెడివని యిదివరలో చెప్పియుంటిమి. పెనుకొండ, అమరపురము, తమ్మడహళ్ళి, అగలి, కొటిపి, తాడిపత్రియను అనంతపురమండల గ్రామములందును బళ్లారి జిల్లాలోని రాయదుర్గ్, కొగలి, విజయనగరము, చిప్పిగిరి, నాయకల్లు, కురుగోడు, తుంబలం అను స్థలములను కడప జిల్లాయందలి దానవులపాడులోను ముడబిదిరె, వనూరు, బరనూరు, కోటేశ్వర, కర్కుల, కడప యను దక్షిణకనరామండల ప్రాంతములను విశాఖపట్టణము జిల్లాలోని లక్కవరపుకోట, భోగాపురము, రామతీర్థము నను గ్రామములందును గంటూరు జిల్లాయందలి యమరావతిలోను వళ్ళిమలై యను నుత్తరార్కాడు మండల గ్రామమునను కృష్ణామండలమునందలి బెజవాడ, కలచంబట్టులందును మైసూరు రాజ్యమున శ్రావణ బెళ్గొళలోను కొల్లిపాక, కంగాపురము, అలంపూరు మున్నగు మైసూరురాష్ట్ర ప్రాంతములందును జినాలయము లుండెడివని శాసనములనుండి తెలియుచున్నది. (7) గాన నీ స్థలములలో నెల్ల జైనోపశ్రయములును, వానినిజేరి గ్రంథాలయములు నుండెడివని యూహింపవచ్చును.

ప్రాచీన జైనగ్రంథాలయములను గూర్చిన వివరములు దెలియుటలేదు. కాని మధ్యయుగమునాటి గ్రంథసముదాయములు కొన్ని నేటికిని గనవచ్చుచుండుటవలనను, నేడును పూర్వ సాంప్రదాయములే వ్యాప్తిలో నుండుటవలనను, వీనినిబట్టి పూర్వ పుస్తకభాండారములనుగూర్చి విశేషములను మన మూహింపవచ్చును. ఈ యాధునిక గ్రంథాలయములు బశ్చిమమునను దక్షిణమునను గన్పించుచున్నవి.

## పశ్చిమదేశము

రాజపుత్రస్థానము, గుజరాత్, అన్హిల్వాడ్ పట్టన్, జసల్మీర్, సూరత్, క్యాంబ్, అహమ్మదాబాదు మున్నగుచోట్ల జైన పుస్తకభాండారము లెన్నియో గలవు. వీనికి 'భారతీభాండారము' లనిపేరు. ఇందు పెక్కు నిలయములలో 10000 కు మించిన లిఖిత గ్రంథములున్నవి. పట్టన్ నగరము నేటికిని జైనులకు ముఖ్యస్థానము. ఇచట నెందరో శ్రావకులున్నారు. ఈ పట్టణములోని పదిపండ్రెండు ఉపశ్రయములందును గ్రంథాలయములు గలవు. ఈ ఉపశ్రయమే అగచ్ఛమునకు జెందినదో దానికి అధ్యక్షుడగు శ్రీ పూజానియొక్కయు, నగర్ సేత్ యొక్కయు స్వాధీనమున నందలి గ్రంథాలయముగూడ నుండును. పది లేక పదునైదు గ్రంథము లొక్కొక అట్టపెట్టెలో పదిలపరుపబడియుండును. ఉపశ్రయములోని సన్యాసులు వీనిని తరచు పైకిదీసి, పరీక్షించుచుందురు. ఇతరులు వానిని చదువుదురు. మరికొందరు వానికి ప్రతులను వ్రాయుదురు. పట్టన్ లోని గ్రంథాలయములలో ఖర్తరగచ్ఛమునకుజెందిన హేమచరిత్ర భాండారము ముఖ్యమైనది.

5. South Indian Jainism p. 34.
6. Ibid p. 52.
7. Andhra Karnata Jainism p. 34.

ఇందు 40 పెట్టెల పుస్తకములున్నవి. ఆచటి తపగచ్ఛమునకు జెందిన భాండారమున సుమారు 1200. లును, సంఘవినపదనో భాండారమున మరియొకదానిలో 500. తాళపత్రగ్రంథములున్నవి. వీనిలో భాష్యములు, చూర్ణులు, వృత్తులు మున్నగు జైనమతగ్రంథము లనేకములున్నవి. పటన్ భండారములకు బిమ్మట పేర్కొనదగినది జసల్మీరులో పార్శ్వనాథాలయమునగల గ్రంథాలయము. ఇందు అరుదుగ లభించు 12 13 శతాబ్దముల నాటి జైనగ్రంథములే గాక కొన్ని సంస్కృతకావ్యములును, హిందూ శాస్త్రగ్రంథములునుగూడ గలవు. బిల్హణుని విక్రమాంకదేవచరిత్రమును, ఉపేంద్ర హర్షపాలితుడను మరియొక సంస్కృతకవి రచించిన కావ్యమును జసల్మీరు గ్రాంథాగారముననే మొట్టమొదట లభించినవి. (8)

## దక్షిణదేశము

దక్షిణదేశమునగూడ నెన్నియో జైనబస్తీలు నేటికిని గలవు. ఇవియన్నియు ప్రాచీనకాలమున స్థాపింపబడినవే. మైసూరురాజ్యములోని శ్రవణబెల్గోలాలోను కనరాజిల్లాలోని ముదబిదిరెలోను, కర్కల, వేనూర్ మున్నగు స్థలములందు నిట్టి సంస్థలుగలవు. శ్రవణబెల్గోలా ఉపశ్రయములో నుత్కృష్టమగు గ్రంథాలయమున్నది. ఇందు సంస్కృత, పాళీ, కన్నడ, ద్రవిడ భాషలలో లిఖింపబడిన తాళపత్రగ్రంథము లెన్నియో గలవు. మైసూరులోని హుంచయను మరియొకచోట గూడ మరియొక చక్కని గ్రంథాగారమున్నది. (9)

పై జైనశిథిలములయొక్క వర్ణనమునుండియు, వానిలో ఉపశ్రయములును, గ్రంథాలయములు నుండెడివనుటకు గల యాధారములనుండియు మనకు నేడు బహుకొలది జైనగ్రంథాలయములే గనపడుటకు కారణమేమి? యను సందేహము గలుగుచున్నది. దీనికొకయుత్తరము నొసంగవచ్చును. బౌద్ధ జైనమతములు రెండును గొంతకాలము ప్రబలినపిమ్మట హిందూమతము సంస్కరింపబడి యీ రెండుమతములను నిర్వీర్యముల నొనర్చెను. అంతియగాక శైవమతము విజృంభించుటతోడనే జైనులపై శైవులు దండెత్తి వారిని హింసింపనొడగిరి. క్రీ శ. 5-వ శతాబ్దమున శైవాచార్యుడగు తిరుజ్ఞానసంబంధుడు జైనులపై సాగించిన దండయాత్ర రెండుశతాబ్దములవరకును సాగినది. అందువలన పాండ్యపల్లవ రాజ్యములలో జైనమతము క్షీణించినది. పెరియపురాణమను ద్రవిడ ప్రబంధమునందును, మధుర దేవాలయములోని వర్ణచిత్రములందునుగూడ తాత్కాలిక జైనవిధ్వంసము చిత్రింపబడియున్నది. (10) తిరిగి క్రీ. శ 11-వ శతాబ్దమున మరియొకసారి జైనులపై దండయాత్ర జరగినది. ఇది వేంగిచాళుక్యరాజగు రాజరాజు కాలమున బయల్వెడలి బసవేశ్వరుడు వీరశైవమతమును స్థాపించినబిమ్మట ప్రబలినది. (11) పిమ్మట తిక్కనసోమయాజియు నోరుగల్లు సామ్రాజ్యాధీశ్వరులగు గాకతీయరాజులు నీ యుద్యమమును ప్రోత్సహించిరి. బసవపురాణ, సోమదేవరాజీయాది గ్రంథములలో నీ కాలమున శైవులు జైనులను, వారి గ్రంథములను, మందిరములను విధ్వంసమొనర్చిన విధము చక్కగ వర్ణింపబడియున్నది. ఈ యవాంతరముల నన్నిటిని దాటియే మూలలనైనను గొన్ని జైనగ్రంథాలయములు మిగిలియుండినచో మహమ్మదీయులు వానిని దుడిచివైచియుందురు.

ఈ విధమున పరంపరలుగవచ్చిన ఈ ప్రళయముల మూలమున జైనగ్రంథాలయము లెన్నియో నశించిపోయియుండును. దేశమునందలి బళ్ళెమోత్తరభాగముల మిగిలియున్న భాండారములుమాత్ర ముత్కృష్టములైనవి.

—మారేమండ రామారావు ఎం.ఏ.బిఇడి.

8. Buhler's Rept. On search for Sans. Mss. in Gough's papers. R. N. Ghosh - 'Indian Libraries' Sec. VIII. in " The Dawn " Vol XII (Old series) p.p. 77-79.
9. Ipid XIII-i. p.p. 1-3.
10. South Indian Jainism p.p. 64-72.
11. Andhra Karnata Jainism p. p. 118-116.

# ది స్టార్ ఆఫ్ ఇండియా
# ఇండస్ట్రియల్ అండ్ జనరల్ అస్యూరెన్సు
# కంపెనీ, లిమిటెడ్

8, శంబుదాసు వీధి, మదరాసు.

## అభివృద్ధి

| | | |
|---|---|---|
| చేరిన వ్యాపారము | రూ 27 | లక్షలు. |
| చెల్లించిన క్లెయిములు | ,, $2\frac{1}{2}$ | లక్షలు. |
| సంవత్సరాదాయము | ,, 3 | లక్షలు. |

"కంపెనీ నిర్వహణ చాకచక్యమునకు కంపెనీవారిని ప్రశంసింపకతప్పదు. ప్రస్తుతపు పాలసీదారులు, రాబోవు పాలసీదారులు కంపెనీ పరిస్థితులకు గర్వించ వలసిన అవకాశము కలదు" అని ఆక్చ్యుయరీ కె. బి. మాధవగారు ప్రశంసించి యున్నారు.

ధారాళమైన కమీషను, వేతనముపై పలుకుబడిగల ఏజెంట్లు కావలెను.

యమ్. యస్. ఆర్. ఎ. గుప్త, మేనేజింగు ఏజంటు.




స్థాపితం. 1920.

# అత్యద్భుత కుష్ఠురోగనివారిణి (రిజిష్టర్డు)

గుణములేదని ఋజువుచేయువారికి రు 500 లు బహుమానము.

18 రకములు కుష్టులు, శ్వేతకుష్టు, తదితర చర్మవ్యాధులు యెంతకాలము నుండి జీర్ణించియున్ననూ గ్యారంటీగా బాగుచేయబడును. 'అత్యద్భుత కుష్ఠురోగ నివారిణి' యను దివ్యౌషధమువలన అనేకవేల రోగులు పూర్ణారోగ్యమును బొంది సంసారసుఖము ననుభవించుచున్నారు. చిరకాలమునుండి ప్రసిద్ధికెక్కిన కంపెనీ రెడ్డి కంపెనీయే. యింజక్షనులవలన ఫలితము పొందని రోగులనేకులు మాయొద్ద చికిత్సబొంది పూర్ణారోగ్యమును బడయుచున్నారు. పైవ్యాధులకేగాక సెగ, సవాయి, శుక్లనష్టము, మూర్ఛ, మూలశంక మొదలగువ్యాధులకు మాయొద్ద గ్యారంటీ ఔషధములున్నవి.

" నకలు మందులనుచూచి మోసపోకుడు "

పూర్తివివరములకు యీక్రింది యడ్రసునకు వ్రాయుడు.

| | | |
|---|---|---|
| గోపాలపురము పోస్టు (వయా) కొత్తపేట, తూర్పుగోదావరి జిల్లా. | రెడ్డి అండ్ కో (రిజిష్టర్డు) | బ్రాంచి ఆఫీస్ : (కుష్ఠురోగచికిత్సానిపుణులు) వాల్తేరు.ఆర్.యస్.పోస్టు. |

# ది సౌత్ ఇండియా కో-ఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీ, లిమిటెడ్.

పోస్టుబాక్సు నెం 182 రు. మద్రాసు.

ఈసొసైటీలో ప్రీమియములు చాలతక్కువే! ఎందుచేత ? కార్యనిర్వహణమునకగు ఖర్చు చాల తక్కువగుటచేత.

దక్షిణహిందూదేశమున కంతకు నీ సొసైటీ యొక్కటియేనా ? ఔను. ఎందువలన ? సహకారధర్మముల మీద నడుపబడుటవలన.

జనసామాన్యమునకు చాల ఉపయోగించునట ! ఏ విధమున ? రు 100 లు తక్కువ మొత్తము మొదలు రు 5000 లు వరకు మాత్రమే పాలసీలు జారీచేయుటవలన.

దీనిలో కార్యనిర్వహణవ్యయము చాలతక్కువా? ఔను. ఎట్లు ? సహకారసంఘలాభములను పొందుటచేతను, విశేషవ్యయమునకు కారణమగు బ్రాంచి ఆఫీసుల నెలకొల్పక పోవుటచేతను.

బ్రాంచి ఆఫీసులస్థాపింపకనే మంచివ్యాపారము చేయుచున్నట్లున్నది. ఏలాగున ? రాజధానిలోని సహకార సంస్థల కనుబంధములుగా లోకల్ బోర్డులను స్థాపించి.

ఈ ప్రణాళిక పాలసీదారులకు చాల సౌకర్యమే! ఔను. మనియార్డరునకగు కమీషనుఖర్చు లేకుండ పాలసీదారులు సహకారసంస్థలలో వారి ప్రీమియములను చెల్లింపవచ్చును.

సహకార సంఘలాభము లెవ్వి ? ముఖ్యమైనవా ? ఔను. రాబడిపన్ను లేకపోవుట, స్టాంపుడ్యూటీ లేకపోవుట మొదలైనవిన్ని, పాలసీదారులే వాటాదారులగుట.

నీకు లాభముకావలెనా, నష్టముకావలెనా? లాభమే. ఐన, ఆలస్యముచేయక నేడే ఈ సౌత్ ఇండియా కోఆపరేటివ్ ఇన్సూరెన్సు సొసైటీలో నొక పాలసీ తీసికొనుము.






యీ ట్రేడుమార్కును చూచిన మోసపోరు.

# అత్యాశ్చర్య కుష్ఠరోగ నిర్మూలిని

(రిజిస్టర్డు.)

గుణము లేదని ఋజువుచేయువారికి రు. 1000 లు బహుమానము. 18 రకముల కుష్ఠులు, బొల్లి, సుఖరోగములు యే స్థితిలో యెంతకాలమునుండి జీర్ణించియున్నను గ్యారంటీగా బాగు చేయుదుము. వృత్యశ్య ముఖమునుండి అనేక వేల రోగులు రక్షింపబడిరి. యింజక్షనువలన ఫలితముగానని రోగులు మామందువలన పూర్ణారోగ్యమును పొందిరి. పూర్తి వివరములకు అన్నిభాషలలోను దొరకు మా కేట్లాగులకు యీదిగువ యడ్రసుకు వ్రాయుడు.

లక్ష్మి అండ్ కంపెనీ (రిజిస్టర్డు.)

కుష్ఠు అండ్ సుఖరోగ చికిత్సా నిపుణులు,

అల్లిపురం మెయిన్‌రోడ్డు, వాల్తేరు
ఆర్. యస్ పోస్టు.

# సి. పుల్లయ్యగారు

[డైరెక్టరు. ఈస్టు ఇండియా ఫిలింకంపెనీ, కలకత్తా.]

భారత దేశమందలి ప్రసిద్ధ పరిశ్రమలలో నొకటియగు సినిమా పరిశ్రమయందు పేరు గడించిన ఆంధ్రులలో సి. పుల్లయ్యగారు ముఖ్యులు. వీరి నివాసస్థానము కాకినాడ. వీరు చిన్నతనము నుంచియు నాట్యకళయం దభిమానము గలిగి కాకినాడయం దొకనాటక సమాజమును స్థాపించి దానిని చాలకాలము జయప్రదముగా నిర్వహించిరి. పౌరాణిక నాటకములన్న వీరికి ఎక్కుడు అభిమానము.

తరువాత కొంత కాలమునకు అప్పుడు మద్రాసునందు స్థాపించబడియుండిన స్టారు పిక్చరు కంపెనీవారి ఆదరణను కొన్ని పౌరాణిక ఫిల్ములను డైరెక్టు చేసిరి. విశాఖపట్టణము,



కాకినాడ, గుంటూరునగరములయందు సినిమా ప్రదర్శన శాలలను మూటిని చాలకాలము నడిపి అనేక పౌరాణిక ఫిల్ములను ప్రదర్శించి వీరు మన రాజధానియందు సినిమా అభిరుచిని ప్రజలలో ప్రవేశపెట్టినవారిలో ముఖ్యులైరి. ఈ కాలమునందే తమ స్వంతధనముతో 'మార్కండేయ' చరిత్రను పవిత్ర సింహాచల పరిసరములతో ఫిలిము తీసి ప్రజల మెప్పును పొందిరి. ఇంతలో దేశమున టాకీలు ప్రవేశించి బొంబాయి, కలకత్తా నగరములలోని పెట్టుబడిదారులను ఒక్కమారుగా కదలించినవి. కలకత్తాలోని ప్రసిద్ధ ఫిలిము పరిశ్రమాకేంద్రమగు ఈస్టిండియాఫిలిం కంపెనీ అధికారులు తమకుగాను ఒక తెలుగు టాకీని తయారుచేయుటకు పుల్లయ్యగారిని కోరగా, వారు 'సతీసావిత్రి'ని తయారుచేసిరి. అది అఖండమైనవిజయము బడయుట చూచి కంపెనీవారు మరల నొక టాకీనితీయుటకు పుల్లయ్యగారిని నియమించిరి. దానిమీద ఆంధ్రదేశము నంతటిని ఆనందమున నోలలాడించుచున్న 'లవ-కుశ'ను తయారుచేసి భారతదేశమందలి ప్రసిద్ధ డైరెక్టరులలో నొకరుగా గౌరవమునుపొందిరి. తెలుగు టాకీలలో 'సావిత్రి' 'లవ-కుశ'లు పొందిన గౌరవము, ఆర్జించిన ధనము ఇతరటాకీలకు కలుగలేదు. చౌకబారు పేరుతోనున్న స్థానికులను తీసుకొని ఉపజ్ఞ గల నటులను ప్రకటించి గొప్పనటులనుగా తయారుచేయగల సమర్థతను వీరు ప్రదర్శించిరి. పాత్రలకుతగిన నటుల నెన్నుకొనుట, కథావాతావరణమునకు తగిన హంగు నేర్పరుచుట వీరికి సహజ సామర్థ్యములు. అట్టివీరు మరికొన్ని తెలుగు టాకీలను డైరెక్టుచేసి ఆంధ్రదేశమునకు కీర్తి తెచ్చెదరని నమ్ముచున్నాము.

# బాధ్యతలు

ఒక వ్యక్తిగాని, సంఘంగాని, దేశంగాని అభివృద్ధి అవుతున్నకొద్దీ ఆవ్యక్తి సంఘ దేశాల ప్రవర్తనకు కొంతవిలువ కలగాలంటే బాధ్యతలెరిగి నడుచుకోవటం చాలా అవసరం. ఈ విధంగా బాధ్యతలెరిగి నడుచుకోవటం దేశాలలోకన్న సంఘాలలోనూ, అంతకన్నా వ్యక్తులలోనూ కనపడుతున్నది. కాని అంతటా సహజంగా జరిగేదేమిటంటే సాధ్యమైనంతవరకు—పైన శాసించేవాడు లేనప్పుడు—బాధ్యతలను తోసేసి సంచరించటం. ఇది ఒక విధమైన దౌర్బల్యం. ఒక పసిపిల్లవాడి ప్రవర్తనకు మనమేమీ విలువ ఇవ్వదలవలేదు కనుక వాడికి బాధ్యతలు లేకుండా చేస్తున్నాం. ఒక దేశంయొక్క ప్రవర్తనను శాసించే నాథుడు లేక దేశాలు విచ్చలవిడిగా ప్రవర్తించగలుగుతున్నై. పిల్లవాణ్ణి పెంచటంలో వ్యవహారం ముదిరిపొయ్యేదాకా వాడి ప్రవర్తనకేమీ విలువ ఇవ్వక—ఒక్కొక్కసారి నెగెటివ్ వాల్యూకూడా ఇచ్చి (పిల్ల లేదిచెప్పినా అబద్ధమేననీ, పైన కనిపెట్టి ఉండనప్పుడల్లా వాళ్లు చెయ్యరాని పనులు చేస్తారనీ అనుకోవటమే కాక పిల్లలకే తెలియచెయ్యటం కూడానూ!)—వాడి నెత్తిన ఒక పెళ్లాన్నితోసి, అది కాపరానికి వచ్చిన ఏ సంవత్సరంలోపునో గర్భధారణ కాని పక్షంలో ఈ ముండాకొడుకును వావికాని వాళ్ళదగ్గిర్నించీ వరసలాడి, అకస్మాత్తుగా ఒక దుర్ముహూర్తంలో 'చావు, ముండాకొడకా! ఎట్లా ఈదుతావో సంసారం ఈదు.' అని ఎవరిదారిన వారు చక్కాపోతే వాడు భ్రష్టుడై ఊరుకుంటాడు. ఇంటగెలవటమే వాడికి దుస్సాధ్యంచేసిపెట్టినతరవాత వాడు రచ్చగెలిచేదేమిటి? సంఘంలో ప్రతివ్యక్తికీ ఇదే అనుభవమైతే, ఆసంఘం సనాతన ధర్మాన్ని గురించి మాట్లాడక ఏంచేస్తుంది? ఇటువంటి సంఘాలతో నిండిన దేశంయొక్క రాజకీయాలు మరెవరో చూస్తున్నారంటే ఆశ్చర్యమేమిటి? రేపు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా మన మొహాలుచూసి రాదు. మన ఆర్థికాలు చూస్తున్న పరదేశవాసులే దాన్ని లక్షణంగా అందిపుచ్చుకుంటారు. అమెరికా స్వాతంత్ర్యం రెడ్ ఇండియనుల స్వాతంత్ర్యం అయిందా ఏమిటి? ఇక దేశాలు బాధ్యతలను మన్నించనప్పుడు ఎందుకో చెప్పకుండా భయంకరమైన యుద్ధాలు చెయ్యటమూ, ఏ కొద్దిమందో కలిసి మిగిలిన దేశాన్ని పీల్చి పిప్పిచెయ్యటమూ, విప్లవాలు కలగటమూ, ప్రతి అయిదారేళ్ళకూ నాగరికతలు మొదటికి వస్తూండటమూ జరుగుతుంది ఈ యుగంలో బాధ్యత అనేది ఫాషనులో లేదు.

అసలు మొదటికి వచ్చి విచారించినట్టయితే ఒక శిశువు ప్రపంచంమీద కళ్లు తెరిచినప్పుడు ఆశిశువుయొక్క రాకకు ఎవరూ పూచీపడేవాళ్ళు లేరు. మన పూర్వకర్మ ఫలంచేత మనం కలగటమూ నశించటమూ జరుగుతున్నదంటేనూ ఎవడికష్టసుఖాలకు వాడే బాధ్యుడంటేనూ డివైన్ జస్టిస్ అవునేమో కాని, అది మన ప్రపంచానికి వర్తించేది కాదు. నాకర్మ పరిపాకంకొద్దీ నేను వెళ్ళి ఎవడిజేబులోనించైనా కొంతసొమ్ము తస్కరిస్తే వాడు మూడో మనిషిని (పోలీసును)

దీన్లోకి లాక్కొస్తాడు. కనక ఈ ప్రపంచానికి సంబంధించినంతవరకూ డివైన్ జస్టిస్ మీద కుదరదు. ఒకవేళ అది ఆమోదించుదామన్నా ఎవరు ఒప్పుకోరు, నేనుపుట్టటం నాపూచీ మీదే కనక ఆదేపూచీమీద చచ్చిపోతా నంటే ఒక వంక స్మృతులు ఘోషిల్లుతే, ఒక వంక పోలీసుస్టేషనుకు నడిపిస్తాడు. కావా లంటే ఆత్మహత్య రహస్యంగా చేసుకోవచ్చు ననుకోండి. అప్పుడది రంకుతనం మొదలైన వాటిల్లో చేరుతున్నది కాని సరైన పని కా వటమూ లేదు. కనక ఎవడిపుట్టుకకు వాడు బాధ్యుడు కాడని తేలిపోతున్నది.

ఇక తల్లిదండ్రులు లేమైనా కనే పిల్లలకు పూచీపడతారా? పడరు. ఒకవేళ పడదలుచు కున్నా ఆపూచీ ఎటువంటిదో తెలీదు 'ఇక పిల్లలువద్దో భగవంతుడా!' అని మొత్తు కుంటూ ఏటేటా పిల్లలను కంటున్న దంపతు లున్నారు—ఉన్న పిల్లలకే ఇంత గంజిపొయ్య లేకుండా. వాళ్ళను సంసారసుఖాన్నించి విర మించమనటం క్రూరంగా ఉంటుంది. సంతా ననిరోధం అవలంబించటానికి అటువంటిది ఉందని కూడా తెలీదు. తెలిస్తే అవలంబించ టానికి తగిన దీక్షఉండదు. ఉన్నా ఒకవేళ అటువంటిది వేదసమ్మతం కాదేమో అని అను మానం!......

ప్రపంచం యావత్తూ సంతాన నిరోధం అవలంబించటం మొదలుపెట్టిందనే అనుకుం దాం. ఎవరు సంతాననిరోధం అవలంబిం చాలి? ఎంతవరకు అవలంబించాలి? ఈ సమ స్యలు చప్పున తేలేవికావు. యూజెనిక్స్ శాస్త్రం ఉంది ఉండటానికి. అది చాలా అపరి పూర్ణంగావుంది. నీకు సిఫిలిస్ ఉంటే నీ పిల్లలు కూడా ఆ జాడ్యంతో బాధపడతారు కనక నువ్వు పిల్లలను కనవద్దు' అనిమాత్రం చెబు తుంది యూజెనిక్స్. ఆ విధంగానే వంశంలో పిచ్చిగాని, మూఢ్యం (ఇంబెసిలిటీ) మొదలై నవిగాని ఉంటే ఆ వంశంలో అవి ఉంటూనే ఉంటై కనక ఆ వంశం అంతరించి పోవటం సంఘానికి క్షేమమని తెలుసుకోవచ్చును. ఈ యూజెనిక్స్ ఒక షాగాని, ఒక వెల్స్‌గాని, ఒక నెపోలియన్ కాని, ఒక గాంధీగాని ఎక్కడ పుడతారో చెప్పదు. వీళ్లు పుట్టరు. దేశకాల పరిస్థితులను బట్టి అయిపోవటమే కా—అయినా ఖండితంగా చెప్పగల శాస్త్ర జ్ఞానంలేదు. జ్యోతిషం ఒకటివుంది. ఏ సంస్థ కాసీ పనిపెట్టుకుని ఆ జ్యోతిశ్శాస్త్రం ఎంతవ రకు పరిపూర్ణంగా ఉందో శాస్త్రరీతిగా పరీ క్షించలేదు. నమ్మితే నమ్మటం మానితే మానటంగా ఉంది దాని అవస్థ. ఆ శాస్త్ర మైనా మనిషిని తీసుకునివీడికింత గొప్పకొడుకు (లేక కూతురు) పుట్టవచ్చును అని చెప్పదు.

దీని ఫలితమేమిటంటే ప్రపంచం ఒక విశాలమైన ధర్మసత్రంకింద భావించబడుతు న్నది. ఇందులోకి వచ్చేవాళ్లు వస్తుంటారు, పొయ్యేవాళ్లు పోతుంటారు. ఎవరు వచ్చినా మిగతావాళ్లునూ తనా ఆగంతకుడికి చోటి వ్వాలి. ఈ ధర్మసత్రంలో బసచేసేవారంతా రకాలవారిగా ఉన్నారు. ఒక రకానికి తదిత రులకు లేని హక్కులూ అవీ వున్నై. వారిది ఉన్నతస్థానం. దాదాపు వారి ఇష్టంమీద ఇతరు లెట్లా బతకవలిసిందీ ఆధారపడుతుంది. ఈ అగ్రస్థానం ఒకప్పుడు మతప్రచారకుల వశంలో ఉండేది. తరవాత యుద్ధంచేసి జయిం చగల బలశాలుల చేతులో వుండేది. ఇప్పుడు వ్యాపారస్థుల చేతులోవుంది, త్వరలో సేవా పరాయణుల చేతిలోకి పోయ్యేలక్షణాలు కని పిస్తున్నై. ఎవరు అగ్రస్థానంలో ఉన్నా ప్రతి వ్యక్తి తనయొక్క ఆహారనిద్రాదులకోసం

ఇంకోరు పూచీపడతారనుకోవటానికి వీల్లేదు. కావలిస్తే ప్రపంచం వ్యక్తిని తన యిష్టంవచ్చినట్టు వాటిని సంపాదించుకోకుండా అరికడుతుంది. అరికట్టటంవరకే దాని బాధ్యత. నేటివరకూ విడవకుండా వచ్చిన నాగరికతలో ఇదొక చెప్పుకోతగ్గ లక్షణం. సంఘం నిన్నెవరూ హత్యచెయ్యకుండా ఆపదు. కావలిస్తే హంతకుణ్ణి పట్టుకోకలిగితే శిక్షిస్తుంది! అంతవరకే బాధ్యత. అగ్రస్థానంవారు ఏర్పాటు చేసిన రూల్సుకు భిన్నంకాకుండా ఈధర్మ సత్రానికి ఉన్మాదిగా చెందిన ఆ స్త్రీలో కొంత గాంగిలించగలిగినట్టయితే నువ్వు సత్రానికి చేసిన ఉపకారానికి నిన్ను కష్టపడకుండా ఆహార నిద్రాదులు పొందనిస్తుంది. లేదా? అది ఎవరిపొరపాటైనాకాని, నువ్వు ఆ స్తితిలేనివాడివై పుట్టావా, ఆ పొరపాటుయొక్క ఫలితం నువ్వనుభవించు. కూలిచెయ్యి, ఎంతముట్టితే అంత తీసుకో, చాలకపోతే చావు. కాని అగ్రస్థానంలో ఒకప్పుడున్నవారు చేసినపనే, దేశాలింకా చేస్తున్నపనే, చేసి నీబలంచేత ఎవడినైనా కొట్టి వాడి తాలూకు ద్రవ్యం అనుభవిస్తే సంఘం నిన్ను శిక్షించటం దానియొక్క బాధ్యత ఐవున్నది. నన్ను పుట్టకుండానే యీ సంఘం చేసిఉండరాదా అంటావా? అది ఈ సంఘంయొక్క నాగరికతకు అనుకూలమైన పనికాదు. ఇంత సంఘంలోనూ ఏడజనుమందికి మెదడనేది ఉన్నా ఒక సంశయంతట్టివుండను. తిండికీ గుడ్డకూ లేక మాడుతున్నవాళ్ళూ, ఇల్లువాకిళ్ళు లేక అల్లాడేవాళ్ళూ, బ్రహ్మచర్యవైధవ్యాలచేత తపించేవాళ్ళూ ఈ సంఘానికి చెందినవాళ్ళేనా? అటువంటివాళ్ళు సంఘంలో ఉన్నంతకాలమూ సంఘం నాగరికతగలదానల్లే నటించటానికేమైనా అధికారముందా? అరణ్యమృగాలకు స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ ఉన్నదంటే, ఆ జంతువుల స్ట్రగుల్‌ను ప్రతిఘటించి వాటి ప్రవర్తనను శాసించే నాగరికతా పరిస్తితులు లేవు. ఒక అరణ్యమృగం ప్రాణాలు అరిచేతుల్లో పట్టుకుని ఆహారం సంపాదించుకోటానికేపనైనా చేస్తుంది. ఒక్కొక్కజంతువు తన సంతానాన్ని తనే మింగుతుంది. ఈ నాగరిక సంఘంలో అటువంటిదిలేదే? ప్రతిరోజూ దొంగతనాలూ హత్యలూ జరగవు ప్రతిరోజూ యుద్ధంరాదు. అయినా పోలీసుడిపార్టుమెంటుకిందా సైన్యంకిందా వల్లమాలినధనం వ్యయపరచబడుతున్నది. ప్రతిరోజూ ఆకలితో మాడుతున్నారు. పోలీసుడిపార్టుమెంటుయొక్క ఆవశ్యకత చాలాభాగం ఇట్లా మాడుతున్నవాళ్ళవల్లనే కలుగుతున్నది. దమ్మిడీ ఖజానాకు రూపాయికావలా! ఇదెందుచేత? తిండిలేనివాళ్ళకు తిండిపెట్టే బాధ్యత ఎవరికీ అక్కర్లేదు.

నేను చెప్పినట్టు బాధ్యతఅనేది ఘాపనూలేదు. 'ఈ మనిషి ఇంత నీచమైనపనీ ఇంతకన్న ఎక్కువ నీచమైనపనులూ చెయ్యడు!' అని లోకం నమ్మగలగటం ఆ మనిషి తన బాధ్యతలెంతవరకు గుర్తెరిగాడో తెలుస్తుంది. అనేకమందిని చూపించి 'వీళ్ళు కాస్తకూస్త డబ్బుకు గడ్డితినరు.' అని చెప్పగలం. 'ఈ మనిషి లక్షలకైనాసరే గడ్డితినడు!' అని చెప్పదగిన మనుష్యులుకూడా ఉన్నారు. అటువంటివాళ్లు సంఘానికెంతో అవసరం. ఎందుచేతంటే పొద్దస్తమానమూ ప్రతిమానవుడూ ప్రతి ఇతరమానవుణ్ణీ బాధ్యతలేని, నమ్మదగనివాణ్ణిగా చూస్తూ ఉండటం అసంభవం. కాని సంఘువిషయం అంతగట్టిగా చెప్పలేం. దేశాలవిషయం అడగక్కర్లేదు.

ఇంత సనాతనధర్మ బుద్ధిగల ఈ సంఘం

ఎంత నీచానికైనా ఒడిగట్టుతుంది. సముద్ర యానంచేసి వచ్చినవాళ్ళను బహిష్కరిస్తుంది. ఒకవేళ తనపనిమీదే ఎవరినైనా ఇంగ్లండుపంపించి (ఏ ప్రత్యేకరాష్ట్రం కావలిసో) తిరిగి వచ్చిన తరవాత ప్రాయశ్చిత్తం చేస్తుంది. చేజేతులా చేసినపనికి ప్రాయశ్చిత్తం! సంఘదార్జన్యానికి గురికాకుండా ఒక స్త్రీ ఒంటరిగాఉంటే దానికామని పేపూచీ అనుకోగలం. పదేళ్ళపిల్ల వితంతువైతే పదేళ్ళ పిల్లను అనవసరంగా పెళ్ళిచేసినతను ఆ పిల్ల భావికష్టసుఖాలనుపూచీ పడకపోయినప్పటికీ ఆ అభాగిని తిరిగి పెళ్ళాడితే ఆ వివాహాన్ని ఖండించేస్తుంది. ఇందులో సంఘం ఛూపుతున్న ఇంటలెక్చువాలిటీ ఏమైనా ఉందా అంటే అదేమీలేదు. కేవలం ఈ శాసించటం తన అభిరుచిని అనుసరించిమాత్రమే. వేదాధ్యయనం చెయ్యరూ? నిత్యాగ్నిహోత్రం చెయ్యరూ? నిజంగా బ్రాహ్మణవర్ణంవాళ్ళు కారూ? ఫరవాలేదు! వివాహం 14 ఏళ్ళ పిల్లకు చేస్తారూ? అది తాటాకుగ్రంథాల్లో ఎక్కడుందో చూపండి! ఇది తెలివంటారా? అభిరుచా? తన అభిరుచులను వ్యక్తులమీద పామే సంఘాని కెంతబాధ్యత ఉండవచ్చునో ఊహించండి.

—కొండవటిగంటి కుటుంబరావు.


## జాతకము, ప్రశ్న

జాతక చక్రములుగాని, జనన సంవత్సరం, జననకాల ఘడియలు లేక గంటలుగాని, మాకు ఉత్తరము వ్రాయుకాలము వయస్సుగాని, రెండు అరచేతి ముద్రలుగాని పంపినచో జాతకుని రూపలక్షణములు, ధనము, విద్య, సంతానము, కళత్రము, ఆయుర్దాయము, భాగ్యము, ఉద్యోగము, జీవనము మొదలగు 25 విషయములు వ్రాయుటకు రు 2-4-0. సం॥ర ఫలితము నెలలవారీ క్యారక్టరు రీడింగులో 1-4-0. మీ యిష్టమువచ్చిన అయిదు ప్రశ్నలకు జవాబు 1-4-0. వలయువారికి వి.పి.గా పంపుదుము.

పురాతన జ్యోతిష గ్రంథములు

గౌతమ సంహిత వెల రు 0-8-0 వాంఛానాధీయము వెల రు 0-8-0 జాతకరాజీయము వెల రు 1-0-0

పై మూడు జ్యోతిష గ్రంథములును పురాతన తాళపత్ర గ్రంథములనుండి యెత్తివ్రాసి తెలుగు తాత్పర్యముతో సహా అచ్చొత్తించి యున్నాము. జ్యోతిశ్శాస్త్రమునకే యీమూడు గ్రంథములు ఆధారభూతములని వాడుకపైని మీరే గ్రహించగలరు. పోష్టుఖర్చులు వేరు.

కొంపెల్ల నరసింహశాస్త్రి, శాస్త్రీజ్యోతిషాలయము, తుని (తూర్పు గోదావరి.)

## ఐరావతి

లక్షా అరువదివేల బర్మాఆంధ్రుల క్షేమాభివృద్ధులకు ప్రతిశనివారము వెలుపడు ప్రజాహితపత్రిక. 7 సంవత్సరములనుండి బర్మాఆంధ్రులశ్రేయోభివృద్ధికై పాటుపడుచున్నది ఇది ఆంధ్రులకు అండ. కార్మికులకు పట్టుకొమ్మ. యువజనోద్యమమునకు ఉనికి. నిర్మోమాటముల నిప్పు. అన్యాయముల నంతరింప జేయుటకు బ్రహ్మాస్త్రము. అంతర్యమెరిగినవారికి హాయి, చదివినవారికి మిఠాయి.

సంవత్సరపుచందా రు. 3-0-0. తపాలాఖర్చులతో 3-12-0.

చిరునామా :

ఐరావతి పత్రికా కార్యాలయము, 233 బార్ స్ట్రీట్, రంగూను.

ఆంధ్రభూమియందు ప్రప్రథమమున స్థాపింపబడిన

# ఆంధ్ర ప్రావిడెంటు కంపెనీ,

## లిమిటెడ్

ప్రధాన కార్యస్థానము :—బెజవాడ. స్థాపితము 1929.

మేనేజింగు డైరెక్టరు :

మ-రా-రా-శ్రీ దిట్టకవి వీరరాఘవయ్యపంతులుగారు.

**స్వల్ప ప్రీమియములు.** **నవీనపద్ధతులు.**

ప్రత్యేక సౌకర్యములు.

1. స్త్రీ పురుషులకు సమానమైన ప్రీమియం రేట్లు.
2. రు 100 లు మొదలు రు 500 ల వరకు పట్టాలు జారీచేయబడును,
3. వైద్యపరీక్ష లేని భీమాపద్ధతులు,
4. క్లెయిములు గ్యారంటీ చేయబడినవి,
5. పట్టాదారులకు ఋణము లియ్యబడును,
6. జననభీమాలో నెలకు 1 రూ. లేక 2 రూపాయలు ప్రీమియం చెల్లించిన రు 500 లు లేక రు 1000 ల వరకు క్లెయిమును పొందవచ్చును. కవల పిల్లలు జనించిన రెండు క్లెయిములు యియ్యబడును.
7. ఉత్తర ప్రత్యుత్తరములు తెలుగుభాషలో జరుపవచ్చును.
8. పట్టాదారులకు ఫలప్రదమును సహాయకరమునగు సేవయే ఆదర్శము.

ఏజంట్లకు ధారాళమైన కమీషను యియ్యబడును.

జననభీమా శిశు పోషణకు గొప్ప సహాయకారి.

**పూర్తి వివరములకు :**

సూపరింటెండెంటు ఆఫ్ ఏజన్సీస్.

ఆంధ్రప్రావిడెంటుకంపెనీ,

గాంధినగర్, బెజవాడ.